ప్రజాహితమే మా అభిమతం

# సాక్ష్యం


తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
బుధవారం, 19 మార్చి 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 77
పేజీలు: 08 | వెల: రూ.2:00

WWW.SAKSHYAM.COM



## యుద్ధానికి ముగింపు పలికేనా?

రష్యా -ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్, ట్రంప్ చర్చ
రెండు గంటలకు పైగా సుదీర్ఘ చర్చ

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): ఏళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు లభించబోతుందా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ చొరవ తీసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేయడం సంచలనంగా

మిగతా 2 లో..



## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

ప్రజాస్వామ్యంలో పోలీస్ రాజ్యం కారాదు
ట్రయల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన

మిగతా 2 లో..



ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దామోదర రాజనర్సింహ ప్రవేశ పెట్టిన ఈ ఈ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రేవంత్ అసెంబ్లీలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోందన్నారు. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు అసెంబ్లీ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

- అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం
- వేతనాల పెంపుపై ఉద్యోగుల ఎదురుచూపు
- డీఏ బకాయిలు విడుదలపై గంపెడాశలు

హైదరాబాద్,మార్చి18(సాక్ష్యం): అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉ ండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉ ద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉ ండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు భారీ ఆశల్లో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2 లో..

**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది.**



# రిజర్వేషన్లు పెంచుతాం

- వర్గీకరణ వల్ల ఎవరికీ అన్యాయం జరగదు
- దశాబ్దాల పోరాటానికి గొప్ప విజయం
- ఆదినుంచి దళితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ
- దళితులను ముందువరసలో నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ బిల్లు

హైదరాబాద్,మార్చి18(సాక్ష్యం): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉ ంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్య ను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు

మిగతా 2 లో..



## అఖిలపక్ష భేటీకి అనుమతివ్వండి

- కేంద్రం ఆమోదిస్తే రిజర్వేషన్ అమలు
- ప్రధానమంత్రి మోదీకి రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్,మార్చి18(సాక్ష్యం): తెలంగాణ శాస సభ బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లును ఆమోదించింది. ఈ ఇష్యూను ఇప్పుడు దీన్ని కేంద్రం కోర్టులో వేసిన రేవంత్ సర్కారు

మిగతా 2 లో..

## కుంభమేళా ఓ అద్భుత కార్యక్రమం



- లోక్‌సభలో ప్రధాని మోడీ అభినందనలు
- కుంభమేళా విజయవంతం సరే..
- తొక్కిసలాట మృతులకు కనీసం నివాళి ఏదీ?
- ప్రధాని మోడీపై విపక్షనేత రాహుల్ విసుర్లు

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): కుంభమేళా ద్వారా భారత వైభవాన్ని యావత్ ప్రపంచం వీక్షించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఅన్నారు. ఎంతో పరమపవిత్రంగా ఈ క్రతువు జరిగిన తీరు ప్రపంచాన్ని కూడా అబ్బురపరచిందని అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో కుంభమేళా గురించి ప్రస్తావించారు. ప్రయాగరాజ్‌లో కుంభమేళా విజయవంతంగా నిర్వహించడం సమిష్టి కృషికి అసలైన ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. కుంభమేళా విజయవంతం చేసేందుకు ఎందరో తమ వంతు పాత్ర పోషించారు. ఆ కర్మ యోగులందరికీ నా ధన్యవాదాలని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఆలవాలమైన భారత సంస్కృతి కుంభమేళాలో ఆవిష్కృతమైందని ప్రధాని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న యుద్ధాల కారణంగా దేశాల మధ్య ఎడం పెరుగుతున్న నేపథ్యంలో భారత దేశం.. భిన్నత్వంలో ఏకత్వమే తన ప్రత్యేకత అని కుంభమేళాతో గొప్పగా చాటుకుందని పేర్కొన్నారు. మహా కుంభమేళాలో

మిగతా 3 లో..

## పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటింగ్ శాతం నమోదు

- వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని కేసు
- సుప్రీం ధర్మాసనం ముందుకు విచారణ
- సంసిద్ధత వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- తదుపరి విచారణ జూలై 28కి వాయిదా
- ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానం
- అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం కీలక భేటీ

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల ఓటింగ్ శాతాన్ని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు తెలిపింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన 48 గంటల్లోపు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల ఓటింగ్ శాతం డేటాను తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఈసీని ఆదేశించాలని 2019లో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, ఎన్జీఓ అసోసియేషన్ ఫర్

మిగతా 3 లో..

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది

- నీవు క్షేమంగా తిరిగిరావాలని కోరుకుంటున్నాం
- భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం
- సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని,

మిగతా 2 లో..



## కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం, ఏపీకి సుప్రీం నోటీసులు

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల కేటాయింపుపై అభ్యంతరం
- 2021లో నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం
- కేంద్రం నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ పిటిషన్
- ఏపీ, తెలంగాణ పిటిషన్లపై సుప్రీం విచారణ
- రెండు వారాల్లో కౌంటర్ వేయాలని నోటీసులు

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): కృష్ణానది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 2021లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. మరోవైపు అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ నీటిని వాడుకుంటోందని ఏపీ ప్రభుత్వం సైతం సుప్రీంలో

మిగతా 3 లో..



## పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

- చర్చలు లేని రోజే కేసీఆర్ వచ్చి వెళతారు
- మామూలు రోజుల్లో సభను ఎదుర్కొనే ధైర్యం లేదు
- దేవాదుల పంపులను ప్రారంభించిన మంత్రులు

వరంగల్,మార్చి18(సాక్ష్యం): గత పదేళ్లు దేవాదులను నిర్లక్ష్యం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఉన్నప్పుడే దేవాదుల ఫేజ్ 1 పూర్తయిందన్నారు. మూడో ఫేజ్ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉ ందన్నారు. దేవాదుల పంప్ హౌస్ ఫేజ్ 3 లో భాగంగా నిర్మించిన మోటార్లను మంత్రులు ఉ త్తమ్, పొంగులేటి ఆన్ చేశారు. ఒక మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి.. గత ప్రభుత్వం కమిషన్ల కోసమే తాపత్రయపడింది కానీ.. ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ పేరుతో 39 వేల కోట్లు- ఖర్చు చేసినా ఎలాంటి

మిగతా 3 లో..



## యాదగిరిగుట్టలో వైటీడీ బోర్డు..

యాదగిరిగుట్టకు ధర్మకర్తల మండలి

- 18మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు
- అసెంబ్లీలో మంత్రి కొండా సురేఖ వెల్లడి



హైదరాబాద్,మార్చి18(సాక్ష్యం): యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ.. 18 మంది సభ్యులతో వైటీ-డీ బోర్డు ఉంటుందని చెప్పారు. బోర్డు పదవీకాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు ఛైర్మన్, సభ్యులకు ఎలాంటి జీత భత్యాలు ఉండవన్నారు. వైటీడీ బోర్డు కూడా విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చన్నారు.

మిగతా 3 లో..

# సంపాదకీయం

## సమస్యలపై స్పష్టత లేని విపక్షాలు !

పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఘోరంగా విఫలం అవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చకు తేవడం లో ఆ పార్టీ గత కొంత కాలంగా పార్లమెంటులో విఫలం అవుతోంది. ఎంతసేపు కేవలం బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందే తప్ప..సమస్యలను ఆధారంగా చేసుకుని బిజెపిని విమర్శలు చేయడం లేదు. పార్లమెంట్ ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిల మధ్య వ్యక్తిగత ఎజెండాగా మారింది. మిగతా విపక్షాలు కూడా అలాగే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో గతంలో చక్కటి చర్చ జరిగేది. ప్రభుత్వం కూడా చర్చలకు అవకాశం ఇచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సాదాసీదాగా పార్లమెంట్ సమావేశాలు సాగుతు న్నాయి. ఏ పార్టీ ఎజెండా దానికి ఉంది. దాని ప్రాకరమే సాగుతున్నారు. డిఎంకె హిందీవ్యతిరేకత, డీలిమిటేషన్‌పై పోరాడుతోంది. ఆ అంశాలను ప్రస్తావించి హడావిడి చేసింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఈ పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ పోతున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చింది చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టింది ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. యోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బ తీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు జిఎస్‌టి వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. బలమైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పత్తి, మిర్చి, పసుపు,వరి పండించిన రైతులే నిదర్శనం. వ్యయసాయానుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి ఉంటే నిరుద్యోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు ఇప్పుడు చేష్టలు ఉడిగి చూస్తున్నారు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి కారణంగా మొన్నటి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీసిందని చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. నిజంగానే ఇదే సాకారం కావాలంటే స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి. పంటల కొనుగోలుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పడాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. చైనా ఈ రకమైన విజయాలతోనే ఆర్థికంగా విజయం సాధించిందని వేరుగా చెప్పనక్కరలేదు.

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది

మొదటిపేజీ తరువాయి..



ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ.దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఈ సందర్భంగా సునీత విలియమ్స్‌కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. సునీత విలియమ్స్ సురక్షితంగా భూమ్మీదకు రావాలని మొత్తం ప్రపంచం ఎదురుచూస్తోందని..మోదీ పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు.

# ప్రవేశ పెట్టనున్న భట్టి

మొదటిపేజీ తరువాయి..

నెరవేరుస్తుందని ఆశిస్తున్నారు. కరువు భత్యం పెంపుతోపాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు, వేతనాల పెంపు, బకాయిలు వంటి వాటి కోసం ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తీరుపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో తమకు ఏదైనా కానుకలు ఏవైనా ఉంటాయేమోనని ప్రభుత్వ ఉద్యోగ వర్గాలు ఆశిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేనట్టు కరువు భత్యం బకాయిల్లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోంది. ఉద్యోగులు, పింఛన్‌దారులకు కీలక అంశంగా ఉన్న డీఏ బకాయిలు విడుదల చేస్తుందని ఉద్యోగులు ఆశిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లభించడం లేదు. ఒకటో తారీఖున జీతం ఆర్భాటంగా ప్రకటించినా మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రత్యేక కానుకలు కాదు కదా ఇవ్వాల్సిన ప్రయోజనాలు కూడా పక్కన పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఒకటో తారీఖు జీతాలు అందకపోగా సమయానికి అందాల్సిన ప్రయోజనాలు ఉద్యోగులకు లభించడం లేదు. ముఖ్యంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు లభించడం లేదు. ఈ కారణంగా ఉద్యోగుల పదవీ విరమణ వయసును 68 ఏళ్లకు పెంచే యోచన ప్రభుత్వం చేస్తుందనే ప్రచారం ఉద్యోగ వర్గాలను కలవరపరుస్తోంది. ఇటీవల జరిగిన కొన్ని సభల్లో రేవంత్ రెడ్డి ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఉద్యోగులు ప్రభుత్వం నుంచి ఆశించవద్దని.. సర్దుకుపోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. అయినా కూడా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆశ చావడం లేదు. బడ్జెట్‌లో ఏదో ఒక ప్రకటన ఉంటుందని ఆశాభావంలో ఉన్నారు. మొత్తం ఐదు డీఏలు పెండింగ్ ఉండడంతో వాటిలో కనీసం రెండు ఇస్తుందనే ఆశల్లో ఉద్యోగులు ఉన్నారు. అయితే బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశే ఎదురవుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.

# రిజర్వేషన్లు పెంచుతాం

మొదటిపేజీ తరువాయి..

అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ- వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది.

ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిపార్సుతో పాటు- ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు-కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు-ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు..' 1996 నాటికి మాదిగలు 18 వేల ఉద్యోగాల్లో ఉండగా, వాటిలో 80-90 శాతం నాల్గో తరగతి ఉద్యోగాలే. మరోవైపు, మాలలు అన్ని రకాలవీ కలిపి 72 వేల ఉద్యోగాల్లో ఉన్నారని అన్నారు. కాగా దేశంలో రిజర్వేషన్ల పెంచాలన్నా, తగ్గించాలన్నా, ఆయా కులాల జాబితాను మార్చాలన్నా రాష్ట్రాలకు అధికారం లేదు. ఈ అంశం కేంద్ర జాబితాలోది. కేంద్రమే నిర్ణయం తీసుకోవాలి. ఇక చట్ట సభల ఆమోదం పొందిన ఈ రిజర్వేషన్ల పెంపు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. ఆ బిల్లును పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించాలి. ఎందుకంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అలా మించితే రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్ -9లో చేర్చాలి. ఈ రిజర్వేషన్లు బీసీలకు రిజర్వేషన్ పెంచి ఇస్తే ప్రస్తుతం ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం కలుపుకుంటే మొత్తం 67 శాతానికి చేరుకుంటుంది. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకం. అలా సవరణ చేయాలంటే అందుకు సరైన కారణాలు వెల్లడించారు. అందుకు తగిన గణాంక సమాచారం అందుబాటులో ఉంటే అప్పుడు తగిన కారణాలతో రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువగా పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఈ కారణలతోనే రేవంత్ సర్కార్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసి లీగల్‌గా ఎదుర్కనే రీతిలో పటిష్టంగానే బీసీ గణన చేపట్టింది. సమగ్ర కుటుంబ సర్వే తర్వాతనే బీసీ లెక్కలను తెల్చి చెప్పింది. ఆ తర్వాత చట్టసభల్లో ఈ బిల్లులకు ఆమోద ముద్ర పడింది. ఇక ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బంతి కేంద్రం కోర్టులో పడేసింది. పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మద్దతు ఇస్తే రాజ్యాంగ సవరణ వీలవుతుంది. అప్పుడే రాష్ట్రంలో పెంచిన బీసీ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందే బీసీ గణన చేపడతామని చెప్పింది. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ముఖ్యనేత రాహూల్ గాంధీ చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో ఇదే ప్రస్తావించారు. అందుకు అనుగుణంగా రేవంత్ సర్కార్ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపింది.

అయితే దేశవ్యాప్త కులగణన విషయంలో మోదీ సర్కార్ సానుకూలంగా స్పందిస్తుందా అన్నది వేచి చూడాలి. ఎందుకంటే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీసీలంతా ఐక్యంగా ఉండాలని, బీసీ లెక్కలు అవసరం లేదన్న రీతిలో మోదీ నర్మగర్భంగా తన అభిప్రాయాన్ని వెళ్లడించారు. ఇప్పుడు తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంపు బిల్లుకు ఆమోద ముద్ర వేస్తే అది కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఓ అస్త్రంగా మారనుంది. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు మేం బీసీలకు మేలు చేసేలా రిజర్వేషన్లు పెంచామని, పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది చేసి చూపించామని చెప్పుకునే పరిస్థితి ఉంటుంది. అలా బీసీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు దగ్గరయ్యే అవకాశం లేకపోలేదు. ఇలా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేలా మోదీ సర్కార్ తెలంగాణ బీసీ రిజర్వేన్ల పెంపు బిల్లుకు సానుకూలంగా స్పందిస్తుందా లేదా చూడాలి. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుకూలంగా ఎన్డీఏ ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే తేనె తుట్ట కదిపినట్లే. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల నుంచి రిజర్వేషన్ల పెంచాలన్న డిమాండ్లు వస్తాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ఈ సమస్య ఎదురుకావచ్చు. ఒక వేళ ఈ రిజర్వేషన్ల బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండా పక్కన పెడితే బీసీ వ్యతిరేక పార్టీగా బీజేపికి తెలంగాణలోను, దేశవ్యాప్తంగా ముద్రపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి డిమాండ్లే ఏపీ నుంచి, ఇతర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చే అవకాశం ఉంది. వారిని కాదని కేంద్రంలో బలహీనంగా ఉన్న బీజేపీ పార్టీ నిర్లయం తీసుకోలేని పరిస్థితి. ఒక వేళ తీసుకుంటే ఆ సక్సెస్ తన ఖాతాలో పడుతుందా లేక మొదటి నుంచి బీసీ రాగం వినిపించిన కాంగ్రెస్ ఖాతాలో పడుతుందా అన్న డైలమా కమలనాథుల్లో లేకపోలేదు. రానున్న రోజుల్లో ఈ బీసీ ఉచ్చు నుంచి బీజేపీ ఎలా తప్పుకుంటుందో వేచి చూడాలి. అయితే తెలంగాణలోని రాజకీయ పార్టీలను తీసుకుని ప్రధానికి కలవాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ రిజర్వేషన్ల బిల్లు ఎందాక ముందుకు సాగి ఆచరణలోకి వస్తుందో మాత్రం వేచి చూడాలి.



# అఖిలపక్ష భేటీకి అనుమతివ్వండి

మొదటిపేజీ తరువాయి..

దానిపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందుకే ఈ అంశంపై ప్రధానమంత్రి మోదీకి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. బీసీలకు విద్య, ఉద్యో, రాజకీయ అంశాల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చే బిల్లును తెలంగాణ శాసనసభ ఆమోదించింది. దీన్ని కేంద్రం ఆమోదిస్తే తప్ప రిజర్వేషన్ అమలు చేయడం సరికాదు. అందుకే ఈ ఇష్యూలో కేంద్రం వద్దకు అఖిలపక్షం తీసుకెళ్లాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి వచ్చే అఖిలక్షం కలిసేందుకు సమయం ఇవ్వాలని ప్రధానమంత్రికి లేఖ రాశారు రేవంత్ రెడ్డి. బీసీ రిజర్వేషన్ అంశంపై చర్చించేందుకు అపాయింట్ ఇవ్వాలని అందులో విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ ప్రకారం ఉన్న రిజర్వేషన్‌లో 50% మించి ఉండకూడదు. ఇప్పుడు తెలంగాణ ఆమోదించిన బిల్లు చట్టం కావాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ అవసరం ఉంటుంది. అందుకే దీనిపై చర్చించేందుకు ప్రధాని కలిసి ఒప్పించేందుకు రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరారు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కూడా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఇటీవల తెలంగాణలో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు పొట్టి శ్రీరాముల పేరు పెట్టాలని అందులో పేర్కొన్నారు. కొత్త టెర్మినల్ కేటాయించినందుకు ధన్యవాదాలు తెలుపుతూనే తెలుగు ప్రజల ఆత్మగౌరవం అమరజీవి పొట్టిశ్రీరాములు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎప్పటి నుంచో తెలుగు యూనివర్శిటీకి ఉన్న పొట్టి శ్రీరాముల పేరును తెలంగాణ ప్రభుత్వం తొలగించింది. ఆ పేరు స్థానంలో సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టారు. దీనిపై అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో కొత్తగా నిర్మించిన టెర్మినల్‌కు ఆ పేరు పెట్టాలని కేంద్రానికి సూచిస్తున్నారు.

## యుద్ధానికి ముగింపు పలికేనా?

మొదటిపేజీ తరువాయి..

మారింది. ఇద్దరు దేశాధినేతలు కొన్ని నిమిషాల పాటు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం ముగింపుపై చర్చించుకున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమయ్యేలా ఉన్నాయి. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ ఒకడుగు ముందుకువేసి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేశారు. వారిద్దరూ సుమారు రెండు గంటలకు పైగా చర్చలు చేశారని వైట్‌హౌస్ నుంచి వార్తలు వచ్చాయి. అయితే పుతిన్‌తో చర్చలకు సంబంధించి ట్రంప్ ముందుగానే వివరాలను చెప్పారు. పుతిన్‌తో తాను మాట్లాడబోతున్నట్లు.. భూమి, విద్యుత్ కేంద్రాలు, ఆస్తుల విభజనపై చర్చిస్తామని ప్రకటించారు. చెప్పిన మాట ప్రకారం పుతిన్‌కు ట్రంప్ ఫోన్ కాల్ చేయడం విశేషం. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలుకుతానని డొనల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాను అధికారంలోకి వస్తే ఉక్రెయిన్ యుద్ధం ముగిస్తానని చెప్పిన మాట ప్రకారం ఆ ప్రయత్నాలు ట్రంప్ చేస్తున్నారు. ట్రంప్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించారు. 30 రోజుల కాల్పుల విరమణ జరుగుతున్న సమయంలో పుతిన్‌కు ఫోన్ చేయడం విశేషం. అయితే వీరిద్దరి మధ్య ఫోన్ సంభాషణలో ఏయే అంశాలు చర్చకు వచ్చాయనేది ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ కొనసాగించేందుకు పుతిన్‌కు ట్రంప్ అంగీకరించేలా చేసి ఉండవచ్చని చర్చ జరుగుతోంది. ట్రంప్ చొరవతో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఈ యుద్ధం ప్రభావం అంతర్జాతీయ మార్కెట్‌తోపాటు చాలా దేశాలపై తీవ్ర ప్రభావం పడింది. అంతేకాకుండా వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. లక్షలాది ప్రజలపై ఈ యుద్ధం తీవ్ర ప్రభావం చూపింది.

## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

మొదటిపేజీ తరువాయి..

పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి బెంచ్ బెయిల్ మంజూరుచేసింది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకుతీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరుచేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.






## పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటింగ్ శాతం నమోదు

మొదటిపేజీ తరువాయి..

డెమోక్రటిక్ రిఫార్మ్స్ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ రెండు పిటిషన్లపై మంగళవారం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పోల్ ప్యానెల్ తరపున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ ఫిర్యాదును చర్చించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సమావేశమయ్యారని.. పిటిషనర్లు ఆయనను కలిసి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ధర్మాసనానికి తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల ఓటింగ్ శాతాన్ని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌పై చర్చించడానికి ఈసీ సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల ఓటింగ్ శాతాన్ని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌పై చర్చించడానికి సిద్ధంగా ఉందన్న ఈసీ వాదనను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. 10 రోజుల్లోగా పోల్ ప్యానెల్ ముందు తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిటిషనర్లకు సూచించింది. అనంతరం ఈ పిటిషన్ల తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. ఓటరు జాబితాల తయారీలో అక్రమాలు జరిగాయంటూ విపక్షాలు తీవ్రస్థాయితో విమర్శిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానంపై కీలక ప్రకటన చేసింది. ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఈ అనుసంధాన




ప్రక్రియ చేపట్టనున్నట్లు- తెలిపింది. ఇందుకోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ- ఆఫ్ ఇండియా, ఈసీ సాంకేతిక నిపుణుల మధ్య త్వరలోనే చర్చలు ప్రారంభం అవుతాయని ఓ ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బిర్ సింగ్ సందు, వివేక్ జోషీలు మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేచర్ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ- శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవోతో పాటు- ఈసీ సాంకేతిక నిపుణులతో సమావేశమై చర్చించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు- హక్కు ఉంటు-ంది. అయితే, ఆధార్ కేవలం వ్యక్తి గుర్తింపును మాత్రమే నిర్ధారించగలిగే పత్రం. అందువల్ల ఓటర్ల గుర్తింపు కార్డు (ఊఒఈ)ని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనలు, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీ-లో నిర్ణయించారు. ఇందులో భాగంగా యూఐడీఏ, ఈసీ - టె-క్నికల్ నిపుణుల మధ్య చర్చలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

## 'డీలిమిటేషన్'కు సుప్రీంకోర్టు గడువు

### కేంద్రానికి 3 నెలల గడువు విధింపు

న్యూఢిల్లీ,మార్చి18(సాక్ష్యం): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాడివేడి చర్చ జరుగుతోంది. ఈ తరుణంలో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మూడు నెలల సమయాన్ని మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వినతిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం సానుకూలంగా పరిగణించింది. ఆ నాలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టేందుకు మరో మూడు నెలల సమయాన్ని కేటాయించింది. ఈ అంశంపై తదుపరి విచారణను జులై 21వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర సర్కారుకు నిర్దేశించింది. గతంలో ఇదే అంశంపై వాదనలను వినే క్రమంలో డీలిమిటేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయరాదంటూ 2020లో రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడినప్పటికీ, ఈ విషయంలో జాప్యం జరగడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అప్పట్లో సుప్రీంకోర్టుకు కేంద్రం బదులిస్తూ, "అరుణాచల్, నాగాలాండ్‌లలో డీలిమిటేషన్‌పై మేం ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియను మొదలుపెట్టాం. హింసాకాండ కారణంగా మణిపూర్‌లో ఈ విషయంలో ముందడుగు వేయలేకపోతున్నాం" అని తెలిపింది. 2020 ఫిబ్రవరి 28న జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి ఈ నాలుగు రాష్ట్రాల్లో త్వరితగతిన డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలంటూ రెండేళ్ల క్రితం ఒక ఈశాన్య రాష్ట్ర సామాజిక సంస్థ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ విచారణ జరుగుతోంది. పిటిషనర్ తరపున అడ్వకేట్ జి.గాంగ్‌మీ వాదనలు వినిపిస్తున్నారు. "డీలిమిటేషన్ ప్రక్రియ విషయంలో 2023 ఆగస్టు వరకు అసోంలో కొంత పురోగతి జరిగింది. కానీ మిగతా ఈశాన్య రాష్ట్రాల్లో దీనిపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టడం లేదు. ఈ విధంగా ఒక్కో ఈశాన్య రాష్ట్రానికి ఒక్కో విధమైన విధానాన్ని అమలు చేయడం సరికాదు. ఇలా చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కుకు భంగం కలిగించినట్టే. 2002లో డీలిమిటేషన్ సవరణ చట్టం చేసినప్పటి నుంచి అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, అసోంలలో డీలిమిటేషన్ జరగలేదు. దీనివల్ల ఆయా రాష్ట్రాలు నష్టపోతాయి" అని జి.గాంగ్‌మీ వాదిస్తున్నారు.

## కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం, ఏపీకి సుప్రీం నోటీసులు

మొదటిపేజీ తరువాయి..

పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషన్‌లో ఏపీ కోరింది. ఈ మేరకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై




సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కేంద్రం ఇచ్చిన పిటిషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలని తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై 2 వారాల్లో కౌంటర్ వేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇరు ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేసిన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి అప్పగించాలని కేంద్రం జారీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలంటూ తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై రెండువారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీ-సులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేసిన వారంలోగా రిజాయిండర్ ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించింది.

## యాదగిరిగుట్టలో వైటీడీ బోర్డు..

మొదటిపేజీ తరువాయి..

దీనికి ఆ స్వేచ్ఛ ఉంటుందన్నారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద విద్యా సంస్థలను స్థాపించవచ్చని కూడా అన్నారు. వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారానే జరుగుతుంది. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారు. గతంలో యాదగిరిగుట్టలో భక్తులకు సరైన వసతులు లేవు. ఈ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి వసతులు కల్పించింది. ఇంకా మెరుగు పరిచేందుకే యాదగిరిగుట్ట పాలక మండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. సమర్థమైన పాలక మండలిని నియమించి యాదగిరిగుట్ట క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఏడాదికి రూ.100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలన్నీ దేవాదాయశాఖ పరిధిలోకి వస్తాయని మంత్రి కొండా సురేఖ తెలిపారు.



## సమాధానం చెప్పలేక పారిపోతున్న కాంగ్రెస్

- భూములు తాకట్టుపెట్టి వేలకోట్లు అప్పు
- సభా హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌దే
- ఆంధ్రా జలదోపిడీతో నీటి సమస్య
- చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్,మార్చి18(సాక్ష్యం): శాసనసభలో ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అందుకే ఈరోజు కీలకమైన ప్రశ్నోత్తరాలు ఉన్నాయని సమాధానం చెప్పలేక రద్దు చేసుకుందని విమర్శించారు. దీనిపైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామని హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్ చేశారు. ఈ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ భూములు తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు తెస్తున్నారు. టీజీఐఐసీ 10 వేల కోట్లు, హెచ్‌ఎండీఏ ఆస్తులు కుదబెట్టి 20 వేల కోట్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ 10 వేల కోట్లు, జీహెచ్‌ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు సిద్ధమైంది. మొత్తం 50 వేల కోట్లను అప్పు చేస్తుంది. మా ప్రశ్నలపై సమాధానం చెప్పలేక మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది. సభ్యుల హక్కులను స్పీకర్ కాపాడాలి. జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. ఆంధ్ర జలదోపిడీ కారణంగా మహబూబ్ నగర్, నల్లగొండలో పంటలు ఎండిపోతున్నాయి. రైతు భరోసా వానకాలం వేశారా లేదా అని ప్రశ్న వేస్తే దానిని రద్దు చేశారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటలు అమ్ముకొని నష్టపోయారు. మా హయంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. మేము 54 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం అన్నారు. కొన్నది 24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ధాన్యం కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యాసంగి రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదు. వరంగల్ జిల్లాలో దేవాదుల కింద పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్న సాగర్, దుబ్బాకలో పంటలు ఎండిపోతున్నాయి. వీటి పైన మేము ప్రశ్నలు వేస్తే ఈరోజు ప్రశ్నోత్తరాలు రద్దు చేశారు. రైతు రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ పూర్తయిందని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే చెబుతున్నారు, కానీ ఇంకా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లాలో రుణమాఫీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

## పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

ప్రయోజనం లేదన్నారు. సమాధానం చెప్పాల్సి ఉంటది కాబట్టే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదన్నారు. చర్చ లేనిరోజునే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఎద్దేవా వేశారు పొంగులేటి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదు.. అందుకే చర్చ లేని సమయంలో.. బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.. కమిషన్ల కోసం శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్షయం చేశారు ఆరోపించారు. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దాని కంటే రైతులు ఎక్కువ సాగు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల పంటల ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం



చేస్తున్నాం.. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చాం.. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళతాం.. నాటి ప్రభుత్వం దేవాదుల పూర్తి చేసి ఉంటే ÷తులకు ఈ స్థితి వచ్చేది కాదు అన్నారు. ఇక, అంచనా వ్యయం పెరగడానికి కూడా కేసీఆర్ నిర్లక్ష్యమే కారణం.. తాగునీరు, సాగునీరు సమస్యకు గత కేసీఆర్ సర్కారే కారణమని ఆరోపించారు. ఒక లిఫ్టుతో ఆపరేట్ చేసినా 60-70 వేల ఎకరాల ఆయకట్టు-కు ప్రయోజనం చేకూరేది.. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దేవాదుల ఆయకట్టుకు నీరందించడం సంతోషంగా ఉందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. స్టేషన్ ఘన్ పూర్, జనగామ,పాలకుర్తి,పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు నీరందుతుందన్నారు. గత పదేళ్లుగా దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మార్చి19 న దేవాదుల రావాలనుకున్నాం కానీ..బడ్జెట్ ఉండటంతో ఇవాళే వచ్చామన్నారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట దగ్గర దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కుంభమేళా ఓ అద్భుత కార్యక్రమం

యువతరం పెద్ద ఎత్తున పాల్గొనడంపై కూడా ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయాలను ఆధ్యాత్మికతను యువత సగర్వంగా అందిపుచ్చుకున్నదని వ్యాఖ్యానించారు. కుంభమేళాలో భారత వైభవాన్ని యావత్ ప్రపంచం చూసింది. ఈ మహాసంరంభంలో యావత్ దేశం ఉత్సాహంగా పాల్గొంది. భవిష్యత్తు తరాలకు ఈ సంరంభం స్ఫూర్తిగా నిలుస్తుంది. భారత్ శక్తి సామర్థ్యాలను ప్రశ్నించే వారికి కుంభమేళా విజయం తగిన జవాబు ఇచ్చింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా 45 రోజుల పాటు యావత్ ప్రపంచం ఆశ్చర్య పోయే రీతిలో జరిగిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26తో ముగిసిన ఈ మహా సంరంభంలో ఏకంగా 66 కోట్ల మంది పాల్గొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో పవిత్రస్నానం ఆచరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. ఇక ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ కూడా స్వయంగా గంగా, యమున, సరస్వతీ నదుల సమాగమమైన త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం చేశారు. గంగా నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంభమేళాలో అక్కడక్కడా కొన్ని అపశృతులు చోటు- చేసుకున్నాయి. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 30 మంది మరణించినట్టు యూపీ ప్రభుత్వం పేర్కొంది. మహాకుంభమేళ విజయవంతం కావడంపై ప్రధాని మోదీ పార్లమెంటులో స్పందించినా... తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఆయన నివాళులర్పించ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం లోక్ సభలో వెలుపల ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రయాగ్ రాజ్ వేదికగా నిర్వహించిన మహాకుంభమేళ విజయవంతం కావడంపై ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారని చెప్పారు. కానీ ఈ ప్రయాగ్ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించారని... వారికి ప్రధాని మోదీ నివాళు లర్పించలేదని చెప్పారు. కుంభమేళా అంటే.. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యల తో తాము పూర్తిగా ఏకభవిస్తామన్నారు. కానీ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఘనంగా నివాళులు అర్పించక పోవడం పట్ల ఆయన తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే ఈ కుంభమేళ కారణంగా తమకు ఉపాధి లభిస్తోందని యువత ఆశించిదని చెప్పారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లారన్నారు. అయితే మనది ప్రజాస్వామ్య దేశమని.. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడికి సభలో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. కానీ తనకు సభలో మాట్లాడే అవకాశం మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు దాదాపు 45 రోజుల పాటు- ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభమేళ నిర్వహించారు. ఈ మహాకుంభమేళలో పవిత్ర స్నానమాచరించేందుకు దేశవిదేశాల నుంచి కోట్లాది మంది ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. అలా దాదాపు 60 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్ర స్నానమాచరించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు ఇటీవల ప్రారంభమైనాయి. దీంతో మంగళవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. మహాకుంభమేళ విజయవంతమైందన్నారు. అందుకు యూపీ ప్రజలతోపాటు ప్రభుత్వాన్ని ఆయన ధన్యవాదాలు తెలిపారు. భారత్ అంటే ఏమిటనేది ఈ మహాకుంభమేళ ద్వారా మరోసారి ప్రపంచానికి నిరూపితమైందన్నారు. జనవరి 29వ తేదీన మౌని అమావాస్య. ఈ నేపథ్యంలో కోట్లాది మంది ప్రజలు పుణ్య స్నానమాచ రించేందుకు ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. ఆ క్రమంలో తొక్కిసలాట జరిగింది. దీంతో పలువురు భక్తులు మరణించగా, మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే దేశ రాజధాని న్యూఢిల్లీలో సైతం మహాకుంభమేళలో పాల్గొనేందుకు ప్రయాగ్ రాజ్ రైల్వే స్టేషన్‌కు భారీగా భక్తులు చేరుకున్నారు. ఆ సమయంలో సైతం తొక్కిసలాట జరిగింది.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
సిద్దిపేట మెయిన్ బ్రాంచ్
చిరునామా- 11-1-151, మెదక్ రోడ్, సిద్దిపేట
అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)
సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు 2002 యొక్క నియమం 6(2)/8(6)
తేదీ: 12.03.2025
స్థలం: సిద్దిపేట
తేదీ: 12-03-2025
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
BAJAJ FINSERV
స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కోసం)
తేదీ: 17.03.2025
స్థలం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

CAN FIN HOMES LTD
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)
email: ramachandrapuram@canfinhomes.com Website: www.canfinhomes.com CIN No. L85110KA1987PLC008699
తేదీ:18-03-2025
ఇతర నిబంధనలు మరియు షరతులు
ప్రత్యేక సూచన/జాగ్రత్త
తేదీ: 18-03-2025
ప్రదేశం: రామచంద్రాపురం
సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

## మండల విద్యాధికారి డి అంజయ్య రిటైర్డ్ కేతకి సంగమేశ్వర స్వామి దర్శనం చేసుకోవడం జరుగుతుంది



**సాక్ష్యం న్యూస్ సదాశివపేట:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల 20092015 మండల విద్యాధికారిగా పనిచేసిన శ్రీ అంజయ్య సార్ గారు ప్రస్తుతం రిటైర్డ్ మండల విద్యాధికారి అంజయ్య సర్ గారి ప్రథమ పుత్రిక పూజ TSPSC గ్రూప్1 509.5 ర్యాంక్ తో సెలెక్ట్ కావడంతో ఈరోజు ఝరాసంగం దేవస్థానం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగింది ఆలయ దేవస్థానం ఈవో శివరుద్రప్ప మరియు దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు బసయ్య స్వామీ ,వీర సంగయ్య స్వామి గ్రూప్ 1 సెలెక్ట్ ఆయన పూజను ఆలయ ఈవో ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించారు ఆలయ సిబ్బంది నాగన్న మరియు మండల సిబ్బంది శివ కార్యక్రమంపాల్గొనడం జరిగింది

## సీఐ శివశంకర్ కు ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఘన సన్మానం



కోదాడ మార్చి 18 (సాక్ష్యం) కోదాడ పట్టణంలో వేంచేసియున్న శ్రీరంగాపురం ఆంజనేయస్వామి దేవాలయ పాలకవర్గం కోదాడ పట్టణ నూతన సిఐ ని ఘనంగా సన్మానించారు. మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పట్టణ సీఐ శివశంకర్ ను ఆలయ పాలక వర్గ సభ్యులు పట్టు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షులు ఎర్నేని వెంకటరత్నం బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కుర్రి గోపులు మాట్లాడుతూ.. పట్టణంలో శాంతియుత వాతావరణంలో ప్రజల జీవన ప్రమాణాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఆంజనేయ స్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో సాగాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శివశంకర్ మాట్లాడుతూ... భగవంతుని కృపతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా పాడి పంటలతో తులతూగాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ప్రమాద రహిత పట్టణంగా కోదాడని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వంగవీటి శ్రీనివాస్, వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పెదనాటి నరసింహారావు, రావెళ్ల కృష్ణారావు, లైటింగ్ ప్రసాద్, వేమూరు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా పశు వైద్య శిబిరం

కోదాడ మార్చి 18 (సాక్ష్యం) ఈనెల 20వ తారీఖున కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో నారాయణపురం పాలే అన్నవరం గ్రామంలో నిర్వహించబోయే ఉచిత మెగా పశువైద్యశిబిరాన్ని అట్టి గ్రామ రైతు సోదరులు మరియు చుట్టుపక్క ఉన్నటువంటి తండాల రైతు సోదరులుఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మీ పశువుల జీవాలు కోళ్లు బాతులు సాధు జంతువుల కు అవసరమైన వైద్య పరీక్షలు వ్యాక్సిన్లు మందులు ఉచితంగా పొందగలరని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మనబోయిన వీరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరపతమ్మ గారు వైస్ చైర్మన్ బషీర్ గారు డైరెక్టర్లు మరియు పశువైద్యాధికారులు కోదాడ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ ఇతర సిబ్బంది పాల్గొంటారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



సాక్ష్యం (పాపన్నపేట మార్చ్ 19 )పాపన్నపేట మండల పరిధిలో గల 33కెవి పోడ్చంపల్లి లైన్ వర్క్ కారణంగా నేడు ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొత్తపల్లి , గాంధర పల్లీ మరియు పోడ్చంపల్లీ 33/11కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని ఏ డి ఈ జి.శ్రీనివాస్,ఏ ఈ నర్సింలు తెలిపారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నకొమ్మూరి ప్రతాప్ రెడ్డి



జనగామ జిల్లా బ్యూరో, సాక్ష్యం న్యూస్‌జనగామ జిల్లానియోజకవర్గం నర్మేట మండలం వెల్దండ గ్రామంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నా తరుపున స్టేట్ డెవలప్మెంట్ ఫండ్స్ కింద 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్డుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్చార్జి ' కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశం మేరకు మంగళవారం రోజున కొబ్బరికాయలు కొట్టి సీసీ రోడ్లు ప్రారంభించినజిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహ రెడ్డి గారు నర్మెట మండల అధ్యక్షులు రాజబోయిన లక్ష్మీ నారాయణ గారు నర్మెట మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బైరగోనిఅంజయ్య గౌడ్గ్రామ పార్టీ అధ్యక్షులు పెద్దమాతరి నరసింహులు,గార్ల ఆధ్వర్యంలో గ్రామ పార్టీ మహిళ అధ్యక్షురాలు ఆగమల్ల పద్మ, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మార్క మహేష్ గౌడ్, ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల్ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, నోరుమెట్ల మండల్ కిసాన్ సెల్ అధ్యక్షులు కలకుంట్ల అంజయ్య గారు మండల మాజీ అధ్యక్షురాలు మార్క చంద్రకళ గారు గ్రామ ఉపాధ్యక్షుడు గంగారబోయిన నారాయణ మాజీ సర్పంచ్ వార్డ్ మెంబర్స్మండల సీనియర్ నాయకులు గ్రామ కాంగ్రెస్ యూత్ నెంబర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు సిసి రోడ్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## మాట నిలుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఉత్తం మాదిగల పాలిటీ ఉత్తముడు
మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు



కోదాడ మార్చి 18 (సాక్ష్యం) కోదాడ నియోజకవర్గం నడిగూడెం మండలం 30 సంవత్సరాలు ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్గీకరణ చేయడానికి ఎస్సీ వర్గీకరణ కమిటీకి నాయకత్వం వహించిన ఉత్తంకుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూన్న సందర్భంగా మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు మంగళవారం మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లోని ఉత్తంకుమార్ రెడ్డి ఓ నీతి నిజాయితీ ,నిబద్ధతగల వ్యక్తి అని, ఎంతో అపారమైన రాజకీయ అనుభవం గల వ్యక్తి ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి చైర్మన్ కావడం మాదిగ మరియు ఉప కులాల అదృష్టమని అన్నారు. మరియు అందుకు సహకరించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి యావత్ మాదిగ జాతి రుణపడి ఉంటుందని , వర్గీకరణ విషయంలో దూరదృష్టి కలిగిన మంత్రి వర్యులు ఉత్తంకుమార్ రెడ్డి కమిటీ చైర్మన్గా ఉండడం మూలంగానే ఇది సాధ్యమైందని ఇట్టి చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్న కాంగ్రెస్ పార్టీకి మాదిగ జాతి ఎన్నంటి ఉంటుందని అన్నారు, కోదాడ స్థానిక శాసనసభ్యులు పద్మావతి రెడ్డి గారి సహకారం మరువలేనిదని అన్నారు

# బీసీలకు రిజర్వేషన్ చారిత్రాత్మకం

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి
సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్
జాటోత్ రామచంద్రనాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 18 సాక్ష్యం న్యూస్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీర్మానం చారిత్రత్మక నిర్ణయమని మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ,రాజీవ్ యువ వికాస్ పథకాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించినందుకు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు ఆర్ & బి గెస్ట్ హౌస్ ఎదురుగా తెలంగాణ రాష్ట్ర సీఎం, అనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, భట్టి విక్రమార్క మల్లు, మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నత్తిని దృష్టిలో పెట్టుకుని రాహుల్ గాంధీ ఆలోచన మేరకు చేపట్టిన కార్యక్రమం అమలు జరిపే క్రమంలో అసెంబ్లీ లో ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం గొప్ప నిర్ణయమని అన్నారు, మున్ముందు ప్రభుత్వం సబ్బండ వర్ణాల వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటికొమ్మ యుగంధర్ రెడ్డి, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమల్లు , మరిపెడ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు తాజుద్దీన్, జిల్లా మైనార్టీ నాయకులు అఫ్సర్,జిల్లా కార్యదర్శి గుగులోతు రవి,సీనియర్ నాయకులు కొండం దశరథం, సూరబోయిన ఉప్పలయ్య,గుండగాని వేణు,మండల యూత్ ఉపాధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్,గంధసిరి బిక్షపతి గౌడ్ ,అల్వాల ఉపేందర్,లెజెండ్ పర్శరాముల, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి
లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

మహబూబాబాద్ జిల్లాప్రతినిధి, మార్చి 18 సాక్ష్యం న్యూస్‌పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి అన్నారు. మంగళవారం నాడు స్థానిక ఆర్ &బి గెస్ట్ హౌస్ లో లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణి చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రి ఖర్చులతో కుదేలైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ స్వాంతన కలిగిస్తుందన్నారు, గత ప్రభుత్వంలో కన్న మిన్నగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో త్వరితగతిన చెక్కుల పంపిణి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులతో పాటు జిల్లా కార్యదర్శి గుగులోత్ రవి నాయక్,మరిపెడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ తాజుద్దిన్, జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ అఫ్సర్,విష్ణు, బుచ్చిబాబు కారంపూడి ఉపేందర్,దేవరశెట్టి లక్ష్మి నారాయణ,బోడ రమేష్ నాయక్, లెజెండ్ పర్శురాములు తదితరులు పాల్గొన్నారు.

## తాను నాయక్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

* మార్చి 20న తాను నాయక్ 76వ వర్ధంతిని మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో నిర్వహించాలి.
* తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) పిలుపు.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చ్ 18 సాక్ష్యం న్యూస్ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుండె పుడి తండాలో తెలంగాణ గిరిజన సంఘం సమావేశం బానోత్ రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య హరినాయక్ పాల్గొని మాట్లాడుతూ నేటి యువత తాను నాయక్ స్ఫూర్తితో ఉద్యమాలలో పాల్గొని గిరిజనుల హక్కుల కోసం,ప్రజా వ్యతిరేక విధానాలకు తిప్పి కొట్టే విధంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, భూస్వాములు, పెత్తందారుల దౌర్జన్యాలు,ఆగడాలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి గడగడ లాడించిన పోరాట యోధుడు తాను నాయక్ గారు అని అన్నారు. మార్చి 20న తాను నాయక్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలతో పాటు తండాలలో ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గుగులోతు శంకర్ నాయక్, ధరావత్ రమేష్ నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ప్రకాశంజిల్లా ఎమ్మార్పీఎస్



* రాష్ట్ర యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ : జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ
* ఏపీ క్యాబినెట్ కు,డోలా కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన : ప్రకాశంజిల్లా ఎమ్మార్పీఎస్

బ్యూరో ఇంచార్జి (పి.సురేష్ బాబు) : సాక్ష్యం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీ ఎస్ శ్రేణులు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం నాడు సింగరాయకొండ పట్టణంలో గల శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్ నందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ప్రకాశంజిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ మాట్లాడుతూ గడిచిన 30 సంవత్సరాల మాదిగల ఆశను,ఆకాంక్షను నెరవేర్చే ప్రయత్నంలో భాగంగా, సైద్దాంతిక పునాదుల మీద శాస్త్రీయ బద్దంగా ఎస్సీల సామాజిక,రాజకీయ,ఆర్థిక,విద్య,ఉపాధి రంగాల స్థితిగతుల పై అధ్యాయనం చేసి ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ 1 శాతం రెల్లికి,6.5 శాతం మాదిగలకు,మాదిగ ఉపకులాలకు, 7.5 శాతం మాలలకు,మాల ఉప కులాలకు రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ అందించాలని రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక కు క్యాబినెట్ సభ్యులతో చర్చించి,అసెంబ్లీలో రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికకు ఆమోదం తెలిపి రాష్ట్ర యూనిట్ గా ఎస్సీల వర్గీకరణ అమలు చేస్తాము అని ఆమోదం తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు సాంఘీక సంక్షేమ మంత్రి డా'డోలా బాల వీరాంజనేయ స్వామి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం పక్షాన యావత్తు,మాదిగ జాతి పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ రేణమాల మాధవ మాదిగ,సింగరాయకొండ మండల అధ్యక్షులు రావినూతల వెంకటేష్ మాదిగ,మండల కో కన్వీనర్స్ పొనుగోటి ఉదయ్ కుమార్ మాదిగ,సూరపోగు మోజేష్ మాదిగ,గౌడ్ పేరు మహేష్ మాదిగ ,మనోహర్ మాదిగ,జాన్ మాదిగ,సంతోష్, అజయ్ ,తదితరులు పాల్గొన్నారు..

## దృష్టి లోపం ఉన్న పిల్లలకు కంటి అద్దాలు పంపిణీ

*డాక్టర్ రవి కుమార్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 18 సాక్ష్యం న్యూస్ ఆర్. బి. ఎస్. కే రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ఆధ్వర్యంలో మరిపెడ మండలం లో ఉన్న ప్రభుత్వం పాఠశాల ,రెసిడెన్సీ స్కూల్ లో చదువుతున్న 8,9 మరియు 10 వ తరగతి విద్యార్థి ని విద్యార్థులకు కంటి పరీక్షలు గత నెలలో చేయడం జరిగింది. దృష్టి లోపం ఉన్న పిల్లలకు కంటి అద్దాలు పంపిణి చేయడం జరుగుతుందని డాక్టర్ రవి తెలిపారు. ఈ రోజు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో డాక్టర్ రవి ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణి చేయడం జరిగింది.అదేవిదంగా మోడల్ స్కూల్, మరిపెడ బాలుర పాఠశాలలో, కేజీబీవీల లో మొత్తం 22 మంది విద్యార్థుల కు కంటి అద్దాలు పంపిణి చేయడం జరిగిందని డాక్టర్ రవి తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆర్ సి ఓ స్వరూప,డాక్టర్ సౌజన్య, డాక్టర్ వెంకన్న, ప్రిన్సిపాల్ దయాకర్,ఏ ఎన్ ఎం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

టీడీపీ నాయకులు జడ రాములు యాదవ్



దామరచర్ల మార్చి18 సాక్ష్యం:దామరచర్లమండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోజరిగిన విడ్కోలు సమావేశంలో 10 వ తరగతి పరీక్షలకీ హాజరయ్యే విద్యార్థులకీ దామరచర్ల గ్రామానికి చెందిన షేక్ జానీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్.మరియు పెన్నులు పెన్సిల్.స్కేల్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా వేములపల్లి పిఏసీఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో మంచి ప్రతిభ చూపి పైచదువులకు 10వ తరగతి ఫైనల్ పరీక్షలు కీలకం అని ప్రతి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భవిష్యత్ లో మంచి పౌరులు గా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా మాజీ కో ఆప్షన్శ్రీను ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి. అధ్యాపకులు రాధిక మేడమ్,మంజుల,సైదమ్మ, నాగలక్ష్మి, అశోక్.శ్రీనివాసునాయిడు, నాగరాజు,సైదానాయక్, జైపాల్ రెడ్డి,దేవేందర్ గౌడ్, పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటా


ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



కోదాడ మార్చి 18 (సాక్ష్యం) ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల కు ప్రభుత్వానికి వారధిగా ఉంటానని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో గత మూడు రోజులుగా హోరా హోరీగా నడుస్తున్న విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా సాహిత్య సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుండి వయస్సుతో సంబంధం లేకుండా క్రీడలకు హాజరైన విశ్రాంత ఉద్యోగులు అభినందనీయులన్నారు. టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య, వేనేపల్లి శ్రీనివాసరావు, చంద్రశేఖర్ ఉమా సుదర్శన్ రెడ్డి, బొల్లు రాంబాబు, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జితేందర్ రెడ్డి, తీగల నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ వీరబాబు భ్రమరాంబ, రఘు ఉన్నారు..

## ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తుద్ధిని చాటుకుంది

తెలంగాణ మలిదశ ఉద్యమకారులు కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకటనారాయణ



కోదాడ మార్చి 18 (సాక్ష్యం)బీసీలకు 42% రిజర్వేషన్ , ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకుందని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల రాయపూడి వెంకటనారాయణ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఈ బిల్లులను రేవంత్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ బిల్లులను పార్లమెంట్లో ఆమోదింప చేసినందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని, కేంద్రంపై రాష్ట్ర బిజెపి నాయకులు ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. బీసీ కులగనన ఎస్సీ వర్గీకరణ లో సబ్ కమిటీ చైర్మన్గా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పాత్ర చరిత్రలో నిలిచిపోతుందని, రెండు బిల్లులు అసెంబ్లీలో ఆమోదింప చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

## బీసీ లకు అండగా నిలిచిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**మహబూబాబాద్ జిల్లాప్రతినిధి, మార్చి 18 సాక్ష్యం న్యూస్** బీసీలకు అండగా నిలిచిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు జాతీయ బీసీ సంక్షేమ సంఘం మరిపెడ పట్టణ అధ్యక్షులు దేవరశెట్టి లక్ష్మి నారాయణ. పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా కుల గణన పూర్తి చేసి& బీసీ జనాభా లెక్క పక్కాగా తేల్చి విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి& ఆ కోటాకు చట్టబద్ధత కల్పిస్తూరాష్ట్ర శాసన సభలో బిల్లును ఆమోదించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ లపై ప్రేమను చాటిందని అన్నారు, రాబోయే రోజుల్లో బీసీలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుకు దుసుకుపోవడానికి ఈ ఘట్టం ఇతోధికంగా ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ పెద్దలు పాల్గొన్నారు.



## విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ...బిచ్చన్న




భద్రాద్రి కొత్తగూడెం ప్రతి నిధి, మార్చి 18,( సాక్ష్యం న్యూస్ ),విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యతిస్తుందని బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్న పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కూడా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ అధిక విద్యుత్పత్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్మికులు క్రమశిక్షణ అంకితభావంతో పని చేస్తూ కర్మాగారానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. 1998 వ సంవత్సరంలో కాంట్రాక్టు కార్ వెనుక టి ఎస్ పి ఈ యు 1535 కృషి ఎంతో ఉందనీ కొనియాడారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రీజినల్ ప్రధాన కార్యదర్శి ఆర్. రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు యం. రాజమనోహర్, రఫీ టీ అనిల్ కుమార్, స్టేట్ కమిటీ సభ్యులు,వెంకటేశ్వర్లు, జార్జ్, నాయకులు పుల్లారావు, జి.రవికుమార్, వీరబాబు వింజమూరు మురళి, చిక్కా.వెంకటరమణ, రవిచంద్ర, మహిళా నాయకురాలు జానీ బేగం, ఈశ్వరి,సునీత తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన సింగరేణి విద్యార్థులు




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,మార్చి 18,( సాక్ష్యం న్యూస్ ), టాలెంట్ టెస్టుల్లో సింగరేణి విద్యార్థులు సత్తా చాటారు .మంగళవారం లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ,గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం సత్య ప్రకాష్ మణుగూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు.ఆ టాలెంట్ టెస్ట్ లో మండల స్థాయిలో సింగరేణి పాఠశాల పివి కాలనీ విద్యార్థి డి సాయినాథ్ ప్రథమ స్థానం, ఎం భాను ప్రసాద్ ద్వితీయ స్థానం సాధించడం జరిగిందనీ తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ట్రెజరర్ గాజుల రమేష్ , బాటనిలెక్చరర్,సెక్రెటరీ మీరా హుస్సేన్ , ఇంగ్లీష్ లెక్చరర్ సింగరేణి పాఠశాలకు విచ్చేసి విద్యార్థులను మోటివేట్ చేస్తూ రాబోయే పరీక్షలలో ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలి, ప్రజెంటేషన్ ఎలా ఉండాలి , ఎంతసేపు చదవాలి అనే విషయాలపై చక్కటి అవగాహన కల్పించారు. విద్యార్థులను మోటివేట్ చేస్తూ భవిష్యత్తులో తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని దానిలో చక్కగా రాణించాలని ఉన్నత స్థానాలకు ఎదగడానికి తగిన కృషి చేయాలని సూచించారు. అనంతరం టాలెంట్ టెస్ట్ లో ప్రథమ ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కళ్యాణి ,సీనియర్ ఉపాధ్యాయులు ఎం కృష్ణ బాబు,, బి. సరిత కె. రాజసింహ, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

## కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం, ఏపీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు



కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం నోటిఫికేషన్ను ప్రశ్నిస్తూ తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్పై కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి.ఆ నోటిఫికేషన్పై అభ్యంతరం : కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించాలని 2021లో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ వేసింది. మరోవైపు కేఆర్ఎంబీ ప్రాజెక్టులపై అధిక విద్యుత్ ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పిటిషన్ వేసింది. ఈ జీవో సాయంతో అక్రమంగా విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటున్నారని ఏపీ సర్కార్ తమ పిటిషన్లో ఆరోపించింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో రద్దు చేయాలని పిటిషన్లో కోరింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఏపీ, తెలంగాణ వేసిన పిటిషన్లను కలిపి విచారణ చేపట్టింది.కౌంటర్ దాఖలుకు ఆదేశం : మరోవైపు 2021లో కేంద్రం ఇచ్చిన నోటిఫికేష్ప స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్లపై 2 వారాల్లో కౌంటర్ దాఖలు వేయాలని కేంద్ర ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇవి రెండు కౌంటర్లు దాఖలు చేసిన వారంలోగా రిజాయిండర్ ఫైల్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

## తెలంగాణలో 5 రోజులు వానలు మండే ఎండల్లో వాతావరణ శాఖ చల్లని ముచ్చట!



మార్చి ముగియనే లేదు ఎండలు మాడు పగలగొడుతున్నాయి. తెలంగాణలో ఈ పరిస్థితి రోజు రోజుకూ శృతి మించుతోంది. దీంతో ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే జనం ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చేసింది. మధ్యాహ్నం వేళ రోడ్లపై జనం పెద్దగా కనిపించట్లేదు. ఇక రాత్రి వేళ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ అధికారులు తియ్యటి ముచ్చట చెప్పారు.

ఈ నెలలో 5 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. తెలంగాణలో ఈనెల 21వ తేదీ నుంచి వానలు కురుస్తాయని వెల్లడించింది. మార్చి 21 నుంచి 25 వరకు మొత్తం ఐదు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది. రాష్ట్రంలోని పలుచోట్ల ఈ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తేలికపాటి, ఓ మోస్తరుగా వానలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు.

పొగ మంచు కూడా :నేటి నుంచి రాబోయే మూడు రోజుల్లో వాతావరణం ఎలా ఉండనుందో వాతావరణ శాఖ అంచనా వేసింది. మూడు రోజులపాటు ఉదయం వేళ పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ రోజు వాతావరణంలో పెద్దగా మార్పేమీ ఉండదని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో కూడా మార్పు ఉండబోదని పేర్కొంది. ఆ తర్వాత మాత్రం క్రమంగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గవచ్చని అంచనా వేసింది.

ఆ మాటతోనే చల్లదనం :మండుతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు కురవబోతున్నాయ్ అంటూ వాతావరణ శాఖ అలారం మోగించడంతో జనాలు చల్లదనాన్ని ఫీలవుతున్నారు. ఆ ఘడియల కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిస్తే కొన్ని రోజులపాటు ఆ ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు తగ్గుతాయని భావిస్తున్నారు. దీంతో 21వ తేదీ రాక కోసం వెయిట్ చేస్తున్నారు.

ఆ తర్వాత?

మార్చి 25 తర్వాత మాత్రం ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. కాబట్టి అనవసర ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్తే మంచిదని చెబుతున్నారు. ఒకవేళ మధ్యాహ్నం వేళ తప్పనిసరి బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, వాటర్ బాటిల్ వెంట పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ప్రతిష్టాత్మకంగా ఆమోదించిన బీసీ కుల గణన బిల్లు..

### సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు..



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 18 ,(సాక్ష్యం న్యూస్), తెలంగాణ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బీసీ కుల గణన బిల్లు ను ఏక గ్రీవంగా ఆమోదం తెలిపిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ లో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అడవి అభివృద్ధి చైర్మన్ పోదెం వీరయ్య ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అసెంబ్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా బీసీ కుల గణన బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మొదటిసారిగా కుల ఘనన నిర్వహించి అసెంబ్లీ లో 42 శాతానికి పెంచుతూ బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో పెద్ద ఎత్తున సంబరాలుచేసి ముఖ్యమంత్రి రేవంతరెడ్డి చిత్రపటానికి బి సి నాయకుల తో కలిసి పాలాభిషేకం నిర్వహించి, బాణాసంచా కాల్చి, స్వీట్స్ తినిపించుకొని సంబరాలు నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. అనంతరం ఆయన రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉప సంఘం చైర్మన్ఉత్తమ్ కుమార్ రెడ్డి ,ఆమోదం కు ఓటు వేసి సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు ప్రత్యేక ధన్యవాదములుతెలియజేసారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి గడ్డి కనక లక్ష్మి , మణుగూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సైదులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐతనబోయిన సతీష్, సౌజన్య,మండల నాయకులు పాలమూరు రాజు,గాండ్ల సురేష్,టివి సుబ్బారెడ్డి,పాల్వంచ రాములు, గోరంట్ల కనకయ్య, వెంకట్రావు గౌడ్, బీసీ నాయకులు సోమేశ్వరరావు గౌడ్, గుండగని నాగేశ్వరరావు, సాదిని సీతయ్య, జివి, మదడి రాజేష్ మహిళా నాయకురాలు శ్యామల, గౌతమీ, షబానా, పద్మ, రజిత, రవీందర్, రాంబాబు మండల నాయకులు, యువజన నాయకులు ,కార్యకర్తలు ,తదితరులు ,పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకం కింద

### యువతి యువకులు సద్వినియోగం చేసుకొని ఆన్లైన్ చేసుకువాలి



మండల కాంగ్రెస్ ఇంచార్జి జాడి రాంబాబు

ములుగు ప్రతినిధి మార్చి 18సాక్ష్యం న్యూస్:తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకుతెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద మార్చి 17 నుంచి దరఖాస్తులు మొదలయ్యాయి దీనిని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ ఇన్చార్జి జాడ రాంబాబు పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు.

**మార్చి 17నుండి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు..**

ఈ పథకానికి సంబంధించి.. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పథకం విధివిధానాలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత యువతకు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చామని స్పష్టం చేశారు భట్టి.

**రూ.6 వేల కోట్ల నిధులు..**

రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.6 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేయాలని.. రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. చాలా రోజుల తర్వాత స్వయం ఉపాధి కోసం ఆన్లైన్లో దరఖాస్తులు

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ దాదాపు రూ.1200 కోట్లు, గిరిజన ఆర్థిక సహకార సంస్థ రూ.360 కోట్లతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలో కూడా ప్రత్యేక అభివృద్ధి నిధులు భారీగా ఉన్నాయి. దీంతో ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**3 కేటగిరీలుగా..**

ఈ పథకం కింద లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు యూనిట్ల విలువ ఆధారంగా రుణాలను 3 క్యాటగిరీలుగా విభజించారు. క్యాటగిరీ1 కింద రూ.లక్ష వరకు రుణం అందిస్తారు. అందులో 80 శాతం రాయితీ ఉంటుంది. క్యాటగిరీ2 కింద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. అందులో 70 శాతం రాయితీ కల్పిస్తారు. క్యాటగిరీ3 కింద రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల లోపు రుణాలను అందజేయనున్నారు. అందులో 60 శాతం రాయితీ లభిస్తుంది.కావున కన్నాయిగూడెం మండలంలో ప్రతి ఒక్క యువతి యువకులు అప్లై చేసుకోవాలని మండల ఇంచార్జి జాడి రాంబాబు కోరారు

## మహిళలే నవసమాజ నిర్మాణ కర్తలు.దోసపాటి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 18 , (సాక్ష్యం న్యూస్ ),మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మెరుగైన సమాజ నిర్మాణం కోసం సమయాన్ని వెచ్చించి లాభాపేక్ష లేకుండా సేవ చేయడం అభినందనీయమని , మహిళలే నవ సమాజ నిర్మాణ కర్తలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం సాయినగర్ లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవలో వివిధ రూపాల్లో లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవలందిస్తున్న మహిళలను, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యామ్, అంజలిలతో కలిసి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మహిళలే నవ సమాజ నిర్మాణ కర్తలని పిల్లలకు ఆది గురువు తల్లి అవుతుందని, ఆమె నేర్పే విద్యాబుద్ధులతోనే గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని , అలాంటి మహిళల సేవలు గుర్తించాల్సిన ఆవశ్యకతను గుర్తించి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సమాజసేవలో మమేకమవుతున్న పలువురు మహిళల సేవలను కీర్తించారు . అనంతరం నాగులజ్యోతి, చిత్తలూరి ఉమ, లంకా సూర్యకుమారి, పారుపల్లి పద్మజ, బంగారు సంధ్య, దేవులపల్లి సూర్యకుమారి, దోసపాటి స్వర్ణలను సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మణుగూరులో సేవా కార్యక్రమాలు ఎన్నో చేపట్టారని,వాసవీ సురక్ష బస్టాండ్ నిర్మించడం, మణుగూరు ముంపునకి గురైన సందర్భంలోనూ వాసవీ క్లబ్ ఎన్నో విశేషమైన సేవలందించి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. అలాంటి వాసవీ క్లబ్ కు వెన్నంటి ఉండి దాదాపు 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న దోసపాటి వేంకటేశ్వర రావు మణుగూరు వాస్తవ్యులు కావడం మణుగూరు ప్రజల అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యామ్, వనితా వైభవం అధ్యక్షురాలు బొగ్గవరపు అంజలి, జోన్ చైర్మన్ దొసపాటి స్వర్ణ, ఐపీసీ బండారు నర్సింహారావు, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శేషుబాబు, జిల్లా పీ ఆర్ ఓ కడవెండి విశ్వనాథగుప్తా, మాజీ డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్ దింటకుర్తి బ్రహ్మయ్య, వర్తక సంఘం ఉపాధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి ధర్మారావు, కంకటాల సాయి కుమార్, సముద్రాల కృష్ణమూర్తి, సుగ్గల ఇందుమతి, కొత్తా ఇందుమతి, కేసా రాజేంద్రప్రసాద్, చిత్తలూరి రమేష్, మురహరి, సుగ్గల సూర్యం, వడియాల ప్రభాకర్, తదితరులు , పాల్గొన్నారు.


## చిక్కుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్టీ,ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు తనను దూషించారంటూ హస్తినాపూర్ కార్పొరేటర్ ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తనను కులం పేరుతో దూషించారని హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశంలో ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు ఆమె తెలిపారు. గన్పార్క్ వద్దకు చేరుకున్న ఆమె ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కులం పేరుతో గత కొన్నేళ్లుగా అవమానించి మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడని తాజాగా తనను హనీమూన్ అనే పదంతో దూషించారని తీవ్ర ఆరోపణలు చేశారు.మనోవేదనకు గురిచేస్తుందంటూ : వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలు రాజకీయాల్లోకి వస్తే ప్రోత్సహించాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలు, కులంతో దూషించడం చేసి మనోవేదనకు గురి చేస్తున్నారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే సుధీర్పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, త్వరలో శిక్ష కూడా పడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. దీనిపై మహిళా కమిషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కూడా ఆయన్ను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు.ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడిన మాటలు ఒక మహిళను కించపరిచే విధంగా ఉన్నాయి. నన్ను హనీమూన్ పదంతో నన్ను కించపరిచే విధంగా మాట్లాడారు. నేను ఎల్బీనగర్ పీఎస్లో ఫిర్యాదు చేశాను. డీసీపీ ఆఫీస్లో కూడా ఫిర్యాదు చేశాను. మహిళా కమిషన్వద్దకు కూడా వెళ్లాను. సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిశాను. రాజకీయంగా మహిళలు ఎదగాలని వస్తే ప్రోత్సహించకుండా ఇలా మాట్లాడుతున్నారు. ఇలాంటి వారిని బీఆర్ఎస్ వాళ్లు పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలి. నాకు న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాను. న్యాయం జరిగే వరకు పోరాడుతునే ఉంటాను.' సుజాతా నాయక్, హస్తినాపూర్ కార్పొరేటర్కావాలనే నాపై కేసు బనాయించారు : దీనిపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందించారు. రాజకీయ దురుద్దేశంతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఈ కేసును న్యాయ స్థానంలో ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. కోర్టులో తనకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీల అక్రమ సంబంధాన్ని ఎండగడుతూనే ఉంటానని తెలిపారు.

## సుమలత పట్టుదలకు ఓటమి తలవంచింది ప్రభుత్వ ఉద్యోగం ఎదురొచ్చింది

సాధారణ మధ్య తరగతి కుటుంబ నేపథ్యం. తండ్రి మల్లయ్య వ్యవసాయదారుడు, తల్లి వెంకటమ్మ గృహిణి. ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఓ తమ్ముడు. ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివిన బ్యాక్ గ్రౌండ్. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని కలలు కన్న సాధారణ అమ్మాయి. నల్గొండ జిల్లాకు చెందిన సుమలత. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి తెలిసిన వారందరినీ ఔరా అనిపించింది. ఇటీవలే ప్రభుత్వ జూనియర్ లెక్చరర్గా నియామక పత్రం అందుకున్న ఆమె, విద్యావ్యవస్థలో కొనసాగాలన్న కోరిక నెరవేరిందని సంతోషంతో తెలిపారు.ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకున్నా : నల్గొండ జిల్లా నిడమనూరు మండలం శాకాపురానికి చెందిన సుమలత ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. తర్వాత సమీపంలోని నకిరేకల్ గురుకుల పాఠశాలలో ఇంటర్ వరకు చదివారు. అనంతరం నల్గొండలోని ఎంజీ (మహాత్మా గాంధీ) కళాశాలలో బీకామ్ పూర్తి చేశారు. సైదాబాద్లోని భోజిరెడ్డి ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్లో ఎంబీఏతో పాటు ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకామ్ పూర్తి చేశారు.ఒడిదుడుకుల నుంచే విజయం వైపు : హైదరాబాద్లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. గతంలో గ్రూప్2 ఫలితాల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా తుది ఫలితాలు సుమలతను నిరాశపరిచాయి. ఎస్పీడీసీఎల్ జేఏవో పరీక్షలో స్వల్ప మార్కులతో ఉద్యోగం కోల్పోయారు. గురుకుల నియామక పరీక్షలో అర్హత సాధించినా, అదే ఏడాదిలో సెట్ ఉత్తీర్ణత సాధించడంతో నిబంధనల ప్రకారం అర్హత లేదని అధికారులు ప్రకటించారు.ఆటంకంగా కోర్టు కేసులు : ప్రస్తుతం కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏఎస్వోగా ఉద్యోగం వచ్చినా వివిధ కారణాలతో కోర్టు కేసుల వల్ల నియామకం నిలిచిపోయింది. అయినా ఆత్మస్థైర్యాన్ని వీడలేదు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు రావడంతో అప్పటి వరకు చేసిన గెస్ట్ లెక్చరర్ ఉద్యోగం మానేసి ఏడాదిపాటు సన్నద్ధమయ్యారు. అదే సమయంలో ఏఎస్వో (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్) నియామకానికి అడ్డంకులు తొలగడంతో 2024లో కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏఎస్వోగా విధుల్లో చేరారు.3 ఉద్యోగాలతో లక్ష్యం : అనంతరం కొద్ది కాలానికే పోటీ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఆయా పరీక్షల్లో సుమలత మెరిట్ జాబితాలో చోటు సంపాదించారు. సోషల్ వెల్ఫేర్ విభాగంలో గురుకుల డిగ్రీ లెక్చరర్ (సంగారెడ్డి బుదేరా)గా, జేఏవో (దేవరకొండ మున్సిపాలిటీ)గా, తాజాగా జేఎల్ ఉద్యోగాలు వచ్చాయి. ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో జేఎల్గా నియామక పత్రం కూడా తీసుకున్నారు. వికారాబాద్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్గా చేరనున్నట్టు సుమలత తెలిపారు.

## ఆకర్షణీయమైన జీతం అంటూ ప్రకటనలు ఇస్తారు నమ్మి వెళితే 'నిర్బంధ చాకిరీ' చేయిస్తారు



రాష్ట్రంలో చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్, ఇతర దేశాలకు వలస వెళుతుంటారు. వీరి ఆసక్తిని ఆసరాగా తీసుకొని తప్పుడు ఉద్యోగాల పేరుతో కొందరు దళారులు వారిని సైబర్ ముఠాలకు అప్పగించేస్తున్నారు. ఇవి బాగా పెరిగిపోయాయి. పాస్పోర్టు అప్పగించి నిర్బంధ కేంద్రాల్లో గంటల కొద్దీ పని చేయించుకుంటూ చిత్రహింసలకు గురి చేస్తున్నారు. దీనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నమోదవుతున్న కేసులే నిదర్శనం. ఇక్కడే సుమారు 3 లక్షల మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారు.ముందుగా సోషల్ మీడియాలో కాల్ సెంటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలకు ఆకర్షణీయమైన జీతాలు అంటూ ప్రకటనలు ఇస్తారు. ఏజెంట్ల ద్వారా యువకులను లావోస్, మయన్మార్, థాయిలాండ్లకు రప్పించి, అప్పటికే అక్కడి ముఠాలు పదుల సంఖ్యలో అడ్డాలను ఏర్పాటు చేసుకొని ఉంటాయి. తమ వలకు చిక్కిన యువకులు విమానాశ్రయాల్లో దిగగానే ముఠా సభ్యులు తమ ప్రాంతాలకు తరలించి పాస్పోర్టు లాగేసుకుంటున్నారు. అక్కడ సైబర్ నేరాలు ఎలా చేయాలన్న విషయమై మెళకువలు నేర్పిస్తారు. మోసాలు చేయడానికి ఒప్పుకోకపోతే బెదిరింపులు, చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఈ నరక కూపం నుంచి బయటపడేందుకు ధైర్యం చేసిన వారు, అక్కడి భారత ఎంబసీకి ఫిర్యాదు చేసిన వారికి మాత్రమే వారి కబంధాల నుంచి విముక్తి లభిస్తోంది.మానవ అక్రమ రవాణా హబ్గా మయన్మార్ : ప్రస్తుతం టీజీసీఎస్బీ ఆయా నేరాలపై దృష్టిని కేంద్రీకరించింది. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా హబ్గా మారిన మయన్మార్లోని సైబర్ నేరాల అడ్డాలకు తెలంగాణ యువకులను పంపిస్తున్న ఏజెంట్లపై చర్యలకు పూనుకుంది. జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ జిల్లాలో బాధితులిచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పలు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే ఐదు కేసులు నమోదు అయ్యాయి. టీజీసీఎస్బీ లోతుగా విచారణ చేపట్టగా మయన్మార్లోనూ సైబర్ ముఠాలను గుర్తించారు. ఫిబ్రవరి 21న మయన్మార్ మిలటరీ దాడి చేసి మరికొంత మందిని కాపాడింది. అందులో ఇద్దరు కరీంనగర్ వ్యక్తులు ఉన్నారు.టామ్ కామ్ను విస్తరిస్తే ఎంతో మేలు : గల్ఫ్ దేశాల్లో ఉపాధి చూపుతున్న టామ్ కామ్ (తెలంగాణ మ్యాన్ పవర్ ఓవర్సీస్ కంపెనీ)ని ఇతర దేశాలకు కూడా విస్తరిస్తే నకిలీ వీసాల మోసాల బారినపడకుండా యువతకు ఉపాధి లభించే అవకాశం ఉందని తెలిపింది. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే యువత కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోని ఎమిగ్రేషన్ వెబ్సైట్లోని సమాచారం ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకోవాలని టీజీసీఎస్బీ సూచిస్తోంది.



# కంటి దొంగను పట్టుకోండి

నీటికాసుల సమస్య (గ్లకోమా) కంటిని దొంగ దెబ్బ తీస్తుంది. పైకేమీ తెలియకుండా లోలోపలే చూపును దోచేస్తుంది. పోయిన చూపు తిరిగిరాదు. ఉన్నదాన్ని కాపాడుకోవటం తప్పించి చేయగలిగిందేమీ లేదు.నీటికాసుల సమస్య (గ్లకోమా) కంటిని దొంగ దెబ్బ తీస్తుంది. పైకేమీ తెలియకుండా లోలోపలే చూపును దోచేస్తుంది. పోయిన చూపు తిరిగిరాదు. ఉన్నదాన్ని కాపాడుకోవటం తప్పించి చేయగలిగిందేమీ లేదు. అలాగని పూర్తిగా నిరాశ పడాల్సిన పనిలేదు. క్రమం తప్పని కంటి పరీక్షలతో దొంగను ముందే పట్టుకోవచ్చు. మరింత చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చు. మార్చుకోదగిన కారకాలను సవరించుకుంటే, జాగ్రత్త పడితే నివారించుకోవచ్చు కూడా.'సీ ద ఫ్యూచర్ క్లియర్లీ' అంటూ అవగాహన పెంచుకొని, భవిష్యత్తును ముందుగానే చూడమని బోధిస్తోంది. కన్ను నిర్మాణం, పనితీరు అత్యద్భుతమైంది. కంట్లోకి వచ్చే కాంతి ముందుగా కటకం, కార్నియా నుంచి ప్రయాణించి, ఆ వెనకాల రెటీనా మీద పడుతుంది. ఇది దృశ్యనాడి ద్వారా మెదడుకు చేరుకొని, ఆయా దృశ్యాలు కనిపిస్తాయి. కటకం, కార్నియా పారదర్శకంగా ఉంటేనే వాటిలోంచి కాంతి ప్రయాణించగలదు. అందుకే వాటికి రక్తం సరఫరా కాదు. మరి వీటికి పోషకాలు ఎలా లభిస్తాయి? ఇందుకు స్వచ్ఛమైన ద్రవం (అక్వియస్ హ్యూమర్) తోడ్పడుతుంది. ఇది కటకం, కార్నియాకు పోషకాలు అందించటమే కాదు.. కన్ను ఒకే విధమైన ఒత్తిడి స్థితిలో తేలి ఉండేలా చేస్తుంది కూడా. ఈ ద్రవం నిరంతరం ఉత్పత్తి అవుతుంటుంది.

అదే సమయంలో కంటికి ఒక మూల నుంచి ప్రత్యేకమైన మార్గాల ద్వారా బయటకు పోతుంది. ఎంత ద్రవం ఉత్పత్తి అయితే అంత బయటకు పోయినంతవరకూ ఇబ్బందేమీ ఉండదు. కానీ ఈ మార్గాల్లో అడ్డంకి ఏర్పడినా, అవి మూసుకుపోయినా ద్రవం సరిగా బయటకు వెళ్లదు. అది లోపలే పోగు పడుతూ వస్తుంది. దీంతో కంట్లో ఒత్తిడి పెరుగుతుంది. ఇది దృశ్యనాడి మీదా ప్రభావం చూపుతుంది. క్రమంగా దృశ్యనాడి నొక్కుకు పోయి, చూపు దెబ్బతింటుంది. నీటికాసులంటే ఇదే. కొన్ని జన్యు సమస్యల కారణంగా శిశువుల్లో, చిన్న పిల్లల్లో ఈ మార్గాలు ఏర్పడకపోవచ్చు. వీరికి పుట్టుకతోనే గ్లకోమా ఉండొచ్చు లేదా చిన్నతనంలో తలెత్తొచ్చు.

## లక్షణాలేవీ ఉండవు

గ్లకోమాలో నొప్పి, ఎరుపు వంటి ఇబ్బందులేవీ ఉండవు. అసలు జబ్బు ఉందన్న సంగతే తెలియదు. కానీ లోలోపలే చూపు తగ్గటం మొదలవుతుంది. చుట్టుపక్కల నుంచి చూపు తగ్గుతూ రావటం దీని ప్రత్యేకత. ఆఖరికి మధ్య చూపు పోతుంది. చుట్టుపక్కల చూపు కొద్దిగా తగ్గినా తేడా ఏమీ తెలియదు. తీవ్రమవుతున్నకొద్దీ పక్క వైపు దృశ్యాలు కనిపించక ఇబ్బంది పడతారు. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు గోడలకు తాకటం, ఎత్తు పల్లాలను గుర్తించలేకపోవటం, మెట్లు ఎక్కటానికి ఇబ్బంది పడటం, కింద పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది ఇలాంటి స్థితిలోనే ఏదో సమస్య ఉందని డాక్టర్ను సంప్రదిస్తుంటారు. అప్పటివరకూ అసౌకర్యంగా అనిపించినా పెద్దగా పట్టించుకోరు. కాంతి ఎక్కువగా ఉండేలా చూసుకోవటం వంటి వాటితో నెట్టుకొస్తుంటారు. సమస్యను గుర్తించేసరికే 90 శాతం చూపు దెబ్బతిని ఉండటం విషాదకరం. చదివే వయసులో చూపు తగ్గితే చేయగలిగిందేమీ లేదు. చికిత్సలతో చూపు మరింత దెబ్బతినకుండా చూడటం తప్పించి పోయిన చూపును తిరిగి రప్పించలేం. ఇది చదువులు, కెరీర్ మీద విపరీత ప్రభావం చూపుతుందని గ్రహించాలి.

## ఎవరికి?ఎందుకు?

గ్లకోమా ఎవరికైనా రావొచ్చు. కాకపోతే వయసు మీద పడుతున్నకొద్దీ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా 40 ఏళ్లు పైబడ్డవారిలో ఎక్కువ. వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వల్ల ఇప్పుడిది ఎక్కువగానూ కనిపిస్తోంది. అయితే చిన్న వయసులో రాకూడదనేమీ లేదు. కొందరికి పుట్టినప్పుడే గ్లకోమా ఉండొచ్చు. ఒకట్రెండు ఏళ్ల వయసులోనూ రావొచ్చు. ఇందుకు రకరకాల కారణాలు దోహదం చేస్తాయి.

జన్యు స్వభావం: కొందరికి వంశపారంపర్యంగా రావొచ్చు. వంశ పారంపర్య జబ్బుల విషయంలో అతి ఎక్కువగా వచ్చే సమస్యల్లో రెండోది గ్లకోమానే. రక్త సంబంధికుల్లో ఎవరికైనా గ్లకోమా ఉంటే దీని ముప్పు 10 రెట్లు ఎక్కువవుతుంది.

మధుమేహం: రక్తంలో గ్లూకోజు నియంత్రణలో లేనివారికి కళ్లలో కొత్త రక్తనాళాలు పుట్టుకొచ్చి, లోపల రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఈ రక్తనాళాలు కంట్లోంచి ద్రవాలను బయటకు తెచ్చే మార్గాలనూ మూసేయొచ్చు. కేవలం 24 గంటల్లోనే మార్గాలు మూసుకోవచ్చు.

హ్రస్వదృష్టి (మయోపియా): హ్రస్వదృష్టి, గ్లకోమాతో ముడిపడిన జన్యువులకు దగ్గరి సంబంధముంటుంది. మరోవైపు హ్రస్వదృష్టిలో కనుగుడ్డు పెద్దగా అవుతుంది కూడా. దీంతో కంట్లో అసాధారణ మార్పులు తలెత్తి, మార్గం మూసుకోవచ్చు. హ్రస్వదృష్టి గలవారికి గ్లకోమా వచ్చే స్వభావమూ ఉన్నట్టయితే ముప్పు మరింత పెరుగుతుంది.

స్టిరాయిడ్లు: వీటి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. స్టిరాయిడ్లతో కూడిన సౌందర్య క్రీములను ముఖానికి రాసుకోవటం ఇప్పుడు శాపంగా మారుతోంది. వీటిల్లో స్టిరాయిడ్లు ఉంటున్నాయనే సమాచారాన్నీ ముద్రించటం లేదు. నీటికాసులు వచ్చే స్వభావం గలవారికివి చాలా హాని చేస్తాయి. ప్రత్యేకించి మనదగ్గర మరింత విపరీత ప్రభావం చూపుతుండటం గమనార్హం. క్రీముల ద్వారా కంట్లోకి వెళ్లిన స్టిరాయిడ్లు ద్రవం బయటకు వచ్చే మార్గాన్ని మూసేస్తాయి. అప్పుడు 34 వారాల్లోనే కంట్లో ఒత్తిడి విపరీతంగా పెరగొచ్చు. దీన్ని చాలామంది గుర్తించలేరు, అనుమానించలేరు. ఏదో చూపు కాస్త మందగించిందని భావిస్తుంటారు గానీ నీటికాసులని తెలుసుకోలేరు. కంట్లో స్టిరాయిడ్ చుక్కల మందులు, స్టిరాయిడ్ మాత్రలూ కొందరికి ముప్పు తెచ్చిపెట్టొచ్చు.

గాయాలు: కళ్లకు దెబ్బలు తగలటం వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఎక్కువవుతుంది. వాటర్ బుల్లెట్స్, గన్స్ వంటి ఆట వస్తువులతో ఎంతోమంది పిల్లలు కంటి గాయాల పాలవుతుండటం చూస్తున్నాం. ఇది పెద్ద సమస్య. కళ్లకు దెబ్బ తగిలినా, చూపు సరిగా కనిపించకపోయినా తల్లిదండ్రులు తిడతారేమోననే భయంతో పిల్లలు పైకి చెప్పరు. ఇది సమస్య ఇంకాస్త ముదరటానికి దారితీస్తోంది.

## రెండు రకాలు

గ్లకోమాను ప్రధానంగా రెండు రకాలుగా చెప్పుకోవాలి. 1. ఓపెన్ యాంగిల్ రకం. ఇందులో మార్గం పూర్తిగా మూసుకుపోదు గానీ ద్రవం సరిగా బయటకు వెళ్లదు. ఇది నెమ్మదిగా ముదురుతూ వస్తుంది. లక్షణాలేవీ ఉండవు. దృశ్యనాడి బాగా దెబ్బతినే వరకూ చూపు తగ్గిన విషయమే తెలియదు. 2. యాంగిల్ క్లోజర్ రకం. ఇందులో మార్గం దాదాపు పూర్తిగా మూసుకుపోతుంది. కొన్ని సార్లు ఇది హఠాత్తుగానూ మూసుకుపోవచ్చు. అప్పుడు తీవ్రమైన తలనొప్పి, కంటి నొప్పి, వాంతి, వికారం, చూపు మసకబారటం, కళ్లు ఎరుపెక్కటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకం గ్లకోమాకు లేజర్తో, తర్వాత మందులతో చికిత్స చేస్తారు.

## శిశువుల్లో భిన్నం

పుట్టుకతోనే గ్లకోమా ఉన్నట్టయితే పిల్లల్లో నల్లగుడ్డు కాస్త నీలంగానో, తెల్లగానో ఉంటుంది. కనుగుడ్లు చాలా పెద్దగా ఉంటాయి కూడా. ఆసుపత్రిలో కాన్పు అయితే చిన్న పిల్లల డాక్టర్ చూసి, గుర్తించగలుగుతారు. కానీ ఇళ్లలో లేదా వైద్య నిపుణులు అందుబాటులో లేని చోట కాన్పు అయితే తెలుసుకోలేక పోవచ్చు. పుట్టుకతో వచ్చే గ్లకోమాకు నెల లోపే ఆపరేషన్ చేసి, మార్గాన్ని సరిచేయటానికి వీలుంటుంది. మామూలు పిల్లల్లాగానే పెరుగుతారు. చాలామంది బిడ్డ పెరిగిన తర్వాత చూద్దాంలే. అదే కుదురుకుంటుందిలే అని ఆలస్యం చేస్తుంటారు. ఇది ప్రమాదం.

## చికిత్స: మందులే ప్రధానం

గ్లకోమా చికిత్సలో ప్రధానమైంది కంట్లో ఒత్తిడిని తగ్గించటం. ఇందుకు ద్రవం ఉత్పత్తిని తగ్గించేవి, ద్రవం తేలికగా కంట్లోంచి



బయటకు వెళ్లేలా చేసే చుక్కల మందులు ఉపయోగ పడతాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటే గ్లకోమా తలెత్తకుండా కాపాడుకోవచ్చు. జబ్బున్నా ముదరకుండా చూసుకోవచ్చు. ద్రవం బయటకు వెళ్లే మార్గం మూసుకుపోతే లేజర్ చికిత్సతో తిరిగి తెరవొచ్చు. అయితే కొందరికి మార్గం పూర్తిగా తెరచుకోకపోవచ్చు. వీళ్లు మందులను కొనసాగించాల్సి ఉంటుంది. దాదాపు 8090% మందికి ఈ మందులు, లేజర్ చికిత్సతోనే సమస్య నియంత్రణలో ఉంటుంది. కాకపోతే ఎంత త్వరగా చికిత్స తీసుకుంటే అంత మంచిది. నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా చూపు పోవచ్చు. దీన్ని తిరిగి తేవటం అసాధ్యం.

శస్త్రచికిత్స: మందులతో ఫలితం లేకపోయినా, మందులు పడకపోయినా, మందులు వాడుకోలేని స్థితిలో ఉన్నా శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఇందులో కంట్లోంచి ద్రవం బయటకు పోవటానికి మరో మార్గాన్ని సృష్టిస్తారు. మరీ చిన్న పిల్లల్లోనైతే శస్త్రచికిత్సే ప్రధానం. వీరిలో ద్రవాలు బయటకు పోయే మార్గాలు ఏర్పడకపోవచ్చు. కొత్త మార్గాన్ని ఏర్పాటు చేస్తే సమస్య కుదురు కుంటుంది.

## కొవిడ్ నేర్పిన పాఠం

నీటికాసుల శస్త్రచికిత్స చేశాక రెండు వారాల్లో కనీసం నాలుగు సార్లయినా ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. కొవిడ్ సమయంలో ఇది కుదిరేది కాదు. సమయానికి ఆసుపత్రికి రాలేకపోయినా కళ్లు దెబ్బతినకుండా చూడటం సమస్యగా మారింది. దీన్ని పరిష్కరించటానికి మూసుకున్న మార్గంలో స్టెంట్ అమర్చే పద్ధతి మొదలైంది. సాధారణంగా కంట్లోంచి ద్రవాన్ని బయటకు పంపే శస్త్రచికిత్సలో మూసుకున్న నాళం పక్క నుంచి కొత్త మార్గాన్ని (బైపాస్) ఏర్పాటు చేస్తారు. ఇప్పటికీ సమస్య మరీ తీవ్రంగా, క్లిష్టంగా ఉంటే దీన్నే చేస్తున్నారు. కానీ మామూలు, ఒకమాదిరి నీటికాసులకు స్టెంట్ పద్ధతి బాగా ఉపయోగపడుతున్నట్టు అనుభవాలు చెబుతున్నాయి. దీంతో త్వరగా కోలుకోవటం సాధ్యమవుతుంది. అంత ఎక్కువగా ఆసుపత్రికి రావాల్సిన అవసరముండదు. బైపాస్ సర్జరీతో పోలిస్తే దుష్ప్రభావాలూ తక్కువే. ఇప్పుడు దీన్ని విస్తృతంగానూ చేస్తున్నారు.

## జన్యు పరీక్షతో ముందే గుర్తింపు

మూడేళ్ల నుంచి నలభై ఏళ్ల వయసులో (జువైనల్) వచ్చే గ్లకోమా చాలా తీవ్రంగా ఉంటుంది. ఇందులో కంట్లో ఒత్తిడి చాలా తీవ్రంగా ఉంటుంది. దీన్ని గుర్తించలేకపోతే నెలల్లోనే పూర్తిగా చూపు పోయే ప్రమాదమూ ఉంది. సమస్యేంటంటే ఇది ఎవరికి వస్తుంది? ఏ వయసులో వస్తుందనేది ఏమాత్రం తెలియకపోవటం. దీని విషయంలో జన్యు పరీక్ష కొత్త ఆశలు కలిగిస్తోంది. ఇది చాలావరకూ వంశపారం పర్యంగా వస్తుంది కాబట్టి ఇంట్లో ఎవరికైనా గ్లకోమా వచ్చినట్టయితే కుటుంబంలో మిగతా సభ్యులతా జన్యు పరీక్ష చేయించుకోవచ్చు. ఒకప్పుడిది మనదేశంలో అందుబాటులో ఉండేది కాదు. ఇప్పుడు చాలా ల్యాబ్లో చేస్తున్నారు. ఖర్చూ తగ్గింది. జన్యు పరీక్షలో ఎంవైఓసీ జన్యుమార్పు కనిపిస్తే గ్లకోమా ముప్పు ఎక్కువగా ఉందనే అర్థం. చిన్న పిల్లల్లో జన్యు మార్పు ఉంటే నిశితంగా గమనిస్తూ, క్రమం తప్పకుండా పరీక్షలు చేయటం ద్వారా గ్లకోమాను వీలైనంత ముందుగా పట్టుకోవచ్చు. జన్యుమార్పు లేకపోతే నిశ్చింతగా ఉండొచ్చు. ఎలాంటి రకం పరీక్ష అవసరం? ఫలితాలను ఎలా అంచనా వేయాలనేది జన్యు కౌన్సెలర్లు సూచిస్తారు. దాన్ని బట్టి డాక్టర్లు అవసరమైన చికిత్స చేస్తారు. తల్లికి లేదా తండ్రికి, వారి పెద్ద పిల్లలకు గ్లకోమా ఉంటే పుట్టబోయే బిడ్డకు వచ్చే అవకాశాన్ని గుర్తించటమూ సాధ్యమవుతోంది. గర్భం ధరించిన మూడు నెలల్లోపే జన్యు పరీక్ష చేయొచ్చు. జన్యు మార్పు ఉన్నట్టయితే బిడ్డను కనాలో, వద్దో నిర్ణయించుకోవటానికీ వీలుంటుంది.

కొన్నిసార్లు తల్లిదండ్రులకు గ్లకోమా లేకపోయినా వారి నుంచి బిడ్డలకు వచ్చే అవకాశముండొచ్చు. ఇలాంటివారు కృత్రిమ గర్భధారణ పద్ధతితో ఆరోగ్యవంతమైన బిడ్డను కనటానికీ వీలుంది. అండం ఫలదీకరణ చెందిన తర్వాత జన్యుపరీక్ష చేసి, జన్యుమార్పులు లేని పిండాన్ని తల్లి కడుపులో ప్రవేశపెట్టొచ్చు. కాకపోతే దీనికి ఎక్కువ ఖర్చు అవుతుంది.

## నివారించుకోవచ్చా?

నీటికాసుల నివారణ కష్టమనే చెప్పుకోవచ్చు. కానీ తొలిదశలోనే గుర్తిస్తే ముదరకుండా చూసుకోవచ్చు. చూపు పోకుండా కాపాడుకోవచ్చు. ఇందుకు క్రమం తప్పకుండా కంటి పరీక్ష చేయించుకోవటం మేలు చేస్తుంది.


రక్త సంబంధీకుల్లో ఎవరికైనా గ్లకోమా ఉన్నట్టయితే 30, 40 ఏళ్లు దాటాక ఏటా కంటి పరీక్ష చేయించుకోవటం మంచిది. చత్వారం వంటి సమస్యలు గలవారు అద్దాలతో సరిపెట్టుకోకుండా కంట్లో ఒత్తిడి, దృశ్యనాడిని క్షుణ్నంగా పరిశీలించే సమగ్ర కంటి పరీక్ష కూడా చేయించుకోవాలి.

కంట్లో ఒత్తిడి ఎక్కువగా గలవారు చుక్కల మందును క్రమం తప్పకుండా వేసుకోవాలి. గ్లకోమా నిర్ధరణ అయినవారూ చుక్కల మందు మానరాదు.

కంటికి గాయాలు కాకుండా చూసుకోవాలి. ఒకవేళ కంటికి దెబ్బలు తగిలి, కంట్లో రక్తస్రావమైనవారైతే ఒకట్రెండు సంవత్సరాలకోసారి కంటి పరీక్ష చేయించుకోవాలి. పిల్లల కళ్లకు దెబ్బ తగిలినట్టు గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి.

జన్యు కౌన్సెలింగ్, పరీక్షలతో పుట్టబోయే పిల్లలకు రాకుండా చూసుకోవచ్చు. వచ్చిన తర్వాతా ముందే గుర్తిస్తే త్వరగా ముదరకుండా చూసుకోవచ్చు.

మధుమేహం వంటి సమస్యల్లో మార్గాలు మూసుకోవటాన్ని ముందే గుర్తిస్తే కొన్ని ఇంజెక్షన్లు, లేజర్తో రక్తనాళాలను తొలగించొచ్చు. అనంతరం మందులు లేదా శస్త్రచికిత్సతో చూపు దెబ్బతినకుండా కాపాడొచ్చు. సౌందర్య క్రీములు, ఏదైనా సమస్యకు స్టిరాయిడ్ కంటి చుక్కల మందులు, ఆస్థమా కోసం స్టిరాయిడ్ మందులను పీల్చేవారు చూపులో ఏమాత్రం తేడా కనిపించినా తాత్సారం చేయరాదు. ఏ సమస్య కోసమైనా స్టిరాయిడ్ చుక్కల మందులను ఒకట్రెండు వారాలు లేదా డాక్టర్ చెప్పినంత కాలమే వాడుకోవాలి. అనవసరంగా ఎక్కువకాలం వాడితే చూపు పోయే ప్రమాదముంది. ఇలాంటి అంధత్వాన్ని పూర్తిగా నివారించుకోవచ్చు.




# ఎండాకాలంలో షుగర్ పేషెంట్లు ఇబ్బందులు

### ఈ టిప్స్ పాటిస్తే కంట్రోల్‌లో ఉంటుందట!

సమ్మర్‌లో విహార యాత్రలకు వెళ్లాలని చాలా మంది అనుకుంటారు. కానీ డయాబెటిస్ ఉన్నవారికి మాత్రం ఇది కాస్త ఇబ్బందిగా ఉంటుంది. వీరికి వేడి వాతావరణంలో ఇంకాస్త త్వరగా డీహైడ్రేషన్ బారిన పడే అవకాశం ఉంటుంది. సమయానికి తగినంత నీరు తాగకపోతే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరిగి మూత్రం మరింత ఎక్కువగానూ రావొచ్చు. ఇది మరింత నీటి శాతం తగ్గటానికీ దారి తీస్తుంది. రక్తనాళాలు, నాడులు దెబ్బతినటం వంటి సమస్యలతో చెమట గ్రంథులు సరిగా పని చేయక శరీరం అంతగా చల్లబడుతుంది. అయితే, ఈ నేపథ్యంలోనే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలంలోనూ యాత్రలను ఆస్వాదించొచ్చుని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. (రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

**వీటి జోలికి పోవద్దు :**

మధుమేహం ఉన్నవారు దాహం వేయకపోయినా సరే నీరు ఎక్కువగా తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒంట్లో నీటి శాతం తగ్గకుండా ఉండటానికి చాలా ముఖ్యమని తెలిపారు. కెఫీన్తో కూడిన కాఫీ, కూల్ డ్రింకులు, ఎనర్జీ డ్రంక్స్, మద్యం తాగొద్దన్నారు. ఇవి శరీరంలోని నీరు బయటకు వెళ్లేలా చేస్తాయని, దీంతో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయని అంటున్నారు.

**నీడ పట్టున్నే ఉండేలా జాగ్రత్త :**

ముఖ్యంగా ఎండవేడికి గ్లూకోజు మోతాదులు పెరుగుతూ, తగ్గుతూ వస్తుంటాయి. అలాగే అధిక ఉష్ణోగ్రతలు బాడీలో ఇన్సులిన్ను వాడుకునే తీరును మార్చేస్తాయి. మిగతా రోజుల్లో కన్నా ఎండకాలంలో తరచూ డయాబెటిస్‌ను పరీక్షించుకోవాలి. ఇన్సులిన్ వాడుతున్నా వారు అవసరాన్ని బట్టి మోతాదులను నిర్ణయించుకోవాలి. డయాబెటిస్ గలవారు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో వీలైనంత వరకూ నీడ పట్టున్నే ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏసీ అందుబాటులో ఉంటే మరి మంచిది అని సూచిస్తున్నారు.


**గ్లూకోజ్ అదుపులో :**

వదులైన, లేత రంగు దుస్తులు ధరించాలి. నూలు దుస్తులైతే మేలని, ఇవి శరీరానికి బాగా గాలి తగిలేలా చూస్తాయని అంటున్నారు. సౌకర్యవంతమైన, సరైన సైజు షూ, సాక్స్ ధరించాలని, ఇవి పాదాలు దెబ్బతినకుండా కాపాడతాయని చెబుతున్నారు. ఎండ తక్కువగా ఉండే వేళల్లోనే వ్యాయామాలు చేయాలి. లేదా నీడలోనైనా చేయొచ్చు. గ్లూకోజు టాబెట్లు, ఫ్రూట్ జ్యూస్ వంటివి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి.

ఎప్పుడైనా ఉన్నట్టుండి గ్లూకోజు పడిపోతే వీటిని తీసుకుంటే వెంటనే మోతాదులు పెరుగుతాయి. ఇన్సులిన్ను చల్లటి, ప్రత్యేకమైన పెట్టెలోనే భద్రపరచుకోవాలని, లేకపోతే వేడికి ఇన్సులిన్ చెడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. యాత్రలకు వెళ్లే ముందే డాక్టర్ను సంప్రదించి మందులను మార్చుకోవాల్సిన అవసరముందేమో తెలుసుకోవాలని సలహా ఇస్తున్నారు.

**నీరు మాత్రమే కాదు :**

ప్రతి ఒక్కరు సగటున రోజుకు 2 లీటర్ల నీరు తాగాలి. డయాబెటిస్ రోగులకు ఇది మరింత ముఖ్యం. నీరు ఒక్కటే కాకుండా ఇతరత్రా ద్రవాలూ తీసుకోవచ్చు. పలుచటి మజ్జిగ తీసుకోవచ్చు. నిమ్మ లేదా టమాటా రసాన్ని చక్కర లేకుండా తాగొచ్చు. తులసి/




జీరా/పుదీనా నీళ్లు తాగొచ్చు. పీచు దండిగా ఉండే క్యాబేజీ, ఆకు కూరలు వంటివి ఎక్కువగా తీసుకోవటం మంచిది. డయాబెటిస్ నియంత్రణలో ఉన్నప్పుడు ఓ పుచ్చకాయ ముక్క కూడా తినొచ్చు. కేలరీలు తక్కువగా ఉండే కీర దోసను సలాడ్, రైతా, చక్కెర లేని లస్సీలో అయినా కలపితినవచ్చు. రోజూ గుమ్మడి, పొట్లకాయ, సొరకాయ, కాకర కూడా సేవించవచ్చు.

**చిరుతిళ్లు వెంట :**

అయితే, ట్రావెల్ చేస్తున్నప్పుడు అన్ని సార్లూ పోషక నిపుణులు సూచించిన ఆహారం అందుబాటులో ఉండకపోవచ్చు. కాబట్టి పొట్టు తీయని గోధుమ బ్రెడ్డు, అటుకులు, పలు ధాన్యాల బ్రెడ్డు, వంటివి వెంట తీసుకెళ్లటం మంచిదని సూచిస్తున్నారు. ఆహారంలో భాగంగా వేపుళ్లను పరిమితం చేసుకోవాలి. చువ్వల మీద కాల్చిన ఆహార పదార్థాలు తినకపోవటమే మంచిది. ఇవి రుచిగానే ఉన్నా, బాగా మాడినవి క్యాన్సర్ కారకంగా పరిణమించొచ్చని హెచ్చరిస్తున్నారు. మైదా, పాలిష్ పట్టిన బియ్యం కన్నా పొట్టుతో కూడిన గోధుమ పిండి, దంపుడు బియ్యం ఉపయోగించటం శ్రేయస్కరం. తక్కువ కేలరీలతో కూడిన రకరకాల ఆకుకూరలు, కూరగాయలలతో పళ్లాన్ని ఇంద్రధనుసు రంగులో ఉండేలా చూసుకోవాలి.

## ఒడిదల ప్రణవ్ బాబు చేతుల మీదుగా చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

హుజురాబాద్ సాక్ష్యం న్యూస్ :
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని మార్చి 26న ఢిల్లీలోని వందలాది కళాకారులచే కార్యక్రమం అంబేద్కర్ ఫోటోను సాధన సమితి జాతీయ అధ్యక్షులు జెర్రీపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ తెలిపారు. ఈ వాల్ పోస్టర్స్ ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వొడితెల ప్రణవ్ బాబు



చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తప్పకుండా రావాలని ఆహ్వానించమని రామంచ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా రామంచ భరత్ మాట్లాడుతూ 1921 లో ఇంప్రియల్ బ్యాంక్ కుప్పకూలినప్పుడు రూపాయి దాని సమస్య పరిష్కారం మార్గమని అనే పుస్తకాన్ని వ్రాసి హెల్డన్ యాంగ్ కమీషన్, రాయల్ కమీషన్, బ్రిటీష్ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల సైమన్ కమిషన్ ఇది వాస్తవాన్ని గ్రహించి 1935 ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడినది అంటే అది అంబేద్కర్ కృషి వల్ల వారి యొక్క త్యాగాల ఫలితంగా వారి చరిత్రను కనుమరుగు చేస్తున్నారని అన్నారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటోను ముద్రించినప్పుడే మన రాజ్యాంగాన్ని గౌరవించినట్లుని ఆత్మగౌరవం వర్ధిల్లుతుందని అన్నారు. ఈ అంశంపై పార్లమెంట్లో మాట్లాడి కరెన్సీ నోట్లపై ముద్రించుటకు కృషి చేయాలని మార్చి పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యులు పార్లమెంటు సభ్యులు మాట్లాడి కేంద్ర ప్రభుత్వపై ఒత్తిడి తేవాలని కోరారు. మార్చి 26న జరుగు దుందాం సభకు రాజ్యసభ సభ్యులు రాజకీయ పార్టీల అధ్యక్షులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా సిరిగిరి శ్యామ్

హైదరాబాద్, మార్చి 18 ( సాక్ష్యం న్యూస్ ) :



ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారులు సిరిగిరి శ్యామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ( ఢిల్లీ ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్.ఎంయు. దువ ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం సిరిగిరి శ్యామ్ విలేకరులతో మాట్లాడుతుతూ... తన పై నమ్మకంతో తనను ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా నియమించినందుకుగాను జాతీయ అధ్యక్షుడు డాక్టర్.ఎంయు.దువ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో మానవ హక్కుల ఉల్లంఘన ప్రతి చోట జరుగుతూనే ఉందన్నారు. అనేక మంది పేద ప్రజలకు అండగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఉ ంటుందన్నారు. నేడు సమాజంలో చిన్నారుల పై అత్యాచారాలు జరుగుతున్నాయని, కొంత మంది కొడుకులు వారి వారి తల్లిదండ్రులను రోడ్డునపడవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, వివక్ష లేకుండా ఉండే హక్కు ఉండాలని, సమానత్వంతో ప్రజలందరూ గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి హ్యూమన్ రైట్స్ పని చేస్తుందన్నారు. ప్రజలందరికి మానవ హక్కుల గురించి అవగాహన కల్పిస్తామని శ్యామ్ తెలిపారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచండి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 18 సాక్ష్యం న్యూస్
జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచాలన్నారు, జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మొదటి అంతస్తు లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,ఏపీఓలతో కలసి వీడియో కాన్ఫరెన్స్





నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ( ఎన్ఆర్ఈజీఎస్ ) పనుల్లో వేగం పెంచి కూలీల సంఖ్య వంద శాతం హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, మార్చి 31 లోపు, జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా జరుగుతున్న పనులు కాలువ పూడికతీత, చెక్ డ్యాం నిర్మాణం, ఇంకుడు గుంతలు, తదితర అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు, విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సాల్ టోప్పో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు ఏపీ ఓలు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి: సీడీపీవో ప్రేమలత

ములుగు ప్రతినిధి మార్చి 18 సాక్ష్యం న్యూస్
తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో నెహ్రూ యువ





కేంద్ర వరంగల్ సౌజన్యంతో కస్తూరిబాయి మహిళామండలి ఆధ్వర్యంలో ఏటూరునాగారం డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో యువతకు లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశం జరిగింది. మొదటగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రేణుక అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏటూరునాగారం ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ప్రేమలత మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజం లో యువత విలువలతో కూడిన జీవితాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉ ంది. ప్రేమ, వ్యామోహం మాటున యువత చెడు దారిలో పయనించకుండా నిగ్రహశక్తిని పెంపొందించుకొని జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేసుకొని జీవిత భాగస్వామితో మాత్రమే ఆనందంగా జీవించాలని, లేకుంటే అపరిచితులతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎయిడ్స్ వ్యాధికి గురయ్యే ప్రమాదం పొంచి ఉందని హితవుపలికారు. భారతదేశ భవిష్యత్తు యువత పైనే ఉ ందని, యువత శారీరక సుఖాల కోసం పెడత్రోవ పట్టకుండా, లైంగిక విషయాల పట్ల అవగాహన పెంచుకొని, సన్మార్గంలో ప్రయాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విశిష్ట అతిధిగా విచ్చేసిన నెహ్రూ యువ కేంద్ర వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల మాట్లాడుతూ శారీరకంగా



మానసికంగా దృఢంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజం కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రిసోర్స్ పర్సన్ గా జ్యోతి హాజరై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాప్తి మార్గాలు, దాని నివారణ కొరకు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల సమాజం చులకన భావంతో చూడకుండా వారికి ఆత్మీయతను పంచాలని పిలుపునిచ్చారు. మరో రిసోర్స్ పర్సన్ డా. ఆకులపెల్లి మధు ఈ కార్యక్రమం లో పాల్గొన్న యువతకు వివిధ అంశాల పైన అవగాహన కల్పించారు. వివిధ సంఘాల నుండి విచ్చేసిన బాధ్యులకు, కార్యక్రమంలో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో



కస్తూరిబా మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి కొమరగిరి సామ్రాజ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రోగ్రాం డా. వెంకటయ్య, ఐటీడిఏ నుండి స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామలత, అడ్వకేట్ బానోత్ మహేందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగము నుండి, ప్రొటెక్షన్ ఆఫీసర్, హరికృష్ణ, ఓ ఆర్ డబ్ల్యూ బి రాజు, ఐ సి టి సి కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం పాల్గొన్నారు . అనంతరం వివిధ యువజన సంఘాల నుండి విచ్చేసిన బాధ్యులకు, కార్యక్రమంలో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

## ఇష్టంతో కష్టపడి చదవాలి.. ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ కీలకం

**మంచి ఫలితాలు సాధించాలి**

**విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి**

**కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

ములుగు ప్రతినిధి, మార్చి 18(సాక్ష్యం న్యూస్):
విద్యార్థిని విద్యార్థులు చదువుకోవడానికి భయపడవద్దని, ఇష్టంతో కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం ఏటూరు నాగారం మండలం ఆకుల వారి ఘనపురం లోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులకు అందిస్తున్న భోజనశాల, వంటగదిని, సరుకుల స్టోరేజీ గదిని తనిఖీ చేశారు. సరుకులను వాటి బ్రాండ్ ను, నాణ్యతను, గడువు తేదీని పరిశీలించారు. వంట గదిలో శుభ్రత పాటించాలని, పరిశుభ్రత, నాణ్యతతో భోజనం తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిర్దేశించిన కంపెనీలకు చెందిన స్టాక్ ను మాత్రమే వినియోగించాలని తెలిపారు. భోజనం రుచి, నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ఏ సమయానికి ఏయే ఆహారం ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు అన్ని రకాల పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల విటమిన్ల, ప్రోటీన్లతో కూడిన ఈ ఆహారాన్ని కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు.అనంతరం విద్యార్థులతో ముచ్చటించి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి సుఖ జీవితం పొందాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని,





ప్రతిరోజు నాలుగైదు గంటలు చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండా విద్యను అభ్యసించాలని, తెలియని విషయాలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలని అన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నూతన విద్యా బోధన విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. చదువులో రాణిస్తామో రాణించమనే భయాన్ని తొలగించుకొని, ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు కన్న కలలను విద్యలో రాణించి నిజం చేయాలని అన్నారు.ప్రతిభ కనబరిస్తే అన్ని రంగాలలో రాణించవచ్చు.పలు అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.యువతి యువకులు విద్యారంగంలో తమ ప్రతిభను కనబరిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని, వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో అగ్నిపథ్ 2025-26 సంవత్సరంలో భారత సైన్యంలో చేయడానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన సదస్సు కు ముఖ్య అతిథిగాకలెక్టర్ హాజరై మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభ కనపరిస్తే మన దేశం లోనే కాకుండా ఇతర దేశాలలో సైతం ఉద్యోగాలు పొందే అవకాశాలు వస్తాయని, యువత ఏదో ఒక రంగంలో విద్యను అభ్యసించడానికి చొరవ చూపాలని సూచించారు. భారత సైన్యంలో చేరడానికి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు కష్టపడితేనే అన్ని ఫలాలను పొందుతారని అన్నారు. భారత సైన్యంలో చేరడానికి అవిహహాత యువతకు ముందుకు రావడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు.అర్హత ఉండి పేదవారైన వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరిగింది అన్నారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను అర్హత ఉండి పేదవారైన అందరికీ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ అన్నారు. మండలంలోని ముళ్ళకట్ట గ్రామంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇండ్ల నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం మొదటి విడత ఆరులకు నిధులను కేటాయించిందని, 5 లక్షల లోపు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయడానికి నమూనా ఇంటిని ప్రతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్మించామని అన్నారు. మొదటి విడత పనులు చేపట్టిన లబ్ధిదారులకు పునాది పనులు పూర్తయిన అనంతరం లక్ష రూపాయలను తమ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, పిల్లర్లు వేసి స్లాబ్ వేసిన అనంతరం మూడు లక్షల రూపాయలను లబ్ధిదారుల ఖాతాకు జమ చేయడం జరుగుతుందని అన్ని పనులు పూర్తయిన అనంతరం మరో లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా పేదలకు ఉన్న ఇండ్ల స్థలాల వివరాలను సేకరించడం జరిగిందని, ఇంటి స్థలం లేని లబ్ధిదారులకు మొదటి విడతలో ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉండి ఇండ్లు మంజూరు కానీ లబ్ధిదారులు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో ను కలిసి వివరించాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఇండ్లు మంజూరు కాని వారికి మొదటి విడతలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఐటిఐ ప్రిన్సిపల్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ మోవీన్ కుమార్, సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, కార్యదర్శి, గ్రామ ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం

ములుగు ప్రతినిధి మార్చి 18 సాక్ష్యం న్యూస్
ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ బిల్లు ఆమోదం



పొందినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ సందర్భంగా ఏటూరునాగారం కాంగ్రెస్ అధ్యక్షులు. చిటమట రఘు మాట్లాడుతూ తెలంగాణ శాసనసభలో బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రవేశపెట్టిన బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును తీసుకువచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వారి మంత్రివర్గ సహచరులకు,తెలంగాణ ప్రభుత్వానికి ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేకమైన ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శ్రీ రాహుల్ గాంధీ ఎంత జనాభా ఉంటే అంత రిజర్వేషన్ (కిత్నా ఆద్మీ హై ఉత్న రోటి దేనేక హై) ఇవ్వాలని తెలిపారు దాని ప్రకారం శ్రీ రాహుల్ గాంధీ మల్లికార్జున కర్గే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ ను అమలు జరిగేలా ఆదేశించిన రాహుల్ గాంధీ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. శాసనసభలో ఆమోదం పొందిన బీసీ డిక్లరేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించేలా బిజెపి నాయకులు బిఆర్ఎస్ నాయకులు వారి యొక్క చిత్తశు ద్ధిని నిరూపించుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు తెలంగాణ ఇస్తా అని చెప్పి ఇచ్చిన ఘనత సోనియా గాంధీ కి దక్కిందని తెలిపారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఇచ్చిన ఘనత రాహుల్ గాంధీ దక్కుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి చెందిన 8 మంది ఎంపిలను గెలిపించిన ప్రజలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదం పొందేలా చేసి వారి యొక్క చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ నగర్ కాలనీ శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయము ప్రథమ వార్షికోత్సవ ఆహ్వానము

సాక్ష్యం న్యూస్ సదాశివపేట
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో శ్రీకృష్ణ నగర్ కాలనీలో ని శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం ప్రథమ వార్షికోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు మూడు రోజులపాటు నిర్వహించినట్లు ఆలయ కమిటీ నెమలికొండ వేణుమాధవ్ ఆరో వార్డ్ గుండు రవికుమార్ ఆలయ ఆలయ కమిటీ అధ్యక్షులు గురుకుల నాగరాజ్ ప్రధాన కార్యదర్శి అటిపాముల ఆనంద్ ఆంజనేయులు





భూష శేఖర్ రమేష్ సంగం రాములు జగదీష్ విజయ్ కుమార్ గణేష్ బామిళ్ళ రవి సోమవారం ఉదయం 8 గంటల నుండి మహిళచే 108 కలశ%ికేతో ఊరేగింపు స్వామివారి అభిషేకం వహిళ దేవత హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని జీ ఆలయ అర్చకులు మాదుగుల సర్వంతం శర్మ పంతులు అన్నారు

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,మార్చి 18,( సాక్ష్యం న్యూస్):
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థిక సహాయం అందించడానికి అమలు చేసిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నియోజకవర్గంలో అధికారులు పారదర్శకంగా అమలు



చేయాలని,సామాజిక కార్యకర్త కర్నె రవి కోరారు. మంగళవారంఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకి ఉ పాధి కల్పించాలన్నారు.నైపుణ్యం ఉండీ ఉద్యోగం లభించని యువతకు ఈ పథకం కింద ప్రాధాన్యత కల్పించాలని,అర్హులు, నిజమైన నిరుద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా లబ్ధి దారులను ఎంపిక చేపట్టలన్నారు. మరో వైపు ఈ పథకానికి ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలంటే వృత్తి నైపుణ్యం, స్టడీ సర్టిఫికెట్లుతోపాటు రేషన్ కార్డు ప్రామాణికంగాపెట్టారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి నూతన రేషన్ కార్డు మంజూరు చేయలేదని, నేటి ప్రజా ప్రభుత్వ పాలన పదిహేను నెలలు గడుస్తున్నా కనీసం గ్రామాలలో ఒక్క కుటుంబాని కి ఆహా ర భద్రతకార్డులు జారీ కాలేదన్నారు. పాలకుల మాటలు హామీలకే పరిమితం అయ్యాయని ఆరోపిం చారు. దీనితో పథకానికి ధరఖాస్తు చేసుకొనే యువత రేషన్ కార్డులులేకపోవడంతో పెద్ద ఎత్తున నష్ట పోయే ప్రమాదం ఉ ందన్నారు.నిరుద్యోగ యువత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు స్వీకరణలో రేషన్ కార్డు ప్రామాణిక కాలాన్ని తొలగించి, మారేదైన గుర్తింపు ను జోడించాలాని ఆయన ప్రభుత్వం కు విజ్ఞప్తి చేశారు.

## టీయూడబ్ల్యూజే ఐజేయులో భారీగా చేరికలు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 18,( సాక్షం న్యూస్ ):
జిల్లా (డెమోక్రటిక్ జర్నలిస్టు సంఘం నాయకులు ఐజేయులోభారీగా సభ్యత్వం తీసుకున్నారు. మంగళవారం టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా



అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఐజేయు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కొత్తగూడెం , సుజాతనగర్ ప్రాంతాలలో ఉన్న జర్నలిస్టులు సభ్యతాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏర్పుల సుధాకర్ రావు ,జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎర్ర ఈశ్వర్, తదితరులు, పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రికి వినతి పత్రం అందజేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే


హైదరాబాద్, బొల్లారం మార్చ్ 18 (సాక్ష్యం న్యూస్)
శాసనసభ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి మచ్చ బొల్లారం స్మశానవాటికలో అక్రమంగా ఏర్పాటు చేసిన డంప్ యార్డ్ ను తొలగించాలని వినతిపత్రం అందజేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. మచ్చ బొల్లారం



ప్రజల పాలిట గుదిబండగా మారి వారి ఆరోగ్యాలను ప్రశ్నార్థకంగా మార్చిన మచ్చ బొల్లారం స్మశాన వాటికలో అక్రమంగా ఏర్పాటు చేసిన డంప్ యార్డ్ ను తొలగించాలని కోరుతూ మంత్రికి దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే. వివరాల్లోకి వెళితే చాలా రోజుల నుండి స్థానిక ప్రజలు డంప్ యార్డును తొలగించాలని జే.ఏ.సి. గా ఏర్పడి బల్దియాతో పోరాటం చేస్తున్నారు. ఎమ్మెల్యే కి కూడా తమ సమస్యను తెలియజేయగా డంప్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే పరిస్థితి తీవ్రతను గమనించి, బల్దియా, రాంకీ అధికారులతో సమావేశమై వీలయినంత త్వరగా హిందూ స్మశాన వాటిక నుండి డంప్ యార్డు తొలగించాలని కోరారు. అయినా కూడా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తానే స్వయంగా ప్రజలతో కలిసి డంప్ యార్డు చెత్తలో కూర్చొని ధర్నా నిర్వహించడంతో పాటు ఈరోజు సంబంధిత మంత్రి కి కూడా వినతిపత్రం ఇస్తూ డంప్ యార్డు ద్వార వస్తున్న కాలుష్యం నుండి ప్రజలను పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

## చిత్రపురి కమిటీపై 12 కేసుల ఛార్జ్ షీట్

ఎల్బీ నగర్(సాక్ష్యం):
చిత్రపురిలో దాదాపుగా 300 కోట్ల రూపాయల కుంభకోణం, ఫ్లాట్ల కుంభకోణం, 449 సభ్యత్వాల టాంపరింగ్, 189 మార్ఫింగ్ ఆలోట్మెంట్స్, ఫోటోలు లేని 220 సభ్యులు, 336 అక్రమ రిజిస్ట్రేషన్ లు జరిగినట్టుగా ప్రభుత్వమే ధ్రువీకరించిన నేపథ్యంలో ఆర్థిక నేరాల




విభాగానికి ( ఎకనామిక్ అఫిన్స్ వింగ్ ) చెందిన సైబరాబాద్ పోలీసులు ఇప్పటికే 12 ఛార్జ్ షీట్ లు ఎల్బీ నగర్ కోర్ట్ లో %జజ చీూ% / 1061/2025, 1060/25, 129 /25, 723/25, 712/25, 709/25 తదితర కేసులు వేశారు. బెయిల్ కండిషన్స్ దిక్కరణ విషయంలో సుప్రీం కోర్ట్ స్పెషల్ లీవ్ పిటిషన్ ని తిరస్కరించిన తర్వాత, ఇప్పటికే చిత్రపురి అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ గత 20 రోజుల నుండీ చర్లపల్లి జైలులో ఉన్న విషయం అందరికీ తెలిసిందే... ఈ సమయంలో మరో 12 కేసులు ఛార్జ్ షీట్ కావటం, చిత్రపురి అక్రమార్కులు చేసిన అన్నీ కుట్రలు వెలుగులోకి వస్తుండటం పట్ల చిత్రపురి సాధన సమితి అధ్యక్షులు కస్తూరి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ భద్ర, ప్రజానాట్యమండలి సినిమా శాఖ కార్యదర్శి మద్దినేని రమేష్ లు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యుత్ లైను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి: కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,మార్చి 18,(సాక్ష్యం న్యూస్ ):
జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కొరకు విద్యుత్తు లైన్ ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఎక్కడ అయితే విద్యుత్తు లైన్లు అవసరమో పంచాయతీ సెక్రటరీ గుర్తించి, విద్యుత్ లైన్ల మంజూరుకు అవసరమైన పత్రాలు , గ్రామసభ ఆమోదంతో అటవీశాఖ అధికారులకు అందించటం ద్వారా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామనీ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను గుంతలు ఎన్ని నిర్మాణం చేపట్టవచ్చు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టేలా పంచాయతీ సెక్రటరీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రాష్ట్రంలో






పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పోడు వ్యవసాయంకు విద్యుదీకరణ, ఉపాధి హామీ పనుల పురోగతి, త్రాగునీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు త్రవ్వకాలు, మీసేవ దరఖాస్తులు, ధరణి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ పోడు పట్టాలు పొందిన రైతులు వ్యవసాయం చేయడానికి వీలుగా నీటి వసతి కల్పించుటకు గాను వ్యవసాయ భూములకు విద్యుదీకరణ కు అవసరమైన లైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో తెలపడం ద్వారా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయా లనితెలిపారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు సాధ్యంకానీ ప్రదేశాలలో అటవీ శాఖ అధికారుల ఆమోదంతో బావులు త్రవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు ద్వారా పోడు సాగుకు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. పోడు భూములలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన రైతులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గాను విద్యుత్ లైన్ లో ఏర్పాటు సహకరించాలని అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ ను కలెక్టర్ కోరారు. జిల్లాలోని అన్ని మండల అటవీ శాఖ రేంజర్లు అటవీ శాఖ పరిధిలో ఉ పాధి హామీ పథకం క్రింద చేపట్టవలసిన పనులను గుర్తించి నివేదికలు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో ఫామ్ పౌండ్ ( నీటి గుంటలు) త్రవ్వకాల కోసం రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో బోర్ ద్వారా సాగు చేసే రైతులు వివరాలు రేపటిలోగా అందించాలన ఆదేశించారు. బోర్ ద్వారా వ్యవసాయం చేసే ప్రతి రైతు వ్యవసాయ భూమిలో కచ్చితంగా నీటి గుంటల నిర్మాణం చేపట్టాల్సిందే అని స్పష్టం చేశారు. జల శక్తి అభియాన్ లో భాగంగా పంచాయతీ పరిధిలోని ప్రతి కార్యాలయాల్లో, పాఠశాలల్లో, రోడ్డు ప్రక్కన ప్రాంతాలు గుర్తించి ఇంకుడు ఘనంగా నిర్వహించేటువంటి బతుకమ్మ పండుగలో పూజకు ఉపయోగించే తంగేడు పువ్వు జిల్లాలో ఎక్కడా కనపడటం లేదని, ప్రజలకు ఉ పయోగపడే మొక్కలను పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని నర్సరీలలో ఇప్ప, కరక్కాయ, చింత, విష ముష్టి, కుంకుడు, తంగేడు వంటి మొక్కలను పెంచాలని సూచించారు. మొక్కలు పెంచడానికి వీలుగా గింజల సేకరణ చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గింజల సేకరణలో అత్యధికంగా గ్రామస్థాయిలో 1000, మండల స్థాయిలో 5000 , జిల్లాస్థాయిలో 50,000 బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలల నుండి ప్రకృతి మరియు పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా మునగ సాగు, అజోల్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చేపల పెంపకం మరియు వెదురు సాగుపై అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు రైతులు తమకు ఈ పంటల గురించి ఎవరూ చెప్పలేదని, అవగాహన కల్పించలేదని దృష్టికి వచ్చిందని, వ్యవసాయ అధికారులు పద్ధతి మార్చుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లావ్యాప్తంగా పెండింగ్ ఓటర్ మార్పులు, చేర్పులు మరియు నూతన ఓటర్ దరఖాస్తులు, మీసేవ కేంద్రాలలో వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ ధరణి పెండింగ్ దరఖాస్తులు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఉన్న పెండింగ్ ధరణి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇంటికి త్రాగునీటి అందేలా త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అడిషనల్ డి ఆర్ డి ఓ రవి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూర్య, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, మిషన్ భగీరథ నలిని, సంబంధిత అధికారులు ,తదితరులు, పాల్గొన్నారు.

# ఉద్యోగ నియమాక పత్రాలు అందజేసిన జీఎం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,మార్చి 18 ,(సాక్ష్యం న్యూస్ ):
మణుగూరు ఏరియా సింగరేణిలో పని చేస్తూ మెడికల్ ఇన్వలిడేట్ అయిన 10 మంది ఉద్యోగుల కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు మంగళవారం జిఎం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని కారుణ్య నియామకం క్రింద మొత్తం 09 మంది పురుష డిపెండెంట్లతో పాటు ఒక మహిళా డిపెండెంట్లకు సింగరేణిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు అనంతరం మాట్లాడుతూ సింగరేణి అంటే కేవలం ఉ ద్యోగులకు జీవనోపాధి కల్గించే ఓ సాధారణ సంస్థ కాదు ఉద్యోగుల శ్రమశక్తి అధికారుల మేధోశక్తి కలబోతతో ప్రకృత్తికి విరుద్ధంగా పని చేస్తూ బొగ్గు ఉత్పత్తి చేయడం ద్వారా ఎన్నో పరిశ్రమలకు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాల మనుగడకు ఊతం ఇస్తున్నా గొప్ప సంస్థ మన సింగరేణి, ఇందులో ఉద్యోగం చెయ్యడం అంటే అదో భాద్యత, ఆ భాద్యతను సక్రమంగా నిర్వర్తించే వాళ్ళు సుదీర్ఘా కాలం కుటుంబ అవసరాలకు, బిడ్డల బంగారు భవిష్యత్తు సరిపడా సంపాదన జీత భత్యాల రూపంలో పొందవచ్చు అన్నారు. సకల సౌకర్యాలు కూడా పొందవచ్చు, అంతేగాక పదవి విరమణ చేశాక వచ్చే పెన్షన్ తో శేష జీవితం సుఖంగా




గడుపవచ్చు అన్నారు. అన్ని రకాల ప్రయోజనాలు చేకూర్చే సింగరేణిలో ఉద్యోగం పొందడం గొప్ప అవకాశంగా భావించి నాగాలు చేయకుండా క్రమశిక్షణతో, రక్షణతో నిజాయితీ నిబద్ధతతో పని చేస్తూ ప్రత్యక్షంగా సంస్థ పురోభివృద్ధికి పరోక్షంగా రాష్ట్ర సహకారానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగాఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిజిఎం పర్సనల్ అధికార ప్రతినిధి ఎస్. రమేశ్ , డిజిఎం వెంకట్ రావు , ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్ , ఐఎన్ టియూసి వైస్ ప్రెసిడెంట్ శ్రీ వి. కృష్ణం రాజు , సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్ , రామేశ్వర్ రావు , చంద్ర కిరణ్ ,తదితరులు, పాల్గొన్నారు.

# మిరపకాయలు తగలబెట్టిన దొంగల రిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,మార్చి 18 ,(సాక్ష్యం న్యూస్):
మిరపకాయలను తగలబెట్టిన దొంగలను రిమాండ్ చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు ఆదేశాల ప్రకారం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై రాజకుమార్ కేసు దర్యాప్తును ముమ్మరం చేసి సాక్షాధారాల ఆధారంగా నిందితులను గుర్తించారు.సీఐ




తెలిపారు. మంగళవారంపినపాక మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి పురుషోత్తం అనే వ్యక్తి మిరపకాయలు కళ్ళ%శీ%లో ఎండబెట్టిన 50 క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తలగబెట్టిన విషయం తెలిసిందే.
ఈ విషయంపై రైతు పురుషోత్తం బయ్యారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెంకటరవుపేట గ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ వెంకటేశ్వర్లు, మంచర్ల వెంకటేశ్వర్లు లను నిందితులుగా గుర్తించామని తెలిపారు.వెంకటేశ్వరపురం గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుంటే ఆ ఇద్దరు వ్యక్తుల్ని వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్ పై పారిపోతుంటే పట్టుకొని విచారించగా తాండ్ర బాలకృష్ణ అనే వ్యక్తి భార్య గత సంవత్సరం క్రింద చనిపోగా పురుషోత్తంమే మంత్రాలు చేయడం వల్లనే తన భార్య చనిపోయిందని అతడు మనసులో కక్ష పెంచుకొని ఈ విషయాన్ని తన మామ వెంకటేశ్వర్లుకు చెప్పగా అతడు కూడా తనను పెద్దమనిషిగా ఎదగనీయకుండా పురుషోత్తమే అన్ని పంచాయతీలలో అడ్డుపడుతున్నాడని అతనిని ఎలాగైనా ఆర్థికంగా దెబ్బ తీయాలని ఇద్దరూ అనుకొని సరైన సమయం కోసం వేచి చూస్తూ 10వ తారీకు అర్ధరాత్రి సమయం లో మిరపకాయలకల్లాల వద్ద ఎవరు కాపలా లేరని గమనించి పురుషోత్తంనికి సంబంధించిన 50 క్వింటాళ్ల మిర్చి కుప్పగా వేసి ఉండగా బాలకృష్ణ తను తెచ్చిన ఐదు లీటర్ల పెట్రోలు ఎండు మిర్చి చుట్టూ చల్లినిప్పంటించినాడన్నారు. వెంకటేశ్వర్లు రోడ్డుపై ఎవరూ రాకుండా కాపలాగా ఉన్నాడనీ, మిర్చి అంటుకున్న వెంటనే ఇద్దరు అక్కడి నుండి పారిపోయి ఇళ్లకు పోయి రాత్రి ఇళ్లలోనే నిద్రించారని వివరాలు తెలిపారు. సోమవారం నిందితులను ఇద్దరినీ పట్టుకొని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు.కేసును త్వరగా చేదించిన ఏడుల్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు , ఎస్సై రాజుకుమార్ లను డి.ఎస్.పి రవీందర్ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీనారాయణ,దిలీప్, శ్రీనివాస్ ,రాము, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు

## పదవతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ అందించిన వర్ధిని ఫౌండేషన్

జనగామ జిల్లా బ్యూరో , సాక్ష్యం న్యూస్
జనగామ జిల్లాచాగల్లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రోజున10వ తరగతి విద్యార్థులకు




రానున్న పరీక్షల దృష్ట్యా ఎగ్జామ్ సక్సెస్ కిట్ నీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇల్లందుల విజయ్ మరియు కాంగ్రెస్ నాయకులు సౌదరపల్లి సంపత్ రాజ్ గారి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధిని ఫౌండేషన్ బాధ్యులు తన్నీరు రమేష్ , హఫీజ్, కొర్ర వెంకటేష్ నాయక్, ఇల్లందుల రాజు మరియు కాంగ్రెస్ యూత్ నాయకులు ఐలపాక శ్రీనివాస్, పొన్న రాజేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ చౌరస్తాలో సీఎం, భట్టి , పొన్నం, కొమ్మూరి చిత్ర పటాలకు పాలాభిషేకం

జనగాం జిల్లా బ్యూరో, సాక్ష్యం న్యూస్
తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద మార్చి 17 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ దరఖాస్తుల ప్రక్రియను ఇవాళ ప్రారంభించనున్న సందర్భంగా మంగళవారం రోజున డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భట్టి విక్రమార్క గారికి,పొన్నం ప్రభాకర్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం ఏర్పాటు చేశారు. జనగామ అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 11 గంటలకు జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నర్సింహ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, మహిళా





కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికే ఇందిరా ,మాజీ కౌన్సిలర్ లు పాల్గొని మాట్లాడారు.ఈ పథకానికి సంబంధించి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పథకం విధివిధానాలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత యువతకు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చామని అన్నారు.రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.6 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేయాలని.. రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. చాలా రోజుల తర్వాత స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండటంతో భారీ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నర్సింహ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు,జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, నర్మెట్ట మండల అధ్యక్షులు రాజబోయిన లక్ష్మి నారాయణ,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికే ఇందిరా , మాజీ కౌన్సిలర్ లు గాదెపాక రామచంద్రం,బొట్ల శ్రీను,మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు జమాల్ షరీఫ్,మిద్దెపాక సిద్దులు,శివరాత్రి కుమార్,బడికే కిష్ట స్వామి,బొట్ల నర్సింగరావు,నామాల శ్రీను,భస్సీ,రంగు రవి, నోముల రాజు,ఎండీ సలీం,మైనార్టీ పట్టణ అధ్యక్షులు ఇస్మాయిల్,మహిళా కాంగ్రెస్ నాయకురాలు మున్ని భాగం,పట్టణ అధ్యక్షురాలు శ్రీలత,అలీమోద్దీన్ ,పాము నర్సింహ రావు,పాముకుంట్ల మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ రాజ్,మండల అధ్యక్షులు మారబోయిన ప్రకాష్,బక్క ప్రవర్ధన్,సూదగాని కృష్ణ,చిరంజీవి,చిక్కుడు వెంకటేష్,బండ విజయ్,పిడుగు రమేష్, అరవింద్,పట్టణ వార్డు అధ్యక్షులు మచ్చ ప్రవీణ్,కందాడి సంజీవ్ రెడ్డి,జనార్ధన్,ఆరేళ్ళ విజయ్,అర్షద్,మిద్దెపాక స్టాలిన్,అజాం,గిరి,కమాల్, వెంకటేశ్వర్లు డోర్నాల,భూష పర్వతాలు, ఉల్లెంగుల మధు,మంతపురి ప్రకాష్,ఎదునూరి యాదగిరి,బిర్రు సత్యనారాయణ,మహిళా కాంగ్రెస్ నాయకురాలు సక్కుబాయి శ్రీలత ఉమామహేశ్వరి ,భాగ్య,అన్నపూర్ణ, దేవేంద్ర, రజియా,తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికను అపహరించి వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ముఠా అరెస్టు

వరంగల్ ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్ )

**నగరంలోని ఓ మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు. ఇందులో ఒక మైనర్ బాలికతో సహా ఒక మహిళ, నలుగురు వ్యక్తులను మీల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేసారు. వీరి నుండి పోలీసులు ఒక కిలో ఎనిమిది వందల గ్రాముల గంజాయితో పాటు ఒక కారు, 75వేల రూపాయల నగదు, నాలుగు సెల్ ఫోన్లతో పాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీ స్థాయిలో కండోమ్ ప్యాకేట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ముస్కు లత, ల్యాదేళ్ళ గ్రామం, దామెర మండలం, వరంగల్ జిల్లా, మైనర్ బాలిక, వరంగల్ శంభుని పేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ ఆలియాస్ వదూద్ లను పోలీసులు అరెస్టు చేసారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ..**

ఈ నెల 11వ తేదిన మైనర్ బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై మీల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి బాలికను పోలీసుల సంరక్షణలో తీసుకోని విచారించగా తనను కొంత మంది వ్యక్తులు అపహరించి,గంజాయి త్రాగించిన అనంతరం అత్యాచారానికి



పాల్పడినట్లుగా సదరు బాలిక పోలీసులకు వెల్లడిరచడంతో అప్రమత్తమైన పోలీసులు పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు సెంట్రల్ డిసిపి షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసిపి అధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసిన నిందితులను పట్టుకొని విచారించగా. ఈ వ్యవహరంలో ప్రధాన నిందితురాల్కెన ముస్కు లత, ల్యాదేళ్ళ గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తూ, తల్లిదండ్రులు మరణించడంతో మరో మైనర్ నిందితురాలికి తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. ప్రధాన నిందితురాలు వ్యభిచార వృత్తి కొనసాగిస్తుండంతో తన వృత్తిలో అవసరమైన కొత్త మహిళలు లేదా బాలికలను తీసుకొచ్చి ఈ వ్యభిచారం నిర్వహించడం ద్వారా పెద్ద మొత్తం డబ్బు వస్తాయని దానిలో నీకు కొంత డబ్బు ఇస్తానని మైనర్ నిందితురాలకి తెలపడంతో, దీనికి సిద్ధపడిన మైనర్ నిందితురాలు తన స్నేహితరాలితో పరిచయమయి బాధిత బాలికను లక్ష్యంగా చేసుకొని మైనర్ నిందితురాలు ఇంస్టాగ్రాం ద్వారా బాధిత బాలికతో పరిచయం పెంచుకోవడమే కాకుండా బాలిక స్కూల్ వెళ్ళే సమయంలో నిందితురాలు బాధిత బాలికను కలవడంతో పాటు, మైనర్ నిందితురాలి ప్రియుడ్కెన నిందితుడు అబ్దుల్ అఫ్నాన్‌తో కలిసి బాలికను తీసుకవెళ్ళి మద్యం, గంజాయిని త్రాగటం అలవాటు చేసారు. నిందితురాలిపై మరింత నమ్మకం కలిగేందుకు బాలికకు షాపింగ్ మాల్స్‌కు తీసుకవెళ్ళి బట్టలను ఇప్పించడంతో వీరిపై నమ్మకం కలగడంతో సదరు బాధిత బాలిక వీరిని నమ్మి ఈ నెల 11వ తేదిన మైనర్ బాలికను నిందితురాలు తన ప్రియుడుతో మరో ఇద్దరు నిందితుల్కెన షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌లతో కలిసి కారులో బయలుదేరి గంజాయి విక్రయాలు చేసే మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయిని కొనుగొలు చేసి నర్సంపేట శివారు ప్రాంతంలో నిందితుల్లో ఒకడ్కెన షేక్‌సైలాని బాబాకు చెందిన ఓ పురాతన ఇంటిలో బాధిత బాలికను తీసుకవెళ్ళి గంజాయి త్రాగించి షేక్ సైలాని బాబా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను నువ్వు రేపటి నుండి మేము చెప్పినట్లుగా వినాలి లేకుంటే నువ్వు గంజాయి త్రాగుతుండగా, అత్యాచారం చేసేది సెల్‌ఫోన్లో చిత్రికరించామని ఈ వీడియోను బయట పెడతామని బెదిరించి సదరు మైనర్ బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద వదిలి అక్కడి నుండి పారిపోయారని నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు. నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా,వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, మీల్స్ కాలనీ ఇన్స్‌స్పెక్టర్ వెంకటరత్నం,ఎస్.ఐలు శ్రీకాంత్, సురేష్‌లతో పాటు ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# నితిన్ గడ్కరీ సాక్షిగా దోర్నాల-కుంట జాతీయ రహదారికీ అవినీతికీ మరక..?

- క్వాలిటీ కంట్రోల్ ను కంట్రోల్ చేస్తున్న ఉమాశంకర్ ..?
- జాతీయ రహదారి నిర్మాణం నాణ్యతకు తిలోదకాలు..?
- కాంట్రాక్టరుతో అధికారులు కలిసిపోయి ఇష్టారాజ్యంగా చేతివాటం..?
- అక్కడక్కడ కనిపిస్తున్న 40 ఎంఎం కంకర..?
- ప్రారంభ దశలోనే రోడ్డంతా పగుళ్లు తేలి కంకర కనిపిస్తూన్న వైనం..?
- పాత రోడ్డు తొలగించకుండానే దోర్నాల-కుంట జాతీయ రహదారి పనులు నిర్వహణ..?
- సదరు కాంట్రాక్టర్ లైసెన్సును రద్దు చేయాలి : ప్రజా సంఘాల డిమాండ్



బ్యూరో ఇంచార్జ్, సాక్ష్యం:

**పాత రోడ్డు తొలగించకుండానే పనులు..?**

గతంలోని పాత రోడ్డును కలుపుకొని మొత్తం ఒక ఫీటు మందం చూపించేందుకు కాంట్రాక్టరు వ్యూహరచన చేశారు. పాత సీసీ రోడ్డు ఉన్నందున కాంట్రాక్టరుకు దాదాపు రూ. 7 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. తూతూ మంత్రంగా పనులు చేపట్టి బిల్లులు లేపేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా,అధికారులు వంతపాడటం పై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**డివైడర్ల మధ్య బురద మట్టి...?**

బైపాస్ రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న డివైడర్ల మధ్య మొక్కలు పెంచాలని నిర్ణయించారు. డివైడర్ల కింద గతంలో నిర్మించిన తారు రోడ్డును తొలగిం చలేదు. కింద తారు రోడ్డు, దానికింద కంకర ఉండటంతో అక్కడ మొక్క లు ఎలా పెరుగుతాయనే సందేహాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ముందుగా తారు తొలగించాల్సిన కాంట్రాక్టరు దానిపైనే మట్టిపోస్తున్నాడు. పైగా మొక్కలు ఏపుగా పెరగాలంటే ఎర్రమట్టిని ఉపయోగించాల్సి ఉండగా,రోడ్డు నిర్మాణం కోసం తవ్విన మట్టినే డివైడర్ల మధ్యలో పోయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న మట్టితో చినుకు పడితే రోడ్డంతా బురదమయంగా మారుతుంది. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం



పై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిగా దుబ్బతో కూడిన మట్టిని డివైడర్ల మధ్య నింపుతుండటంతో అది రోడ్డు పైకి చేరి వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము లేస్తోంది. ఈ విషయమై పలుమార్లు స్థానిక ప్రజలు రాస్తారోకోలు చేపట్టారు. అయినా స్పందించని అధికారులు కాంట్రాక్టరుకే వంతపాడటం గమనార్హం. తక్షణమే జాతీయ రహదారుల కేంద్ర మంత్రివర్యులు నితిన్ గట్కరి స్పందించి, సంబంధిత నిజాయితీగల క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పరిశీలన చేసి,తాద్వారా నాసిరకమైన పనులు చేపడుతున్న సదరు కాంట్రాక్టర్ లైసెన్సును రద్దు చేయవలసిందిగా సామాజిక మేధావులు కోరుతున్నారు.

**ప్రకాశంజిల్లా పరిధిలోగల దోర్నాల నుండి హనుమాన్ జంక్షన్ కుంట వరకు నూతనంగా జరుగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టరు,సంబంధిత జాతీయ రహదారుల క్వాలిటీ కంట్రోల్ అధికారులతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు గత ఏడాదిగా కొనసాగుతుండగా కాంట్రాక్టరు వ్యవహార శైలి పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు.బేస్ నుంచి ఒక ఫీటు మందంతో రోడ్డు నిర్మాణం జరుగుతుండగా మూడు పొరల్లో పనులు జరుగుతున్నాయి. తొలుత మట్టి పై 40 ఎంఎం కంకరతో మొదట నిర్మిస్తున్నారు. రహదారి పటిష్టతకు ఇదే ఆధారం.అయితే ఈ పనుల్లోనే నాణ్యతను గాలికి వదిలివేశారు.40 ఎంఎం కంకరతోపాటు నిర్ణీత కొలతల ప్రకారం సిమెంట్ కలపాల్సి ఉండగా డస్ట్‌ను ఉపయోగిస్తున్నారు. అదికూడా పలుచగా వేస్తుండటంతో ఇప్పుడే రోడ్డంతా పగుళ్లు తేలి కంకర కనిపిస్తోంది. కంకర తేలినచోట గులకరాళ్ల లాంటి సన్నటి కంకరతో పూడుస్తున్నారు.ఇది ఎంత మాత్రం నాణ్యతకాదని భవిష్యత్తులో రోడ్డు నిలవదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.ఈ విషయం జాతీయ రహదారుల క్వాలిటీ కంట్రోల్ అధికారుల దృష్టికి రాకపోగా, క్వాలిటీ కంట్రోల్ సెల్ కూడా పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.**

# టిడిపితో పొత్తు వల్ల బిజెపి నష్టపోతుందనడంలో నిజం లేదు

## తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

హైదరాబాద్, మార్చి 18 ( సాక్ష్యం న్యూస్ ):
తెలంగాణలో తెలుగుదేశంతో పొత్తు వల్ల బిజెపి నష్టపోతుందని బిజెపి ఎమ్మెల్యే




పైడి రాకేష్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల్లో నిజంలేదని, వాపును చూసి బలుపు అనుకోవద్దని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. మంగళవారం కవాడిగూడలోని హైదరాబాద్ నగర టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ... గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పోటీ చేయకపోవడం వల్ల ప్రజలు బీజేపీకి ఓటు వేయడం జరిగిందన్నారు. ఇటువంటి సత్యాన్ని మరిచిపోయి సంకుచితత్వంతో ప్రవర్తించవద్దని, ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎవరితోనైనా కలిసి వస్తే వారితో సమన్వయంతో కలిసి పోవడానికి ప్రయత్నించాలని అన్నారు. గతంలో 2000 సంవత్సరానికి పూర్వం బిజెపి పరిస్థితి ఏంటో గుర్తు చేసుకోవాలని, కేవలం రెండు సీట్లతో ఉన్న మీరు ఎన్‌టిఆర్ దయవల్ల బిజెపి పార్టీకి రాజకీయ భవిష్యత్తు ఏర్పడిందన్నారు. అటువంటి తెలుగుదేశం పార్టీని తిరస్కరించడం విద్రోహ చర్య అన్నారు. దేశం నుండి, రాష్ట్రం నుండి కాంగ్రెస్ పార్టీని పారద్రోలాలనే లక్ష్యంతో పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీకి పూర్తిగా క్షేత్రస్థాయిలో క్యాడర్ ఉన్న సంగతి రాకేష్‌రెడ్డి మర్చిపోవద్దు అన్నారు. ఈనాడు కేంద్రంలో తెలుగుదేశం మద్దతు ఇస్తున్న సంగతి మర్చిపోవద్దని అన్నారు. అదే విధంగా ఎన్డీఏ లో భాగస్వామ్య ప్రభుత్వాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది తెలుగుదేశం అన్న వాస్తవాన్ని మరిచిపోవద్దన్నారు. నడమంతర సిరితో ఇష్టమైన రీతిలో మాట్లాడటం రాకేష్‌రెడ్డికి తగదన్నారు. ఇప్పటికే దక్షిణాదిలో గ్రామీణ ప్రాంతాలలో పువ్వు గుర్తును గుర్తుపట్టడం కూడా కష్టమైనదన్నారు. ఈనాడు తెలంగాణ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ బిజెపికి పని చేయడం వల్లనే ఎంపీ స్థానం 8 ఎంపీ స్థానాలు గెలవడం జరిగిందన్నారు. తెలంగాణ నుంచి గెలుపొందిన తర్వాత ఆ 8 ఎంపీల వల్ల ఏమైనా ఉపయోగం జరిగిందా ప్రశ్నించారు. కనీసం ఒక ప్రాజెక్ట్ అయినా కనీసం ఒక పెద్ద స్థాయిలో నైనా నిధులు మంజూరు చేయించగలిగారా ఆత్మ వంచన చేసుకోవాలని అన్నారు. అధికార పార్టీ కాంగ్రెస్‌తో కుమ్మక్కై కొంతమంది ఎమ్మెల్యేలు అధికారం కోసం ప్రాకులాడుతున్నారని, ఇటువంటి నాయకులు కాంగ్రెస్‌కు అమ్ముడుపోయారనే విషయాన్ని బిజెపి అధిష్టానం గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసిన గ్రేటర్ అధికారులు

### మూడేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని వైనం

వరంగల్ ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్ ):
గత మూడేళ్ళ గా మున్సిపల్ కార్పొరేషన్ కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ. 44 లక్షలు చెల్లించని కారణం గా కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండ లోని జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భం గా డిప్యూటీ




కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ జయ నర్సింగ్ కళాశాల యాజమాన్యం కోర్టులో కేసుకొనసాగుతుందని చెబుతూనే నర్సింగ్ కళాశాలను నడుపుతున్నారని గుర్తించిన బల్దియా పన్నుల అధికారులు బకాయి పడి ఉన్న పన్నులు చెల్లించాలని కోరుతూ రెడ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని, అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో మంగళవారం ఉదయం నర్సింగ్ కళాశాల విద్యార్థులను సిబ్బందిని బయటికి పంపించి కళాశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. బల్దియా కు చెందిన అధికారులు గత వారం రోజులుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు విషయంలో ఇప్పటికే సుమారు 356 ప్రాపర్టీలను సీజ్ చేయడం జరిగిందని, నగర ప్రజలు ప్రాపర్టీ మరియు నల్లా బకాయి వెంటనే చెల్లించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ యూసుఫోద్ధిన్ ఆర్ ఐ లు సురేష్ రజని భరత్ చంద్ర శ్రీకాంత్ బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కమిషనర్ ను కలిసిన బల్దియా కమీషనర్

వరంగల్, సాక్ష్యం న్యూస్:
ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్ ను జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్ లోమర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# జిల్లాలో బంగారు బాల్యం " అట్టర్ ప్లాప్ "

- బంగారు బాల్యం నేడు ఒంటరిపాలైంది..?
- చట్టాలు చేసినా,చిత్తశుద్ధి లేక భారంగా "బాల్యం"...?
- బాలకార్మికుల పరిశీలనా,పర్యవేక్షణా ఎక్కడ..?
- కాగితాల పై ఆర్డర్లే తప్ప ..ఆచరణ శూన్యం..?

బ్యూరో ఇంచార్జ్ , సాక్ష్యం:

**బాల్యమంటే ఉరకలెత్తే ఉత్సాహం.. బాల్యమంటే ఏ బాధలూ లేని ఆనందమయ జీవితం.ప్రతీ క్షణాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించడంలో వారు బహు నేర్పరులు. ప్రతీ సందర్భాన్ని ఎంజాయ్ చేయడంలో వారు బాల కోవిదులు.అందుకే అంటారు బాల్యమొక వరమని,అదొక మధుర జ్ఞాపకమని.తిరిగి రాదని తెలిసినా..వస్తే బాగుండని ప్రతి ఒక్కరూ కోరుకునే తీరని కోరిక ఏదైనా ఉ ంటుందంటే..అది కేవలం బాల్యమే.**

**బాల కార్మికులు అంటే ఎవరు..?**

పిల్లలు పనిచేయటం తప్పా..?అంటే కాదు..! పిల్లల ఎదుగుదలలో,వికాస క్రమంలో పనిచేయడమూ ఒక మెట్టు.వయసు, అవగాహనను బట్టి అమ్మానాన్నల రోజువారీ పనుల్లో పిల్లలు సహకరించవచ్చు.జీవన, వృత్తి నైపుణ్యాలను అలవర్చుకోవొచ్చు. 14 - 17 ఏళ్ల పిల్లలైతే తమ పాకెట్ మనీ కోసం పనిచేయొచ్చు.అయితే,అది 4.30 గంటల సమయాన్ని మించకూడదు.కానీ,ఇదంతా పాఠశాల విద్యను వదిలేసి కాదు.బడి వయసు పిల్లలు కచ్చితంగా బడిలోనే ఉ ండాలి.కేవలం బతకటం కోసం పనుల్లో నిమగం కాకూడదు.పిల్లల చేత బలవంతంగా పనిచేయించకూడదు.మానసికంగా, శారీరకంగా,నైతికంగా పిల్లలను ఇబ్బందులకు గురి చేసే పనుల్లో పెడితే - అది నేరమవుతుంది.ప్రమాదకర పరిశ్రమల్లో,శరీర కష్టం ఎక్కువగా ఉండే చోట పిల్లల చేత పనిచేయించకూడదు.ఇలాంటి వాటిని నియంత్రించడానికి,పర్యవేక్షించడానికి చట్టాలెన్నో ఉన్నాయి.5 - 14 ఏళ్ల బాలలకు మన దేశంలో నిర్బంధ ఉచిత విద్య అమల్లో ఉంది.మరి ఇవన్నీ ఉన్నా బాల కార్మికవ్యవస్థ ఎందుకు కొనసాగుతోంది..? బడి బయట పిల్లలు ఎందుకు ఉంటున్నారు..?అన్న ప్రశ్నకు ప్రభుత్వ పరిపాలన యంత్రాంగం వద్ద జవాబు లేని ప్రశ్న..?

## పాలకుల విధానాలే కారకం..?

తొంభైయ్యో దశకంలో ఉధృతంగా సాగిన అక్షరాస్యత ఉద్యమం ఊరూరా చదువు ప్రాధాన్యాన్ని,అవసరాన్నీ గుర్తించటంలో కీలకమైన పాత్ర పోషించింది.ఎన్నో కుటుంబాల్లో వారి పిల్లలు తొలిసారి పాఠశాల గడప తొక్కిన సంఘటనలు నమోదయ్యాయి.చదువు కొనసాగించిన పిల్లలు వాటి ఫలితాలనూ అందుకుంటున్నారు.కళ్ల ముందు చదువు సాధించిన ప్రగతి కనపడుతున్నప్పుడు - ప్రతి అమ్మా,నాన్న తమ పిల్లలను బడికి పంపటానికి ప్రాధాన్యం ఇస్తారు.చాలా గ్రామాల్లో ఆ పరిస్థితిని మనం చూస్తునే ఉ న్నాం.ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్నం పథకం ఎందరో పేద పిల్లలు బడికి రావటానికి ఆసరానిస్తోంది.ప్రభుత్వ పాఠశాలలు ఎన్నో గొప్ప విజయాలను నమోదు చేస్తున్నాయి.ప్రభుత్వం ఆసరా, అవకాశం కల్పిస్తే పిల్లలు బడికి వస్తారని చెప్పటానికి ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే.

**20 కోట్ల మంది బాల కార్మికులు..?**

ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా నేడు 20 కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారన్నది ఒక లెక్క.యునిసెఫ్ గణాంకాల ప్రకారం..ఇరవై ఏళ్లుగా వివిధ దేశాలు చేపడుతున్న ప్రణాళికలు,సమాజంలో వస్తున్న



మార్పుల కారణంగా బాల కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.2000లో ప్రపంచంలో 24.55 కోట్ల మంది బాల కార్మికులు ఉంటే - 2004 నాటికి ఆ సంఖ్య 22.23 కోట్లకు తగ్గింది.2008 నాటికి 21.52 కోట్లకు,2012 నాటికి 16.80 కోట్లకు,2016 నాటికి 15.16 కోట్లకు తగ్గుతూ వచ్చింది.ఇదే క్రమం కొనసాగితే - 2020 నాటికి 14 కోట్లకు ఈ సంఖ్య తగ్గాలి.కానీ, అలా తగ్గకపోగా - 16 కోట్లకు పెరిగింది. 2024 చివరి నాటికి సుమారుగా ఇంకో కోటి మంది బాల కార్మికులుగా మారే ప్రమాదం ఉందని యునిసెఫ్ అంచనా.నిజానికి వాస్తవిక సంఖ్యలు అన్ని సందర్భాల్లోనూ ఇంతకు రెట్టింపే ఉ ంటాయన్నది పరిశీలకుల అవగాహన..బాల కార్మికులు ప్రపంచంలోని అత్యధిక దేశాల్లో కనిపించటం సమాజంలోని ఆర్థిక అసమానతలకు ఒక బలమైన సూచిక. పిల్లలను సమాజ సంపదగా చూసినప్పుడే, వారిదైన భవిష్యత్తులో మనం ఇప్పుడు బతకుతున్నామనే స్పృహతో పౌర సమాజం ఉ న్నప్పుడే - సంపూర్ణంగా బాల కార్మికవ్యవస్థను నిర్మూలించటం సాధ్యం. సోషలిస్టు విధానాలను అనుసరించే దేశాలు పిల్లలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తాయి.వారి శారీరక,మానసిక,దైనందిన ప్రపంచాన్ని ఆరోగ్యకరంగా,ఆహ్లాదకరంగా, ఆనందదాయకంగా తీర్చిదిద్దుతాయి. ఆటపాటలు,విద్యా వికాసాలూ బాలల హక్కుగా భావిస్తాయి.ఆ హక్కుకు విలువనిచ్చి,అక్షరాలా పాటిస్తాయి.

**నిరంతర కార్యాచరణతోనే నిర్మూలన..?**

బాల కార్మికవ్యవస్థను ప్రణాళికాబద్ధంగా నిర్మూలించాలి తప్ప - ఏకపక్షంగా, బలవంతంగా కాదు.బాల కార్మికుడిని పని మాన్పించి,బడిలో చేర్పించటం సులభంగా అనిపించొచ్చు.కానీ,అది పూర్తి ఫలితాలను ఇవ్వదని గతంలో కొన్ని అనుభవాలు రుజువు చేశాయి.బంగ్లాదేశ్‌లో 1993లో లక్షలాది పిల్లలు వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్నారని ఓ టీవీ ఛానెల్ ప్రసారం చేసింది.దీనికి అంతర్జాతీయంగా గొప్ప స్పందన వచ్చింది.ఆ వస్త్ర పరిశ్రమతో సంబంధం ఉన్న అంతర్జాతీయ కొనుగోలు సంస్థలు - పిల్లలు పనిచేసే పరిశ్రమల నుంచి దుస్తులు తీసుకోబోమని ప్రకటించాయి.దీంతో పరిశ్రమ నుంచి బాలలను తొలగించారు.వారు రోడ్డున పడ్డారు.కొందరు అంతకన్నా ప్రమాదకర పరిశ్రమల్లో,అంతకన్నా తక్కువ జీతాలకు పనికి చేరారు.ఆడపిల్లలు బలవంతంగా వ్యభిచార వృత్తిలో చేర్చబడ్డారు.దీంతో, సమస్య మరింత పెరిగింది.బాల కార్మికులను పనిప్రదేశం నుంచి మార్చటం ఒక్కటే కాదు.. వారి వెనుక ఉన్న పరిస్థితులనూ ప్రభుత్వాలు మార్చాలి.చదువు మాకెందుకనే భావమూ చాలామందిలో ఉంటుంది.తమ ఇష్టంతోనే పనిలో ఉన్నామనే భావన,ఇది బాగానే ఉ ందనే సమర్థింపూ కొన్నిసార్లు బాల కార్మికుల నుంచీ రావొచ్చు.కానీ,ప్రభుత్వం వారిని అన్నివిధాలా మార్చే బాధ్యతను తీసుకోవాల్సిందే.. మనదేశంలో బాలలను ప్రమాదకర వృత్తుల్లో పనిచేయించటాన్ని నిషేధిస్తూ 1986లో భారత ప్రభుత్వం ఒక చట్టం తీసుకొచ్చింది.దాని ప్రకారం 18 ప్రమాదకర వృత్తులను,65 ప్రమాదకర ప్రక్రియలను గుర్తించారు.అందులో మందుగుండు సామగ్రి తయారీ,గాజులు, అద్దాల తయారీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. కానీ,ఇప్పటికీ శివకాశీ టపాసుల తయారీలో బాలలు పెద్ద సంఖ్యలోనే పాల్గొంటున్నారనే పరిశీలన ఉంది.చట్టాలు చేసినా,చిత్తశుద్ధి లేకపోతే - పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది..!

మన ప్రభుత్వం 2016 సెప్టెంబరు 1న బాల కార్మికవ్యవస్థ నిర్మూలనకు మరొక ప్రత్యేక చట్టం తెచ్చింది.దీని ప్రకారం..14 ఏళ్ల లోపు పిల్లలు ఎవరూ,ఎక్కడా పనిచేయటానికి వీల్లేదు.ఈ చట్టం పై చర్చ జరుగుతున్నప్పుడే మన రాష్ట్రంలో చాలా పెద్ద హడావిడి జరిగింది.ఇటుకల తయారీ,వస్త్ర పరిశ్రమలపైనా,సెలబ్రిటీల ఇళ్లపైనా దాడులు జరిగాయి.యజమానులకు జరిమానాలు విధించారు.టీవీ ఛానెళ్లు భారీగా ప్రచారం చేశాయి.ఆ తరువాత మళ్లీ అలాంటి ప్రచారమూ లేదు,పర్యవేక్షణా లేదు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది ఒక తతంగంలా కాదు..!ఒక నిరంతర కార్యాచరణగా ఉండాలి.

## లక్ష్మీ తిరుపతమ్మ తిరుణాలలో వైకాపా దాడులు

**దాడులకు తెగబడ్డ వారిపై కేసులు నమోదు చేయండి**
**సిపికి ఆదేశాలు ఇచ్చిన హోంమంత్రి అనిత**

అమరావతి,మార్చి18(సాక్ష్యం): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ తిరుణాలలో జరిగిన గొడవపై హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులపై రెచ్చిపోయి రాళ్లతో దాడిచేయడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ పాకెట్లు, బాటిళ్లు, రాళ్లు విసిరిన ఘటనలో పోలీసులకు, భక్తులకు గాయాలయ్యాయి. ఈ దాడి ఘటనకు కారణమైన వారందరిపై కేసులు నమోదు చేయాలని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు హోంమంత్రి ఆదేశించారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలవడంపై అతని పరిస్థితిపై ఆరా తీశారు. నందిగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని ఆమె ఆదేశించారు. అదుపు చేసి రక్షించాలనుకున్న పోలీసులని చూడకుండా దాడికి దిగితే సహించబోమని హోంమంత్రి అనిత తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు తిరుణాలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. అడ్డుకున్న పోలీసుసిబ్బందిపై రాళ్లతో దాడులు చేశారు. ఈ ఘటనలో పోలీసులకు గాయాలయ్యాయి. లక్ష్మీ తిరుపతమ్మ చిన్న తిరుణాలలో తెలుగుదేశం , జనసేన, వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో ప్రభల ఊరేగింపు జరిగింది. టీడీపీకి చెందిన ప్రభ సెంటర్లో ఉండగా, వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రభ వర్గం రెచ్చగొట్టే చర్యలకు దిగింది. వాటర్ ప్యాకెట్లు బాటిళ్లు రాళ్లు విసిరారు. ఇది గమనించిన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు వెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులపైనా రాళ్లు, వాటర్ ప్యాకెట్‌లు విసిరారు. ఈ ఘటనలో నలుగురు పోలీసు సిబ్బంది, ప్రజలకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. రెచ్చగొట్టేలా దాడులు చేసిన వారిపై కేసు నమోదు చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముందస్తు ప్రణాళికతోనే రెచ్చగొట్టే చర్యలకు దిగి.. పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలు అయ్యాయి. ఈ దాడిలో తెలుగుదేశం కార్యకర్తలు కూడా గాయపడ్డారు.

## విజయసాయిరెడ్డికి మరో షాక్

**25న హాజు కావాలని సిఐడి నోటీసులు**

విజయవాడ,మార్చి18(సాక్ష్యం) :మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి మరోసారి షాక్ తగిలినట్టు అయ్యింది.. మరోమారు విజయసాయి రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు .. ఈ నెల 25వ తేదీన విచారణకు హాజరు కావాలని సాయిరెడ్డికి జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ నెల 10వ తేదీన మాజీ రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డికి మంగళగిరి సీఐడీ పోలీసులు నోటీసులు జారీ చేయగా.. మార్చి 12వ తేదీన అంటే.. ఈ నెల 12న సీఐడీ విచారణకు హాజరయ్యారు. కాకినాడ పోర్టు వాటాల బదిలీ కేసులో విజయ సాయిరెడ్డిపై కేసు నమోదు చేశారు.. అయితే, కాకినాడ పోర్టు వాటాలను అక్రమంగా బదిలీ చేయించుకున్నారని విజయసాయిరెడ్డిపై కేవీ రావు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.. పోర్టు వాటాల అక్రమ బదిలీపై సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డితో పాటు- విజయ సాయిరెడ్డిపై మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, కాకినాడ సీ పోర్టు షేర్ల వ్యవహారంలో మరోసారి విజయసాయి రెడ్డికి నోటీ-సులు జారీ చేసింది సీఐడీ.. ఈనెల 25వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీ-సుల్లో పేర్కొన్నారు సీఐడీ అధికారులు.. కాగా, గత విచారణలో కాకినాడ సీపోర్టు ప్రైవేటు- లిమి-టె-డ్ అధిపతి కేవీ రావు నుంచి అక్రమంగా వాటాలను బదిలీ చేసుకున్నారన్న ఆరోపణలపై విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు సీఐడీ అధికారులు.. 12వ తేదీన ఉదయం 11 నుంచి దాదాపు 3.30 గంటలపాటు- సాయిరెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు అధికారులు.. కేవీ రావు ఫిర్యాదు మేరకు విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, శ్రీధర్, అరబిందో రియాల్టీ ఇన్ఫ్రాపై కేసు నమోదైన విషయం విదితమే.. ఇక, విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన విజయసాయిరెడ్డి.. అరబిందో వ్యాపార విషయాల్లో నేనెప్పుడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశాను.. నా కుమార్తెను వారికివ్వడం తప్ప, అరబిందో సంస్థతో నాకు ఆర్థిక సంబంధాలు లేవని చెప్పాను అని.. విక్రాంత్ రెడ్డి గురించి అడిగితే సుబ్బారెడ్డి కుమారుడిగా తెలుసని చెప్పా.. రూ.500 కోట్ల లావాదేవీలకు సంబంధించి విక్రాంత్ రెడ్డే చేశారని, చాలా మంది సాక్షులు చెప్పినట్లు- సీఐడీ అధికారులు నన్ను అడిగారని.. విక్రాంత్ రెడ్డి కలిసే నగదు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. అలాగే నాకూ ఎలాంటి సంబంధం లేదని సీఐడీ అధికారులకు తేల్చిచెప్పా.. నన్ను ఉద్దేశపూర్వకంగానే ఒక అధికారికి ఈ కేసులో ఇరికించారని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించిన విషయం విదితమే..

## పిల్లలను కాలువలో తోసేసి తండ్రి అదృశ్యం

**కూతురు మృతి..ప్రాణ్రాలతో బయటపడ్డ కుమారుడు**
**తప్పించుకున్న ఫైనాన్స్ రాజు కోసం గాలింపు**

కోనసీమ,మార్చి18(సాక్ష్యం): ఇద్దరు పిల్లలను కాలువలోకి తోసేసి తండ్రి అదృశ్యమైన ఘటనతో అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరు గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తండ్రి పిల్లి రాజు గ్రామంలో రెండు కోట్ల రూపాయలు మేరకు అప్పులు కావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక అదృశ్యం అయ్యాడు. పిల్లలు సందీప్, కారుణ్యలను రామచంద్రపురం మండలం తొగరువారి సావరం కాలువలో తోసివేసి.. ఆపై అదృశ్యమయ్యాడు. బాలుడు ఎలాగోలా ఒడ్డుకు చేరినా.. ఏడేళ్ల కారుణ్య ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని చూసి తల్లి విజయ శోకంలో మునిగిపోయారు. ఆర్థిక సమస్యలుంటే పరిష్కార మార్గాలు ఉంటాయని.. ఇలా చిన్నారులను తండ్రే ప్రాణాలు తీయాలనుకోవడం పట్ల వెంటూరు గ్రామంలో ఆవేదన వ్యక్తమవుతోంది. చెల్లెలు, తనను స్కూలు నుండి తీసుకుని వెళ్లి చనిపోదామని తండ్రి రాజు చెప్పాడని అంటున్నాడు ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన కుమారుడు సందీప్. మొదట తనను, తర్వాత చెల్లిని కాలువలోకి తోసివేశాడని చెబుతున్నాడు. తాను కాలువలో ఊస పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డానని, చెల్లి కాలువలో మునిగిపోయి చనిపోయిందని చెప్పాడు. ఒక వ్యక్తిని లిఫ్ట్ అడిగి ద్రాక్షారామం పోలీస్ స్టేషన్లో విషయం చెప్పినట్లు సందీప్ తెలిపాడు. గ్రామస్తుల నుండి రెండు కోట్ల రూపాయలకు అప్పులు చేసి.. తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో పిల్లి రాజు అదృశ్యం అయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. కుమార్తెను చంపివేయటం దారుణమని ఆవేదన చెందుతున్నారు. కూలినాలీ చేసుకుంటూ కష్టపడిన సొమ్ములు దాచుకుంటే.. ఫైనాన్స్ వ్యాపారి రాజు ఈ విధంగా చేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో అదృశ్యమైన ఫైనాన్స్ వ్యాపారి పిల్లి రాజు ఏమైపోయాడనేది మిస్టరీగా మారింది. గ్రామస్తులు నుండి అప్పులు తీసుకున్న రెండు కోట్ల రూపాయలు రాజు ఏం చేశాడు, రాజు ఎక్కడున్నాడు? ఎలా ఉన్నాడనే ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ద్రాక్షారామం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన పిల్లి రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మహిళను చంపి ముక్కలుగా కోసి...

అనకాపల్లి,మార్చి18(సాక్ష్యం): ఓ మహిళను చంపి ఆమె శరీర భాగాలను బెడ్‌షీట్‌లో మూటకట్టి కల్వర్టు కిందపడేశారు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బయ్యవరం గ్రామ శివారులో కల్వర్టు కింద ఓ బెడ్‌షీట్‌లో మాంసపు ముద్దలు, రక్తపు మరకలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బెడ్‌షీట్‌ను పరిశీలించగా ఓ మహిళ చేయి, కాళ్లు ఉన్నట్టు- గుర్తించారు. మృతురాలి వయసు 40 ఏళ్లు ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివిధ పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసు వివరాలతో పాటు- స్థానిక సిసి కెమెరాలను పరిశీలిస్తున్నామని సిఐ స్వామి నాయుడు పేర్కొన్నారు.

# సంక్షేమ పథకాలకు అనుగుణంగా రుణాలు

**బ్యాంకర్లను కోరిన కలెక్టర్**

అమలాపురం,మార్చి18(సాక్ష్యం): బ్యాంకు రుణంతో ముడిపడి ఉన్న సంక్షేమ పథకాల లక్ష్యాలకు అనుగుణంగా రుణాల కల్పన జరగాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ బ్యాంకర్లను కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన నాలుగవ త్రైమాస్కానికి సంబంధించి జిల్లా సంప్ర దింపు లు కమిటీ- జిల్లా స్థాయి సమీక్ష కమిటీ- సమావేశాలు సంయు క్తంగా నిర్వహించారు. 2024- 25 సంవత్సరానికి జిల్లా వార్షిక ప్రణాళిక ఆమలులో భాగంగా సాధించిన ప్రగతి లక్ష్య సాధన పురోగతిపై సమీక్షించారు. కౌలు రైతులకు పంట రుణాలను తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. రూ.10 కోట్ల లోపు నిర్మాణ వ్యయంతో నిర్మించే వంతెనలకు బ్యాంకు రుణం అందించేందుకు యోచన చేయాలన్నారు. ఆ యొక్క రుణాన్ని టోల్ రూపంలో వసూల్ చేసి తిరిగి చెల్లిస్తారన్నారు. విదేశాలకు ఉద్యో గరీత్యా వెళ్లే వారికి అన్ని ప్రామాణిక అనుమతులను ఇప్పిస్తారన్నారు. విదేశాలకు వెళ్లే నిరుద్యోగ యువత కు ప్రాథమిక దశలో ఖర్చుల నిమిత్తం కనీసం రూ.3 లేదా రూ.4లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ యొక్క ఖర్చును రుణంగా ఇప్పించేందుకు బ్యాంకులు యోచన చేయాలని ఆయన సూచించారు. విదేశాల్లో స్థిరపడిన అనంతరం రుణాన్ని తిరిగి చెల్లిస్తార న్నారు. ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను సఫలీకృతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమ న్నారు. రుణ ప్రణాళిక కింద నిర్దేశిరచిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకో నేందుకు కృషి చేయాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక కింద డిసెంబరు 2024 నాటిక పురోగతిని చూస్తే వ్యవసాయ రంగానికి సంబంధించి 94.53 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు- ఎంఎస్ఎంఇ నిర్దేశిత లక్ష్యసాధనలో 103.91 శాతం సాధించినట్లు- తెలిపారు ప్రాధా న్యతా రంగానికి సంబంధించి నిర్దేశిత లక్ష్యాలలో 97.63 శాతాన్ని సాధించిన ట్లు- తెలిపారు. మొత్తం నిర్దేశితే లక్ష్యాలలో 99.69 శాతం రుణ లక్ష్యాలను సాధించినట్లు- తెలిపారు. వివిధ పథకాల కింద ప్రతిపా దించిన యూనిట్లకు సభ్యుల అనుమతితో ఆమోదించారు. జిల్లాలో కొబ్బరి ముడిసరుకు ఆధారత పరిశ్రమ స్థాపన-కై- ఇతోది కంగా రుణాలు వివిధ పథకాల ద్వారా కల్పించి కోనసీమ ప్రజానీకం జీవనోపా దులను మెరు గుపరిచే దిశగా అధికా రులు బ్యాం కర్లు పూర్తి సమన్వయం వహించాలన్నారు. తీర ప్రాంత ఆవా సాలకు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఒక్కొక్క ఆవాసానికి ఒక్కొక్క సూర్య ఘర్ యూనిట్ యుపిఎస్తో ఏర్పాటు- చేసేందుకు నాబార్డ్ ద్వారా ఏర్పాటు-కు ప్రతిపాదిం చాలన్నారు. అదేవిధంగా యూనిట్ల ఏర్పాటు-కు ఏపీ ట్రాన్స్కో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిది, ఎపి టిడ్కో పిఎంఎవై, రుణాల కల్పన ఆర్థిక అక్షరాస్యత పెంపుదల తదితరాలపైనా సమా వేశంలో సమీక్షించారు. బ్యాంకింగ్ రంగ సేవల ద్వారా ఆర్థిక చేయూత అన్ని రంగా లకు అందిం చాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశిరచిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధిం చిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధుల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన వివిధ కార్పొరే షన్ల లబ్ధిదారులకు చేనేతలకు, మత్స్య కారులకు రుణాలు అందించి ఆర్థికంగా చేయూ తనివ్వాలన్నారు. అంతేకాకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపె దృష్టి సారించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఎంఎస్ఎంఇ రుణాల ను కేంద్రం సులభతరం చేసిందని జీవన నాణ్యత పెంచ డానికి దేశ ఆర్థిక అభివృద్ధికి వెన్నె ము-కై-న ఎంఎస్ఎంఇలు మరిన్ని నెలకొల్పితే ఉపాధి, వ్యాపార అవకాశాలు సష్టించి ఆర్థిక అభివృద్ధికి చేయూతని స్తాయన్నారు. చివరిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంధుల కొరకు బ్రెయిలీ లిపితో రూ పొందించిన ఆర్థిక అక్షరాస్యత పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుతగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశానికి సంబంధించిన గత సమావేశపు యూనిట్లపై తీసుకున్న చర్యలను అజెండా, వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌బిఐ మేనేజర్ నవీన్ లీడ్ బ్యాంక్ కన్వీనర్ సాయి మనోహర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.కేశవవర్మ, డిఆర్‌డిఎ పీడీ శివశంకర ప్రసాద్, వ్యవసాయ అధికారి బోసు బాబు, ట్రాన్స్కో ఎస్ఇ ఎస్.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటు

**ఎన్‌సిసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు**
**ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు చర్చలో లోకేశ్**

అమరావతి,మార్చి18(సాక్ష్యం): విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. 2016లో ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లు తీసుకొచ్చామని, అందులోని లోపాలు సరిదిద్ది కొత్త చట్టం తెస్తామన్నారు.

ఎన్‌సిసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించామన్నారు. యువగళం పాదయాత్రలో చేనేతలో కష్టాలు ప్రత్యక్షంగా చూశానని, చేనేత కళాకారులకు ఉచిత విద్యుత్‌కు క్యాబినెట్ ఆమోదం సంతోషాన్నిచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు 2025ను మంత్రి లోకేష్ సభలో ప్రవేశపెట్టారు. బిట్స్ ప్రాంగణాన్ని అమరావతిలో ఏర్పాటు కోసం 70 ఎకరాలను కేటాయిస్తూ నిన్న కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. డీప్ టెక్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక చేస్తున్నారు. విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు- చేసే చేయాలని పవ÷-లాన్ చేస్తున్నాం. 2016లో ప్రైవేట్ యూనివర్సిటీ- బిల్లును తీసుకొచ్చాం. అందులో కొన్ని లోపాలు ఉన్నాయి, వాటిని సరిదిద్ది సరికొత్త చట్టాలను తెస్తాం' అని మంత్రి నారా లోకేష్ చెప్పారు.స్కూళ్లలో ఎన్సీసీతో పాటు- ప్లే గ్రౌండ్స్, ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక వసతులపై సభ్యుల ప్రశ్నలకు అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ సమాధానాలు ఇచ్చారు. ఎన్సీసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు-పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించామని, త్వరలో ఈ అంశానికి సంబంధించి నిర్ణయం తీస్కుంటామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక వసతులు, ఇతర అంశాలపై మానిటరింగ్ జరుగుతోందని మంత్రి లోకేష్ బదులిచ్చారు. విద్యకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో విశాఖలో సెంచూరియన్ యూనివర్సిటీ ఏర్పాటు అయ్యిందన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల సంస్థాగత మార్పులకు ఉద్దేశించి ఈ సవరణ బిల్లును తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటు- కోసం కూడా ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతిష్ఠాత్మక బిట్స్ పిలానీ సంస్థకు అమరావతిలో 70 ఎకరాలు కేటాయించామని.. టాటా లాంటి సంస్థలు కూడా వస్తున్నాయని వివరించారు. డీప్‌టెక్ యూనివర్సిటీ కూడా రాష్ట్రంలో ఏర్పాటు- చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీ- రావాల్సి ఉందన్నారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు ఏపీలో ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ప్రైవేటు- విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లుకు ఏపీ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా రాష్ట్రంలోనే నాణ్యమైన విద్యను అందించేలా సంస్థలను తీసుకురావాలని ఎమ్మెల్యేలు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్.. దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపడతామన్నారు.



## ఢిల్లీ నుంచి ఎప్పుడొస్తారు

**కొల్లేరు రైతుల సమస్యపై మాట్లాడాలి**
**డిప్యూటి సిఎం పవన్‌తో బొత్స మాటామంతీ**

అమరావతి,మార్చి18(సాక్ష్యం): అసెంబ్లీ సమావేశాల్లో అప్పుడప్పుడు ఆసక్తికర సంఘటనలు జరగడం సర్వసాధారణంగా చూస్తుంటాం. అధికార, విపక్ష నేతల మధ్య సరదా సంభాషణలు, సీరియస్ డిస్కషన్‌లు జరుగుతుంటాయి. సభలో ఒకరిపై ఒకరు మాటల యుద్ధాలు చేసుకునే నేతలు.. అసెంబ్లీ ప్రాంగణాల్లో మాత్రం వారి మధ్య చమత్కారాలు, సరదా మాటలు దొర్లుతుంటాయి. అప్పుడప్పుడు పలు సమస్యలపై కూడా చర్చలు చేస్తుంటారు. ఇప్పుడు ఏపీ అసెంబ్లీలోనూ ఇలాంటి సంఘటనే జరిగింది. డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ , మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. అసెంబ్లీలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గ్రూప్ ఫోటో సందర్భంగా వీరిద్దరి మధ్య ఓ అంశం చర్చకు వచ్చింది. ఎలా ఉన్నారు అంటూ డిప్యూటీ సీఎంను బొత్స పలకరించారు. గ్రూప్ ఫోటో అనంతరం తిరిగి వెళుతూ మరోసారి కాసేపు డిప్యూటీ- సీఎంతో బొత్స మాట్లడారు. ఢిల్లీ నుంచి వచ్చాక ఎప్పుడు సభకు వస్తారు అని పవన్‌ను బొత్స అడిగారు. ఎప్పుడు వస్తారో చెపితే కొల్లేరులో అటవీ శాఖ సర్వే వల్ల నష్టపోతున్న రైతులు డెలిగేషన్ వచ్చి కలుస్తుందని తెలిపారు. దీంతో ఎప్పుడు వచ్చేది చెబుతానని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు వాసుల అభ్యర్థనను డిప్యూటీ సీఎంకు దృష్టికి తీసుకొచ్చారు బొత్స. సుప్రీం కోర్టులో కేసు వేయడంతో ఈ నెల 9 నుంచి అటవీశాఖ సర్వే నిర్వహిస్తోందని.. మూడు నెలల్లోగా స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని గత ఏడాది డిసెంబర్‌లో సుప్రీం కోర్టు ఆదేశించిందని చెప్పారు. బుధవారం సుప్రీం కోర్టులో కొల్లేరు వ్యాజ్యంపై విచారణ జరుగనుందని.. దీంతో అటవీ శాఖ సర్వే వల్ల నష్టపోతున్న రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ కారణంగా వారి డేలిగేషన్ వచ్చి కలుస్తారు -టైం ఇవ్వాలని బొత్స కోరారు. దీంతో ఢిల్లీ నుంచి రాగానే సమయం ఇస్తామని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. కాగా.. ఫొటో సెషన్ ముగించుకుని పవన్ లోపలికి వెళ్తున్న సమయంలో బొత్స సత్యనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీలు ఎదురొచ్చి మరీ డిప్యూటీ- సీఎంను కలిశారు. 'బాగున్నారా , ఆరోగ్యం ఎలా ఉంది' అంటూ పవన్‌ను బొత్స పలకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, బొత్స సత్యనారాయణ పరస్పరం కరచాలనం చేసుకున్నారు.

## 50 ఏళ్లకే పెన్షన్ ప్రతిపాదన ఆలోచిస్తాం


**కేవలం మరణించిన వారి పెన్షన్లు మాత్రమే తొలగించాం**
**మండలిలో పెన్షన్లపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం**

అమరావతి,మార్చి18(సాక్ష్యం): 50 ఏళ్లకు పెన్షన్లు ఇచ్చేందుకు పరిశీలన చేస్తున్నాం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు యాభై ఏళ్లకే పెన్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచటానికి ఐదేళ్ల సమయం తీసుకుంది. మేము రాగానే వెంటనే ఒక వెయ్యి పెంచాం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండలిలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తొలిసారి పెన్షన్లు మొదలుపెట్టారు. 2014లో పెన్షన్ వెయ్యి నుంచి రెండు వేలకు టీడీపీ ప్రభుత్వం పెంచింది. వృద్ధాప్య పెన్షన్లతో పాటు మత్స్యకార, ట్రాన్స్ జెండర్ పెన్షన్లు కూడా ఇస్తున్నాం. కేవలం మరణించిన వారి పెన్షన్లు మాత్రమే తొలగించాం అని వివరించారు. ఏపీ శాసనమండలిలో పెన్షన్లపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యే సమయానికి 53 లక్షల మందికి పెన్షన్‌లు ఉన్నాయని, కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి 65 లక్షలకు పెన్షన్లు పెరిగాయని వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెన్షన్లు ఎన్ని తొలగించారని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చాక 1.89 లక్షల మందికి తగ్గించారని, బడ్జెట్‌లో ఉన్న పెన్షన్లకి సరిపడా కేటాయింపులు చేయలేదని వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా పెన్షన్లు మంజూరు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక 1.89 లక్షల మందికి తగ్గించారు. బడ్జెట్‌లో ఉన్న పెన్షన్లకి సరిపడా కేటాయింపులు చేయలేదు. మీరు 50 ఏళ్లకే ఇస్తామన్న పెన్షన్లు ఇస్తారా? లేదా?. పెన్షన్ల పరిశీలన అంటూ తగ్గిస్తూ వెళ్తున్నారు. కూటమి నేతలు హామీ ఇచ్చిన విధంగా అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ డిమాండ్ చేశారు. 'జగన్ ముఖ్యమంత్రి అయ్యే సమయానికి 53 లక్షల మందికి పెన్షన్లు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి 65 లక్షలకు పెన్షన్లు పెరిగాయి. ఇప్పుడు పెన్షన్లు తొలగిస్తే ఎన్ని తొలగించారు?' అని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ప్రశ్నించారు. 'యాభై ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఏ ప్రతిపాదన చేయలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేరొన్నారు.

## ప్రజాప్రతినిధులకు లడ్డూలాంటి వార్త

**ఆదివారం కూడా విఐపి బ్రేక్ దర్శనాలకు అనుమతి**

తిరుమల,మార్చి18(సాక్ష్యం): ఏపీ ప్రజాప్రతినిధులకు కూడా టీటీడీ లడ్డూలాంటి కబురు పంపింది. ఇప్పటివరకు సోమవారం నుంచి గురువారం వరకు మాత్రమే వారి సిఫార్సులేఖలపై బ్రేక్ దర్శనాలు జారీ చేస్తుండగా.. ఇకపై ఆదివారం రోజు కూడా వారి సిఫార్సులేఖలపై బ్రేక్ దర్శనాలు జారీ చేసేందుకు టీటీడీ అంగీకరించింది. మొత్తంగా ఈప్రకటనతో ప్రజాప్రతినిధులకు ఊరట కలిగిందని చెప్పుకోవచ్చు. తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ఇప్పటికే టీటీడీ శుభవార్త అందించింది. ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సులేఖల స్వీకరణ ప్రారంభించేందుకు ఏర్పాట్లు- చేస్తుంది. సోమ, మంగళవారాలలో విఐపి బ్రేక్ దర్శనాలు.. బుధ, గురువారాలలో 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సులేఖలపై జారీ చేయనుంది. ఇదే సమయంలో మరోవైపు ఏపీ ప్రజా ప్రతినిధులకు కూడా తీపి కబురు చెప్పింది.. ఇప్పటి వరకు వారానికి నాలుగు రోజులు మాత్రమే సిఫార్సు లేఖలు పరిగణలోకి తీసుకుంటున్న టిటిడి ఇకపై ఏపీ ప్రజా ప్రతినిధులకు సంబంధించిన సిఫార్సులేఖలపై ఆదివారం కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు జారీ చేయనుంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రజా ప్రతినిధుల సిఫార్సులేఖలను తిరుమలలో పరిగణలోకి తీసుకోవాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లడం.. వెంటనే ఏపీ సీఎం సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలపై వారానికి రెండు రోజులు బ్రేక్ దర్శనాలు.. మరో రెండు రోజులు విఐపి బ్రేక్ దర్శనాలు జారీ చేయాలంటూ టీటీడీని ఆదేశించడం.. అదే విషయాన్ని తెలంగాణ సీఎంకు తెలియజేయడంతో తెలంగాణ ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా తిరుమలలో తమ ప్రతినిధిని ఓఎస్డీగా నియమించింది. రెండు రోజుల క్రితం శ్రీవారి దర్శనానికి విచ్చేసిన బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అయితే ఏకంగా అటురాష్ట్ర ప్రభుత్వానికి ఇటు టీటీడీకి అల్టిమేటం ఇచ్చేశారు. రానున్న వేసవిలో తమ సిఫార్సు లేఖలు తెలంగాణ ప్రజలకు జారీ చేస్తున్నామని వాటిని పరిగణలోకి తీసుకోకపోతే తెలంగాణ ప్రజాప్రతినిధులు అందరూ తిరుమలకు చేరుకొని టీటీడీతో తేల్చుకుంటామంటూ హెచ్చరిక జారీ చేశారు. ఇదే అంశం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడం రెండు రోజుల క్రితం రాష్ట్ర రాజధాని అమరావతిలో జరిగిన శ్రీనివాస కళ్యాణం సందర్భంగా టిటిడి అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖల స్వీకరణను 24వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లుటిటిడి పత్రిక ప్రకటన విడుదల చేసింది.మరోవైపు సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈ వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ ఎలా సర్దుబాటు చేస్తుంది అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## థర్డ్ డిగ్రీ ప్రయోగించారా?

**పోసానికి న్యాయమూర్తి ప్రశ్న**

గుంటూరు,మార్చి18(సాక్ష్యం): థర్డ్ డిగ్రీ ప్రయోగించారా అంటూ సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని గుంటూరు కోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు..సీఐడీ విచారణపై పోసానిని గుంటూరు కోర్టు జడ్జి ప్రశ్నించారు.. విచారణ సక్రమంగా జరిగిందా? థర్డ్ డిగ్రీ వాడారా? అని ప్రశ్నించగా.. జడ్జి ప్రశ్నలకు సమాధానమిచ్చిన పోసాని.. థర్డ్ డిగ్రీ ఉపయోగించలేదు, లాయర్ల సమక్షంలోనే విచారణ జరిగిందని తెలిపారు.. ఇక, గుంటూరు కోర్టులో విచారణ ముగిసిన తర్వాత.. గుంటూరు సబ్ జైల్‌కు పోసాని కృష్ణమురళిని తరలించారు. పోసాని కృష్ణ మురళిని సీఐడీ పోలీసులు ప్రశ్నించారు.. నాలుగు గంటలపాటు- పోసానిని విచారించారు పోలీసులు.. విచారణలో అనేక అంశాలపై పోసాని ప్రశ్నించారు.. అయితే, సమయం సరిపోకపోవడంతో మరోసారి పోలీసుల విచారణకు అడిగే అవకాశం ఉందంటు-న్నారు.. మరోవైపు, పోసాని కృష్ణమురళి పై సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా పడింది.. అయితే, సీఐడీ పోలీసుల విచారణ అనంతరం మరో సారి గుంటూరు జీజీహెచ్‌కు పోసాని కృష్ణ మురళిని తరలించారు వైద్య పరీక్షలు నిర్వహించారు.. వైద్య పరీక్షలు అనంతరం పోసానిని గుంటూరు జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎ-కై-÷-సజ్ కోర్టులో హాజరు పరిచారు సీఐడీ పోలీసులు..

# పాక్ క్రికెట్ గ్రాఫ్ పడిపోతుంది

## ప్రదర్శన క్రమంగా తగ్గుతోంది
## పీసీబీకి ఇంజమామ్ ఉల్ హక్ వార్నింగ్

దాదాపు అన్ని విభాగాల్లోనూ మార్పులు చేసినా పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌కు నిరాశే ఎదురవుతోంది. కెప్టెన్సీ, కోచింగ్, సెలక్షన్ కమిటీ, అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో గత రెండేళ్లుగా మార్పులు చేస్తోంది



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అయినా ఫలితాలు అనుకూలంగా రావడం లేదు. ఈ పరిస్థితిపై పీసీబీకి పాక్ మాజీ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హక్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. ఈ సమస్యకు త్వరలో పరిష్కారం ఆలోచించకపోతే దేశ క్రికెట్ గ్రాఫ్ మరింత దిగజారిపోతుందని హెచ్చరించాడు. " గత రెండేళ్లుగా పాకిస్థాన్ ప్రదర్శన క్రమంగా తగ్గుతోంది. సరైన దిశలో మనం పనిచేయకపోతే మరింత దగజారిపోయో ప్రమాదం ఉంది. మేనేజ్‌మెంట్, కోచ్‌లు, ప్లేయర్లను తరచూ మార్చడం వల్ల సమస్య పరిష్కారం కాదు. మనం ఎక్కడ తప్పు చేస్తున్నామో అని అందరూ కూర్చొని చర్చించాలి. ఇష్టమొచ్చినట్లు మార్పులు చేసే బదులు ఎక్కడ తప్పులు జరుగుతున్నాయో తెలుసుకోవాలి. జట్టులో ప్లేయర్లను ఎప్పటికప్పుడు మార్చడం వల్ల వారికి అవసరమైన కాన్ఫిడెన్స్ రాదు. అలా చేస్తే పరిస్థితి అలాగే ఉంటుంది." అని ఇంజమామ్ ఉల్ హక్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే, అనుకున్నదొక్కటి అయినది ఒక్కటీ అన్నట్టుగా ఉంది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పరిస్థితి. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో లాభాలు వస్తాయనుకున్న పాక్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

టోర్నీ నిర్వహణతో పీసీబీకి రూ.700 కోట్లకు పైగా నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. ఖర్చు చేసిన రూ.869 కోట్లలో 85శాతానికి పైగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ టోర్నమెంట్ మొత్తంలో సొంతగడ్డపై పాకిస్థాన్ ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడగలిగింది. లాహోర్‌లో తన తొలి మ్యాచ్‌లో ఓడిన పాకిస్థాన్ ఆ తర్వాత దుబాయ్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలైంది. ఇక స్వదేశంలో బంగ్లాతో ఆడాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. గ్రూప్ దశలోనే పాకిస్థాన్ కథ ముగిసింది. టీమ్‌ఇండియా కారణంగా ఫైనల్ మ్యాచ్ కూడా పాక్‌లో జరగలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం రావల్పిండి, లాహోర్, కరాచిలోని స్టేడియాలను పీసీబీ ఆధునీకరించింది. ఇందుకోసం అనుకున్న బడ్జెట్ కంటే 50 శాతం అనదంగా ఖర్చు చేసింది. టోర్నమెంట్ నిర్వహణతో భారీ నష్టాలు రావడం వల్ల పాక్ క్రికెట్ బోర్డు ఖర్చులు తగ్గించుకునే పనిలో పడింది. అందులో భాగంగా జాతీయ టీ20 ఛాంపియన్‌షిప్‌లో ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును 90 శాతం తగ్గించింది. ఆటగాళ్లకు 5-స్టార్ సౌకర్యాలు ఇవ్వకుండా హాస్టల్స్‌లో బస ఏర్పాటు చేసింది పీసీబీ.

# ధోనీ చాలా ఫిట్‌గా కనిపిస్తున్నాడు

- బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడు
- ధోని కంటే గొప్పోడిని నేను చూడలేదు
- ధోనీపై హర్భజన్ ప్రశంసల వర్షం



టీమ్ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా ఐపీఎల్‌లో మాత్రం కొనసాగుతున్నాడు. 43 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ఐపీఎల్‌లో ఫ్యాన్స్‌ను అలరిస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025 సీజన్ కోసం మహీ ఫిబ్రవరిలోనే చెన్నైకి చేరుకొని రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ఇటీవలే టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, ధోనీ ఓ వివాహ వేడుకలో కలుసుకున్నారు. ఈ క్రమంలో ధోనీతో జరిగిన సంభాషణ గురించి భజ్జీ తెలిపాడు. తాను ఇటీవలే ధోనీని ఓ ఫ్రెండ్ కుమార్తె వివాహ వేడుకలో కలిశానని హర్భజన్ సింగ్ వెల్లడించాడు. అప్పుడు ధోనీ చాలా ఫిట్‌గా, దృఢంగా కనిపించాడని చెప్పాడు. "ఈ వయసులో ఏం చేస్తున్నావు (ఫిట్‌నెస్‌ను ఉద్దేశించి), కష్టమే కదా' అని అన్నాను. 'అవును ఈ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కష్టమే. కానీ, నేను చేయాలనుకుంటున్నది ఇదే. నేను దానిలో ఆనందాన్ని పొందుతాను. ఫిట్‌గా ఉంటూ ఆటను కొనసాగించాలనుకుంటున్నా" అని ధోనీ బదులిచ్చినట్లు హర్భజన్ సింగ్ చెప్పాడు.ఏడాది పొడవునా ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం అనేది చాలా కష్టమేనని భజ్జీ వ్యాఖ్యానించాడు. కానీ, అది ఎలా సాధ్యమో ధోనీ చేసి చూపిస్తున్నాడని కొనియాడాడు. దోనీ ఇతరుల కంటే మెరుగ్గా ఏదో చేస్తున్నాడని, నామమాత్రంగా జట్టులో కొనసాగడం లేదన్నాడు. తన బ్యాటింగ్‌తో ధోనీ బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడని పేర్కొన్నాడు. "ఒకట్రెండు నెలలుగా ధోనీ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఎన్ని ఎక్కువ బంతులు ఆడితే ఆ స్థాయిలో సిక్సర్లు వస్తాయి. ధోనీ చెన్నైలో ప్రతిరోజూ 2-3 గంటలు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇంత వయసులో కూడా గ్రౌండ్‌కి మొదటగా వచ్చి అందరికంటే ఆఖరిగా వెళ్లే వ్యక్తి ప్లేయర్ దోనీనే. అదే ధోనీకి, ఇతర క్రికెటర్లకు ఉన్న తేడా. వికెట్ కీపింగ్‌లోనూ ధోనీని మించినవారిని నేను చూడలేదు. " అని ధోనీపై హర్భజన్ ప్రశంసలు కురిపించాడు.కాగా, ఐపీఎల్ 18వ ఎడిషన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రాక్టీస్ ను ముమ్మరంగా చేశాయి. ఈ సీజన్‌లో సీఎస్కే తన తొలి మ్యాచ్ ముంబయి ఇండియన్స్‌తో తరపడనుంది. మార్చి 23న చెపాక్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

# పృథ్వీ షాకు చాలా కష్టకాలం నడుస్తోంది

### షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్
### శశాంక్ సింగ్ కీలక వ్యాఖ్యలు



భారత క్రికెట్ లో పృథ్వీ షాది ప్రత్యేకమైన ప్రస్థానం అనడంలో సందేహం లేదు. మరో సచిన్ టెండూల్కర్ అనుకున్న వ్యక్తి ఇప్పుడు అనామకంగా మిగిలాడు. ఎంతవేగంగా అంతర్జాతీయ యవనికలో అడుగు పెట్టాడో అంతే వేగంగా తెరమరుగైయ్యాడు. భారత్ తరపున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టీ20 ఆడిన షా.. ఆ తర్వాత జాతీయ జట్టు కాదు కదా.. కనీసం డొమెస్టిక్ లెవల్లో కూడా సత్తా చాట లేక పోయాడు. తాజాగా అతని గురించి షా మిత్రుడు, ఐపీఎల్ సంచలనం శశాంక్ సింగ్ వ్యాఖ్యానించాడు. తనకు 13 ఏళ్ల వయుసున్నపటి నుంచి షా తనకు తెలుసని, కొన్ని కారణాల వల్ల అతని డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని వ్యాఖ్యానించాడు. నిజానికి షాకు ఇప్పుడు చాలా కష్టకాలం నడుస్తోంది. ఐపీఎల్ 2025లో అన్ సోల్డ్ గా మిగిలిన షా.. విజయ్ హజారేట్రోఫీ, రంజీ ట్రోఫీలలో ముంబై జట్టు నుంచి కూడా ఉద్వాసనకు గురయ్యాడు. తాజాగా రూట్ మొబైల్ కప్పులో తను బరిలోకి దిగాడు.  షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్ అని, తను సత్తా చాటడం భారత క్రికెట్ కు ముఖ్యమని శశాంక్ అభివర్ణించాడు. యశస్వి జైస్వాల్, శుభమాన్ గిల్ స్థాయిలో తను ఓపెనర్ గా ఎదిగేవాడని, అయితే కొన్ని కారణాల వల్ల తన డౌన్ ఫాల్ ప్రారంభమైందని పేర్కొన్నాడు. ఇప్పటికైనా కొన్ని మార్పులు చేస్తే, తను తిరిగి గాడిలో పడతాడని పేర్కొన్నాడు. పది గంటలకే పడుకోవడం, స్ట్రిక్టు డైట్ పాటించడం, మరికొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా తను బౌన్స్ బ్యాక్ కాగలడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ మార్పులతో తనకు ఎదురే ఉండబోదని వ్యాఖ్యానించాడు. నిజానికి గత సీజన్ శశాంక్ సింగ్ కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. వేలంలో అనూహ్యంగా శశాంక్ ను కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్ కు లక్కు కలిసొచ్చింది. ఈ సీజన్లో 165 స్ట్రైక్ రేట్ తో 354 పరుగులు సాధంచాడు. ఎన్నో మ్యాచ్ ల్లో కీలక ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. పంజాబ్ తో పాటు మిగతా క్రికెట్ ప్రేమికుల మనసు దోచాడు. దీంతో అతనిపై ఫ్రాంచైజీ ఎనలేని విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. పంజాబ్ తరపు మొట్టమొదటి రిటెన్షన్ గా శశాంక్ నే ఎంచుకోవడం విశేషం. 5.5 కోట్ల రూపాయలతో తనను రిటైన్ చేసుకుంది. తను అన్ క్యాప్డ్ ప్లేయర్ కాబట్టి, ఆ ధర పలికింది. భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించి క్యాప్డ్ ప్లేయర్ కేటగిరీలో ఉన్నట్లయితే తనకు భారీ ధర పలికేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక గతేడాది గూగుల్లో అత్యధిక మంది సెర్చ్ చేసిన అథ్లెట్లలో శశాంక్ పేరు ప్రముఖంగా నిలిచింది. ఒక్క హార్ధిక్ మాత్రమే ఈ జాబితాలో టాప్-10లో నిలిచాడు. ఈ ఏడాది పంజాబ్ కింగ్స్ తరపున బరిలోకి దిగనున్న శశాంక్.. నూతన సారథి శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడనున్నాడు.

# రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడు

### ఆర్‌సీబీ భవిష్యత్తు అతనే..
### పటీదార్‌పై కోహ్లీ ప్రశంసల జల్లు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) నయా సారథి రజత్ పటీదార్‌పై ఆ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడని కొనియాడాడు. ఆర్‌సీబీ భవిష్యత్తు అతనేనని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ముంగిట ఆర్‌సీబీ.. తమ నూతన సారథిగా యువ ప్లేయర్ అయిన రజత్ పటీదార్‌ను నియమించిన విషయం తెలిసిందే.అప్‌కమింగ్ సీజన్ నేపథ్యంలో ఆర్‌సీబీ సోమవారం.. చిన్నస్వామి స్టేడియంలో అన్‌బాక్స్ ఈవెంట్ నిర్వహించింది. అప్‌కమింగ్ సీజన్‌తో పాటు టీమ్ కాంబినేషన్ గురించి కోహ్లీ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ క్రమంలోనే రజత్ పటీదార్‌ను కొనియాడుతూ.. అతనికి మద్దతుగా నిలవాలని ఫ్యాన్స్‌ను కోరాడు. 'రజత్ పాటిదార్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. ఆర్‌సీబీని విజయవంతంగా నడిపించడమే కాకుండా అభిమానుల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఉంది. ఈ ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న ఆశల్ని అతను తప్పక నెరవేరుస్తాడనే నమ్మకం ఉంది. తప్పకుండా ఆర్‌సీబీని గెలుపు బాటలో నడిపిస్తాడు. సారథిగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, ప్రతిభ అతనిలో ఉన్నాయి.'అని విరాట్ కోహ్లీ తెలిపాడు.ఐపీఎల్ 2021లో ఆర్‌సీబీ తరపున అరంగేట్రం చేసిన రజత్ పటీదార్.. 4 మ్యాచ్‌లు ఆడి 71 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ పేలవ ప్రదర్శనతో ఆర్‌సీబీ తర్వాతి సీజన్‌కే అతన్ని వేలంలోకి వదిలేసింది. ఐపీఎల్ 2022 వేలంలో అతన్ని ఏ జట్టు కూడా కొనుగోలు చేయలేదు. దాంతో అన్‌సోల్డ్‌గా నిలిచాడు. అయితే ఐపీఎల్ 2022 సీజన్ ముంగిట ఆర్‌సీబీ తీసుకున్న అనామక ప్లేయర్ లవ్‌నీత్ సిసోడియా గాయపడటంతో అతని స్థానంలో అనూహ్యంగా రజత్ పటీదార్ జట్టులోకి వచ్చాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతనికి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ తుది జట్టులో చోటిచ్చింది. రూ. 20 లక్షల కనీస ధరతోనే జట్టులోకి వచ్చిన అతను ఆ సీజన్‌లో 8 మ్యాచ్‌ల్లో 55.50 సగటుతో 333 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలతో పాటు ఓ శతకం సాధించాడు. అది కూడా లక్నో సూపర్ జెయింట్స్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌లో 54 బంతుల్లో 112 పరుగులతో అజేయంగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో సెంచరీ చేసిన తొలి అనామక ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ సెంచరీ ఇన్నింగ్స్ పటీదార్ తలరాతను మార్చేసింది. కానీ గాయం కారణంగా తర్వాతి ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అతనిపై నమ్మకం ఉంచిన ఆర్‌సీబీ అండగా నిలిచింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన అతను 15 మ్యాచ్‌ల్లో 5 హాఫ్ సెంచరీలతో 395 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఆర్‌సీబీ అతన్ని రూ. 11 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకుంది. గత సీజన్ వరకు జట్టును నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను వదిలేయడంతో తమ సారథిగా రజత్ పటీదార్‌ను నియమించింది. గాయపడిన ఆటగాడికి రిప్లేస్‌మెంట్‌గా రూ. 20 లక్షల కనీస ధరతో జట్టులోకి వచ్చిన రజత్ పటీదార్.. మెరుగైన ప్రదర్శనతో రూ. 11 కోట్ల ధరను అందుకోవడంతో పాటు ఇప్పుడు ఏకంగా ఆర్‌సీబీ సింహాసనంపైనే కూర్చున్నాడు.

# పటిష్టంగా ఢిల్లీ బౌలింగ్ లైనప్

### ఈ సీజన్‌లో టైటిల్‌పై ఢిల్లీ ఆశలు

ఐపీఎల్ లో ప్రారంభంనుంచి ఆడుతున్న కొన్ని జట్లలో ఢిల్లీ క్యాపిటల్స్ ఒకటి. ఆరంభంలో ఢిల్లీ డేర్ డెవిల్స్ గా బరిలోకి దిగి, మధ్యలో క్యాపిటల్స్ గా పేరు



మార్చుకుంది. పేరు మారినా, జట్టు రాత మారలేదు. 17 ఏళ్ల ప్రస్థానంలో ఢిల్లీ కేవలం ఒక్కసారి మాత్రమే ఫైనల్స్ కు చేరింది. 2020 సీజన్లో ఫైనల్లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడిపోయింది. ఇక ఈ ఏడాది మరింత చాలెంజింగ్ గా ఆ జట్టుకు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. విధ్వంసక ప్లేయర్ రిషభ్ పంత్, అటు కెప్టెన్సీ నుంచి , ఇటు జట్టు నుంచి వైదొలిగాడు. అతని స్థానంలో స్టార్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ను కెప్టెన్ గా నియమించింది. అయితే అంతగా అనుభవం లేని అక్షర్ ఈ సీజన్ లో ఎలా నెట్టుకొస్తాడో చూడాలి. అయితే అతనికి డిప్యూటీగా బాగా అనుభవం ఉన్న సౌతాఫ్రికా మాజీ ఫాఫ్ డుప్లెసిస్ ఉండటం ప్లస్ పాయింట్. అనాదిగా ఢిల్లీ బ్యాటింగ్ కు పెట్టింది పేరు. ఆస్ట్రేలియన్ యువ ఓపెనర్ జాక్ ఫ్రేసర్ మెక్ గర్క్, కేఎల్ రాహుల్, డుప్లెసిస్ లతో బలంగా ఉంది. కన్సిస్టెన్సీకి వీరు చిరునామాగా ఉంటారు. అయితే అనుభవం లేని మిడిలార్డర్ ఢిల్లీకి బలహీనతగా మారింది. అభిషేక్ పోరెల్, అశుతోష్ శర్మలతోపాటు అక్షర్ పటేల్, ట్రిస్టన్ స్టబ్స్ తదితరులు ఉన్నా, తొలి ఇద్దరు అంతగా ప్రూవ్ చేసుకోలేదు.  అయితే వారి టాలెంట్ పై ఎలాంటి సందేహం లేదు. అక్షర్, స్టబ్స్ బ్యాటింగ్ లోనూ అదరగొడుతుండటం ప్లస్ పాయింట్. వెటరన్ కరుణ్ నాయర్ కూడా అందుబాటులో ఉన్నాడు. డొమెస్టిక్ లో అద్భుత ఫామ్ ను చాటుకుని అందరి దృష్టిని ఆకర్షించాడు.  ఇక విధ్వంసక ప్లేయర్ హేరీ బ్రూక్ టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలగడం మైనస్ పాయింట్. అతని స్థానంలో మరెవరినైనా ఎంపిక చేస్తుందో చూడాలి. ఈ సీజన్ లో ఢిల్లీ తమ బౌలింగ్ లైనప్ ను బలంగా మార్చింది. ఆసీస్ స్పీడ్ స్టర్ మిషెల్ స్టార్క్, కుల్దీప్ యాదవ్, ముఖేశ్ కుమార్, నటరాజన్, మోహిత్ శర్మలతో చాలా పటిష్టంగా ఉంది. బౌలింగ్ లో అందరూ నిరూపించుకున్నావారే. మొత్తం మీద ఈ జట్టును అక్షర్ ఈ సీజన్ లో ఎలా నడిపిస్తాడో చూడాలి. ఇక అందరూ అనుకున్నట్లుగా కెప్టెన్ గా కాకపోవడం రాహుల్ మైనస్ పాయింట్. అది తన ఆటపై ప్రభావం చూపించకుండా తను జాగ్రత్త పడాలి. అలాగే తన స్వార్థం కోసం కాకుండా, జట్టు ప్రయోజనల కోసం ఆడాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

**డీసీ ప్లేయింగ్ లెవన్ (అంచనా):** జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్, కేఎల్ రాహుల్, ఫాఫ్ డు ప్లెసిస్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, మిషెల్ స్టార్క్, కుల్దీప్ యాదవ్, ముకే





# ఘనంగా మోహన్ బాబు పుట్టిన రోజు వేడుకలు

భారతదేశం గర్వించదగ్గ ప్రముఖ నటుల్లో డాక్టర్ మంచు మోహన్ బాబు గారు ప్రథమ వరుసలో ఉంటారు. సినిమా రంగంలో, విద్యారంగంలో ఆయన చెరగని ముద్ర వేశారు. మోహన్ బాబు గారు మార్చ్ 19, 1952లో జన్మించారు. ప్రస్తుతం ఆయన 73వ వసంతంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం మంచు వారి డ్రీమ్ ప్రాజెక్టు అయిన కన్నప్ప ప్రమోషన్స్ లో మోహన్ బాబు గారు బిజీగా ఉన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కన్నప్ప నుంచి అప్డేట్ రాబోతోంది. కన్నప్ప చిత్రంలో మోహన్ బాబు గారు మహాదేవశాస్త్రి పాత్రలో కనిపించబోతున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు గారి బర్త్డే సందర్భంగా మహా దేవ శాస్త్రి పరిచయ గీతాన్ని విడుదల చేయనున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా కొన్ని విశేషాలు చూద్దాం..

### విలన్‌గా రాణించిన రోజులు

1975 నుంచి 1990 వరకు, మోహన్ బాబు గారు భారతీయ సినిమాల్లో విలన్ పాత్రకు కొత్త నిర్వచనాన్ని తీసుకువచ్చారు. దేశంలో అత్యధికంగా డిమాండ్ ఉన్న ప్రతినాయకులలో ఒకరిగా నిలిచిన ఆయన నటనతో ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. స్వర్గం నరకం చిత్రంతో పరిశ్రమకు హీరోగా పరిచయం అయినా.. విలన్ పాత్రలతో టాప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

### హీరోగా విజయ శిఖరాలు

1990వ దశాబ్దంలో, మోహన్ బాబు గారు హీరోగా మారి ప్రేక్షకులను తనదైన శైలితో అలరించారు. అల్లుడు గారు, అసెంబ్లీ రౌడీ, పెదరాయుడు వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు ఆయన స్థాయిని పెంచాయి. తెలుగు చిత్రాల్లో ఆయన నటించిన అనేక చిత్రాలు తరువాత హిందీ, తమిళ భాషల్లో రీమేక్ చేయబడి అక్కడ కూడా భారీ విజయాలు సాధించాయి. తద్వారా ఆయన పేరు జాతీయ స్థాయిలో వినిపించింది.

పెదరాయుడు విజయోత్సవాల్లో 200 రోజుల వేడుక తిరుపతిలో ఘనంగా నిర్వహించబడింది. ఈ చారిత్రక వేడుకకు మొత్తం రాష్ట్ర రాజకీయ కేబినెట్, ముఖ్యమంత్రి హాజరయ్యారు, ఇది భారతీయ సినిమా చరిత్రలో అత్యంత అరుదైన ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. ఇది మోహన్ బాబు గారి క్రేజ్‌కు నిదర్శనం.

మోహన్ బాబు గారి ప్రభావం సినిమాలపై మాత్రమే కాకుండా రాజకీయ రంగానికీ విస్తరించింది. 1993లో ఆయన నిర్మించిన మేజర్ చంద్రకాంత్ చిత్రం.. ఎన్.టి.రామారావు గారు తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడంలో కీలక పాత్ర పోషించింది. ఈ చిత్ర 100 రోజుల వేడుక తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సభ సినిమా, రాజకీయ చరిత్రలో ఒక గొప్ప ఘట్టంగా నిలిచింది.

### విద్యా రంగంలో విప్లవం

సినిమా రంగంలో విశేష విజయాలను సాధించిన మోహన్ బాబు గారు, విద్యా రంగంలోనూ విశేషమైన సేవలను అందించారు.

1992లో స్థాపించిన శ్రీ విద్యానికేతన్ విద్యా ట్రస్ట్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా 25% ఉచిత విద్య అందిస్తూ అనేక పేద విద్యార్థులకు అభివృద్ధి అవకాశాలను సృష్టించారు. 2022లో ప్రారంభమైన మోహన్ బాబు విశ్వవిద్యాలయం విద్య పట్ల వారి అంకిత భావానికి నిలువుటద్దంగా నిలిచింది.

### పురస్కారాలు, గౌరవాలు

మోహన్ బాబు గారు తన సుదీర్ఘమైన కెరీర్‌లో ఎన్నో గౌరవపురస్కారాలను అందుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రదానం చేయగా, 2016 ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించింది.

### డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో మోహన్ బాబు గారు మహాదేవ శాస్త్రిగా కనిపించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ఆయన కెరీర్‌లో మరొక మైలురాయిగా నిలుస్తుంది.

### సినిమా చరిత్రలో ఒక స్వర్ణ యుగం

సామాన్య వ్యక్తిగా మొదలై.. అసామాన్య వ్యక్తిగా మోహన్ బాబు ఎదిగిన తీరు అందరికీ ఆదర్శనీయం. సినిమా రంగంలో ఇన్నేళ్ల పాటు సేవలు అందిస్తూ వస్తున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ 75 చిత్రాలను నిర్మించారు. ఓ నటుడు ఇలా నిర్మాతగా మారి 75 చిత్రాలు నిర్మించడం అనేది ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో రికార్డ్. ఎక్కువ చిత్రాలు నిర్మించిన ఏకైక నటుడిగా ఆయన రికార్డులు నెలకొల్పారు. ఆయన సాధించిన విజయాలను తలచుకుంటూ ఈ సువర్ణ ఘట్టాన్ని ఘనంగా జరుపుకుందాం.

# కోర్టు' సినిమా విజయం మా టుక్‌టుక్‌పై కూడా ప్రభావం చూపుతుంది

ప్రీరిలీజ్ వేడుకలో దర్శకుడు సుప్రీత్.సి.కృష్ణ

ఫాంటసీ, మ్యాజికల్ అంశాలతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'టుక్ టుక్'. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు,సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని మరియు ఆర్ వై జి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డిలు ఈచిత్రాన్ని నిర్మించారు. మార్చి 21న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది.

ఈ వేడుకలో నిహాల్ కోదాటి మాట్లాడుతూ " దర్శకుడు సుప్రీత్‌కు ఈ సినిమా చాలా ప్రత్యేకం. ఈ సినిమా తప్పకుండా ఆడియన్స్‌కు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది. సినిమా చూస్తున్నంత సేపు అందరూ ఎంతో ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా వినోదం అందరికి నచ్చుతుంది. సాంకేతికంగా కూడా చాలా అత్యున్నతంగా ఉన్న సినిమా ఇది. అందరూ థియేటర్‌లో సినిమా చూడాలని కోరుకుంటున్నాను. చిన్న సినిమాకు అందరి సపోర్ట్ రావాలి. ఇలాంటి సినిమాలు విజయం సాధిస్తే ఇలాంటి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు చాలా వస్తాయి' అన్నారు.

శాన్వీ మేఘన మాట్లాడుతూ " రీసెంట్‌గా కుడుంబస్తాన్ అనే తమిళ సినిమా చేశాను. ఆ సినిమాకు చాలా మంచి స్పందన వస్తోంది. అందరూ మంచి ప్రేమ ఇచ్చారు. ఓటీటీలో కూడా తెలుగులో ఆ సినిమా విడుదలైంది. తెలుగు వాళ్లకు కూడా ఆ సినిమా నచ్చింది. కుడుంబస్తాన్‌ను ఆదరించినట్లే తెలుగు ప్రేక్షకులు మా టుక్‌టుక్‌ను ఆదిరించి, ఈ తెలుగ మ్మాయికి ఆశ్వీరదిస్తారని కోరుకుంటున్నాను. ఈ సినిమాను దర్శకుడు ఎంత అందంగా నేరేట్ చేశాడో, సినిమాను కూడా అంతే అందంగా తెరకెక్కించాడు. ఈ ఫాంటసీ సినిమాను అందరూ ఫ్యామిలీతో థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా మా టీమ్ అందరికి మంచి విజయం అందిస్తుందనే హోప్ ఉంది ' అన్నారు.

దర్శకుడు సుప్రీత్ సి. కృష్ణ మాట్లాడుతూ "టీజర్‌కు, ట్రైలర్‌కు, ఏఐ పాటకు వస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. మార్చి 21న అందరూ ఓ కొత్త తెలుగు సినిమా చూడబోతున్నారు. ఓ కమర్షియల్ ప్యాకేజీలో ఇలాంటి సినిమా చేయడం గొప్పగా అనిపించింది. టుక్ టుక్ ఐడియా రాగానే అందరికి ఈ కాన్సెప్ట్‌ను ఫ్రాంఛైజీగా, యూనివర్శ్‌గా బిల్డ్ చేయాలని ఉంది. ఒక వెహికల్‌లో ఓ సోల్, ఆ వెహికల్‌కు ఓ బ్యాక్‌స్టోరీ ఈ కాన్సెప్ట్‌ను రకరకాలుగా చేయాలని ఉంది. తప్పకుండా ఈ చిత్రం అందరికి నచ్చుతుందని అనుకుంటున్నాను. రోషన్ నటించిన కోర్టు మంచి విజయం సాధించింది. ఈ సినిమాలో కూడా రోషన్ ఓ మంచి పాత్రను చేశాడు. తప్పకుండా కోర్టు సక్సెస్ మా సినిమాపై కూడా రిఫ్లెక్ట్ అవుతుంది ' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన రాహుల్ రెడ్డి మాట్లాడుతూ " ఫాంటసీ థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. మార్చి 21న చిత్రాన్ని అందరూ థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ వేడుకలో వాణిశాలిని, మధు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్



చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.


# 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం నుంచి 'వచ్చార్రోయ్' గీతం విడుదల

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్ గా రూపొందుతోన్న 'మ్యాడ్ స్క్వేర్' కోసం సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. టీజర్ లోని సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అలాగే 'మ్యాడ్ స్క్వేర్' నుంచి విడుదలైన 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటలు కూడా మారుమోగిపోతున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో గీతం 'వచ్చార్రోయ్' విడుదలైంది.



మ్యాడ్ గ్యాంగ్ కి తిరిగి స్వాగతం పలకడానికి సరైన గీతం అన్నట్టుగా 'వచ్చార్రోయ్' ఎంతో ఉత్సాహభరితంగా ఉంది. 'లడ్డు గానీ పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటల బాటలోనే.. 'వచ్చార్రోయ్' కూడా విడుదలైన నిమిషాల్లోనే శ్రోతల అభిమాన గీతంగా మారిపోయింది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ఈ పాటను స్వయంగా ఆలపించగా.. ప్రతిభావంతులైన దర్శకుడు కె.వి. అనుదీప్ సాహిత్యం అందించడం విశేషం. భీమ్స్ సిసిరోలియో తనదైన ప్రత్యేక శైలి సంగీతంతో మరోసారి కట్టిపడేశారు. భీమ్స్ సంగీతం, గాత్రం ఈ పాటను చార్ట్ బస్టర్ గా మలిచాయి. ఇక కె.వి. అనుదీప్ సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "ఏసుకోండ్రా మీమ్స్, చేసుకోండ్రా రీల్స్, రాసుకోండ్రా హెడ్ లైన్స్.. ఇది మ్యాడ్ కాదు మ్యాడ్ మ్యాక్స్" వంటి పంక్తులతో అందరూ పాడుకునేలా గీతాన్ని రాశారు. యువత కాలు కదిపేలా ఉన్న ఈ గీతం, విడుదలైన కొద్దిసేపటిలోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ త్రయం.. 'మ్యాడ్ స్క్వేర్'లో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. మ్యాడ్ లో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఈ సీక్వెల్ తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్, కె.వి. అనుదీప్ కీలక పాత్రలలో అలరించనున్నారు. అలాగే, రెబా మోనికా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. 'మ్యాడ్ స్క్వేర్' చిత్రానికి ప్రముఖ ఛాయాగ్రాహకుడు శామ్‌దత్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల సమిష్టి కృషితో.. మొదటి భాగానికి రెట్టింపు వినోదాన్ని 'మ్యాడ్ స్క్వేర్' అందించనుంది. శ్రీకర స్టూడియోస్ తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. భారీ అంచనాల నడుమ 2025, మార్చి 28న 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం థియేటర్లలో అడుగు పెట్టనుంది.

# #SA10 సెకండ్ పోస్టర్ విడుదల



సుశాంత్ అనుమోలు తన ప్రాజెక్టులతో చాలా సెలెక్టివ్‌గా ఉన్నారు. తన మైల్ స్టోన్ 10వ మూవీ #SA10ని సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి పృథ్వీరాజ్ చిట్టేటి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సంజీవని క్రియేషన్స్ బ్యానర్‌పై వరుణ్ కుమార్, రాజ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్ మెంట్ ని స్ట్రైకింగ్ పోస్టర్ ద్వారా చేశారు. పోస్టర్ లో సుశాంత్ రెండు డిఫరెంట్ లుక్‌లలో ఆసక్తిని పెంచారు. పోస్టర్ పై భాగంలో అతను స్టైలిష్, ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. నేలపై పుర్రెలతో చుట్టుముట్టబడి, పిల్లి అతనిని చూడటం టెర్రిఫిక్ గా వుంది. దీనికి డిఫరెంట్ గా పోస్టర్ దిగువ బాగం వుంది. ఇది హీరో క్యారెక్టర్ మరో కోణాన్ని ప్రజెంట్ చేస్తోంది. ఇక్కడ సుశాంత్ ఎమోషనల్ గా గర్జిస్తున్నట్లు కనిపిస్తుంది. ఇది అతను పోషించే పాత్ర వెర్సటైల్ నేచర్ ని సూచిస్తుంది.పోస్టర్ సూచించినట్లుగా, #SA10 సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్, దీనిలో సుశాంత్ ఎక్సర్సిస్ట్ పాత్రను పోషిస్తాన్నారు. ఇది తెలుగులో ఫస్ట్ అఫ్ ఇట్స్ కైండ్ ఫిల్మ్. ఈ పాత్ర కోసం సుశాంత్ మేకోవర్ పోస్టర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.ఈ చిత్రానికి అనిరుధ్ కృష్ణమూర్తి స్క్రీన్‌ప్లే రాయడంతో పాటు, దర్శకుడు పృథ్వీరాజ్ చిట్టేటితో కలిసి డైలాగ్స్ అందించారు. వైవిబి శివ సాగర్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. ఆశిష్ తేజ పులాల ఆర్ట్ డైరెక్టర్. సినిమా గురించి మరిన్ని ఆసక్తిరమైన వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.



# ఏప్రిల్ 11న 'ఆదిత్య 369' గ్రాండ్ రీ రిలీజ్

'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన సినిమా 'ఆదిత్య 369'. ప్రసిద్ధ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించగా, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ సంస్థ నిర్మించిన చిత్రమిది. విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల మన్ననలు అందుకున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న గ్రాండ్ రీ రిలీజ్ చేస్తున్నారు.

'ఆదిత్య 369' రీ రిలీజ్ సందర్భంగా శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... "ఈ చిత్రాన్ని 4kలో డిజిటలైజ్ చేశాం. సౌండ్ కూడా 5.1 క్వాలిటీలోకి కన్వర్ట్ చేశాం. ప్రసాద్స్ డిజిటల్ టీం ఆరు నెలల పాటు శ్రమించి చక్కటి అవుట్ పుట్ ఇచ్చారు. 34 ఏళ్ళ క్రితం జూలై 18, 1991న విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల్లో ఇప్పటికీ ఎంతో క్రేజ్ ఉంది. రీ రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేయగానే ఎంతో మంది విడుదల తేదీ కోసం ఆసక్తిని కనబరిచారు. అప్పట్లో ఇది చాలా అడ్వాన్స్ సినిమా. ఇప్పటి ట్రెండ్‌కి కూడా కనెక్ట్ అయ్యే సినిమా. 'ఆదిత్య 369' చిత్రాన్ని నేను నిర్మించడానికి నాకెంతో సహకరించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారికి జీవితాంతం రుణపడి వుంటాను. ఇంత గొప్ప ప్రాజెక్టు నాకు ఇచ్చి నిర్మాతగా నన్ను ఎన్నో మెట్లు ఎక్కించిన నందమూరి బాలకృష్ణ గారికి, సింగీతం శ్రీనివాస రావు గారికి ఇలా రీ రిలీజ్ చేస్తున్నామని చెబితే చాలా ఎగ్జైట్ అయ్యారు. అప్పట్లో నేను కొత్త నిర్మాత అయినా సరే నన్ను నమ్మి ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన బాలయ్య బాబు గారికి సదా కృతజ్ఞుడిని. శ్రీకృష్ణదేవరాయలుగా, కృష్ణ కుమార్‌గా... రెండు పాత్రల్లోనూ ఆయన అద్భుతమైన నటన కనబరిచారు. సినిమాలో చాలా అందంగా కనపడతారు. ఆయన నటనలో రాజసం ఉట్టిపడుతుంది. కథకుడిగా, దర్శకుడిగా సింగీతం శ్రీనివాసరావు గారు అద్భుతమైన ప్రతిభ కనబరిచిన చిత్రమిది. ఇటువంటి కథా ఆలోచన ఆయనకు రావడమే కాదు, తెలుగు తెరపై అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ నభూతో నభవిష్యత్ అనే రీతిలో ఈ సినిమాని తీర్చిదిద్దారు. అప్పట్లో ఈ సినిమా విడుదల సమయంలో నేను ఎంత ఎగ్జైట్ అయ్యానో, ఇప్పుడు రీ రిలీజ్ సమయంలోనూ అంతే ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. ఇళయరాజా గారి సంగీతం, జంధ్యాల గారి మాటలు, ముగ్గురు సినిమాటోగ్రాఫర్లు పీసీ శ్రీరామ్ – వీఎస్ఆర్ స్వామి – కబీర్ లాల్ ఛాయాగ్రహణం ఈ సినిమాని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేశాయి. బాలీవుడ్ టాప్ విలన్ అమ్రిష్ పురి, ఫేమస్ నటుడు టినూ ఆనంద్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఈ సినిమాలో ఇంకా చాలా హైలైట్స్ వున్నాయి. టీవీల్లోనూ, యూట్యూబ్‌లోనూ 'ఆదిత్య 369' చిత్రాన్ని ఎన్నిసార్లు చూసినా సరే, వెండితెరపై చూస్తే వచ్చే అనుభూతి వేరు... మ్యాజిక్ వేరు. దీనికి తోడు ఇప్పుడు డిజిటల్‌గా చేసిన సాంకేతిక హంగులు మా 'ఆదిత్య 369' సినిమాని మరింత అద్భుతంగా మార్చాయి. మా చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 11న గ్రాండ్ రీ రిలీజ్ చేస్తున్నాం. నందమూరి అభిమానులకు మాత్రమే కాదు, తెలుగు ప్రేక్షకులకు ఇదొక గొప్ప కానుక. ఇప్పటి వరకు నిర్మాతగా 15 సినిమాలు చేశాను. ఎన్ని హిట్ సినిమాలు తీసినా సరే... నాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఒక గౌరవాన్ని, గుర్తింపును తీసుకొచ్చిన సినిమా 'ఆదిత్య 369'. మా సంస్థ శ్రీదేవి మూవీస్ పేరును చరిత్రలో నిలిచి పోయేలా చేసిన చిత్రం ఇది. వరుస విజయాలతో ఈ జనరేషన్ ప్రేక్షకులను కూడా ఉర్రూతలూగిస్తున్న బాలయ్య బాబు ప్రభంజనానికి 'ఆదిత్య 369' ఒక తీయటి కొనసాగింపుగా నిలుస్తుంది. ఈ సినిమా మరోసారి ప్రేక్షాదరణ పొంది బాలయ్య బాబు హిట్ హిస్టరీని రిపీట్ చేస్తుందన్న నమ్మకం వుంది" అని అన్నారు.

# ఈ నెల 21న విడుదలకు సిద్ధమవుతున్న "కాలమేగా కరిగింది"



వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "కాలమేగా కరిగింది". ఈ సినిమాను శింగర క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై మరే శివశంకర్ నిర్మిస్తున్నారు. శింగర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. పొయెటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన "కాలమేగా కరిగింది" సినిమా ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫీల్ గుడ్ లవ్ సాంగ్ 'దరీ దాటిన మోహం..' విడుదల చేశారు. 'దరీ దాటిన మోహం..' పాటకు డైరెక్టర్ శింగర మోహన్ బ్యూటిఫుల్ లిరిక్స్ రాశారు. మ్యూజిక్ డైరెక్టర్ గుడప్పన్ మరో మంచి ట్యూన్ అందించారు. సింగర్స్ సాయి మాధవ్, ఐశ్వర్య దరూరి ఆకట్టుకునేలా పాడారు. 'దరీ దాటిన మోహం..' పాట ఎలా ఉందో చూస్తే – ' దరీ దాటిన మోహం దేహమే కదా, ఎదుటే నిలిచేనూ, ఆ యదపై తాకేనూ, చెలీ వీడినా మౌనం, మర్మమే కదా, కథలై కదిలేనూ, ఆ కబురై పాకేనూ..' అంటూ లవ్ ఫీల్ తో సాగుతుందీ పాట. మ్యూజికల్ గా మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది "కాలమేగా కరిగింది" సినిమా. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'తను జతగా..', 'ఊహలోన ఊసులాడే..' సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటున్నాయి.

Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756